www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కారైనా.. బైకైనా.. లారీ అయినా..
రేడియం స్టిక్కర్ తప్పనిసరి
14

- ప్రమాదాల నివారణకు రవాణా శాఖ కీలక నిర్ణయం
- వాహనం, దాని మూలలు కనిపించేలా స్టిక్కర్ ఉండాలి
- రాత్రిపూట వాహనాలు స్పష్టంగా కనిపించడానికే నిబంధన
- అధీకృత సంస్థ నుంచే స్టిక్కర్లు కొనాలని ఉత్తర్వుల్లో ఆదేశం



శనివారం | 13-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 149 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ.7:23 వరకు, సప్తమి తె.5:04 వరకు; నక్షత్రం: కృత్తిక ఉ.10:11 తదుపరి రోహిణి; వర్జ్యం: రా.1:11-2:41; దుర్ముహూర్తం: ఉ.6:06-7:43; అమృతఘడియలు: ఉ.7:57-9:26, తె.5:41 మొదలు; రాహుకాలం: ఉ. 9:00-ఉ.10:30; సూర్యోదయం: 6:06; సూర్యాస్తమయం: 6:15 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కర్ణాటకలో మళ్లీ కులగణన

1.75 లక్షల మంది టీచర్లతో సర్వే.. దసరా సెలవుల్లో నిర్వహణ

పాత సర్వే పదేళ్ల నాటిది.. అందుకే మళ్లీ గణన: సీఎం సిద్దరామయ్య



బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మళ్లీ సామాజిక, విద్య సర్వే (కులగణన)-2025 నిర్వహిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బెంగళూరులోని తన అధికారిక నివాసం కృష్ణలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 7వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు. దీని కోసం రూ.420 కోట్లు కేటాయిస్తామన్నారు. 2015లో అప్పటి

మిగతా 2వ పేజీలో...

జీతంతో పాటు ఎమ్మెల్యే నిధుల్లో 10% కమీషన్

కాన్పూర్, సెప్టెంబరు 12: ఎమ్మెల్యేలుగా తమకి వచ్చే వేతనాలతో పాటు ఎమ్మెల్యే నిధుల్లో 10 శాతం కమీషన్ కూడా తీసుకుంటున్నామని ఏకంగా ఓ ఎమ్మెల్యేనే అందరి ముందు బహిరంగంగా వెల్లడించారు. కాన్పూర్‌లో బీజేపీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో కిద్వాయ్ నగర్ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్ త్రివేది ఈ వ్యాఖ్యలు చేశారు. తాము రెండు రకాలుగా లాభం పొందుతున్నా, క్షేత్ర స్థాయిలో ఉండే కార్యకర్తలకు మాత్రం ఏ ప్రతిఫలమూ దక్కడం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మహేశ్ త్రివేది వ్యాఖ్యలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజకీయ వర్గాల్లో ఇది సంచలనం సృష్టించింది. కాగా, సదరు వీడియోపై మహేశ్ త్రివేది కానీ, బీజేపీ అధిష్ఠానం కానీ స్పందించలేదు.

త్వరలో భారత్‌కు ట్రంప్!

క్వాడ్ సదస్సుకు హాజరయ్యే అవకాశం

భారత్‌ను చైనాకు దూరం చేయడమే లక్ష్యం

భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడి



వాషింగ్టన్, సెప్టెంబరు 12: భారత్‌లో త్వరలో జరగనున్న క్వాడ్ దేశాధినేతల సదస్సుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హాజరయ్యే అవకాశం ఉందని భారత్‌కు అమెరికా రాయబారిగా ట్రంప్ ఇటీవల నియమించిన సెర్గియో గోర్ తెలిపారు. గురువారం ఆయన సెనేట్ ఫారిన్ రిలేషన్స్ కమిటీతో మాట్లాడుతూ, ఈ సదస్సుకు హాజరవడంతో

మిగతా 10వ పేజీలో...



రాష్ట్రపతి భవన్‌లో రాధాకృష్ణన్‌తో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

15వ ఉపరాష్ట్రపతిగా
రాధాకృష్ణన్ ప్రమాణం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమక్షంలో కార్యక్రమం

మోదీ, ఖర్గే, కేంద్ర మంత్రులతో పాటు మాజీ ఉపరాష్ట్రపతులు వెంకయ్య, అన్సారీ, ధన్‌ఖడ్ హాజరు

ఏపీ సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా..

హాజరు కాని రాహుల్ గాంధీ, ఇతర విపక్షాల నేతలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారత 15వ ఉపరాష్ట్రపతిగా చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో పదవీప్రమాణం చేయించారు. రాధాకృష్ణన్ తమిళ సంప్రదాయ దుస్తులు, ఎర్ర కుర్తా ధరించి వచ్చిన ఆయన.. భగవంతుడిపై ఆంగ్లంలో ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, చంద్రబాబు సహా ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ఉపరాష్ట్రపతులు వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ, పార్లమెంటు సభ్యులు కూడా పాల్గొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ సైతం సతీసమేతంగా హాజరవడమే గాక.. అందరినీ నవ్వుతూ పలకరించడం గమనార్హం. వెంకయ్య పక్కనే ఆసీనులయ్యారు. జూలై 21న రాజీనామా చేశాక ఆయన బహిరంగంగా కనిపించడం ఇదే ప్రథమం. అనారోగ్య కారణాలతో ఆయన రాజీనామా చేయడం

మిగతా 10వ పేజీలో...

అఫిడవిట్‌పై ఏం చేద్దాం?

సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో సీసీఎల్ఏ నిబంధనలపై తర్జన భర్జన

భూభారతి చట్టంలో లేని మూడు కొత్త అంశాలను నిబంధనల్లో పేర్కొన్న సీసీఎల్ఏ

అఫిడవిట్ సేకరించడం తలనొప్పిగా మారుతుందంటున్న రెవెన్యూ యంత్రాంగం

అమలు చేయాలా? వద్దా?.. సందిగ్ధం

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించగా.. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) విధించిన నిబంధనలు ఇందుకు అవరోధంగా మారుతున్నాయి. ప్రధానంగా సాదాబైనామా దరఖాస్తుదారు.. భూమి కొనుగోలు చేసిన వ్యక్తి నుంచి అఫిడవిట్ తీసుకురావాలన్న నిబంధన వివాదంగా మారే పరిస్థితి కనిపిస్తోంది. దీంతో ఈ నిబంధనను ఉంచాలా? తొలగించాలా? అన్న చర్చ అధికారుల్లో జరుగుతోంది. భూభారతి చట్టం సెక్షన్-6, సబ్ సెక్షన్-1 ప్రకారం సాదాబైనామాలను పరిష్కరించే అధికారాలు కల్పిస్తూ ఈ నెల 10న రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్ జీవో నంబరు 106 ఇచ్చారు. అయితే భూభారతి చట్టంలో పేర్కొనని మూడు నిబంధనల్ని సీసీఎల్ఏ ఇందులో చేర్చారు. అందులో ఒకటి అఫిడవిట్ తీసుకురావాలనే

మిగతా 3వ పేజీలో...



బాసర నుంచి భద్రాచలం దాకా..
శాశ్వత ఘాట్లు

- రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలూ శాశ్వత ప్రాతిపదికనే 13
- దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు నిర్వహిద్దాం
- ప్రధాన ఆలయాలు, అక్కడి ఘాట్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం
- ఒకేరోజు 2 లక్షల మంది వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు
- గోదావరి పుష్కరాలపై సమీక్షలో అధికారులకు సీఎం నిర్దేశం

15 నుంచి ఉన్నత విద్యాసంస్థల
బంద్!

- ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య నిర్ణయం
- రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి
- ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందించని ప్రభుత్వం
- కాలేజీల నిర్వహణ భారంగా మారింది: సమాఖ్య
- ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు, విద్యాశాఖ కార్యదర్శికి నోటీసు అందజేత
- సీఎంతో మాట్లాడతానన్న యోగితా రాణా
- నేడు చర్చలకు రావాలన్న వేం నరేందర్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 15 నుంచి అన్ని ఉన్నత విద్యాసంస్థలను నిరవధికంగా బంద్ చేస్తామని ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. మొత్తం రూ.8 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, దీనిపై కొద్ది నెలలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా ఫలితం లేదని పేర్కొంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బంద్ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఈ మేరకు సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని కలిసి బంద్ నోటీసు అందజేశారు. బడ్జెట్‌లో కేటాయించి.. ఇప్పటికే టోకెన్లు జారీ చేసిన రూ.1200 కోట్ల బకాయిలను

మిగతా 12వ పేజీలో...



ఇక్రిశాట్ ప్రతినిధులతో సమావేశమైన వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

27,650 టన్నులు

రాష్ట్రానికి నాలుగు రోజుల్లో రానున్న యూరియా

గత 2 రోజుల్లో 23 వేల టన్నుల సరఫరా


రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి తోడ్పడేలా వ్యవసాయశాఖకు ప్రత్యేక యాప్: మంత్రి తుమ్మల

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మరో నాలుగు రోజుల్లో రాష్ట్రానికి 27,650 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని, గత రెండ్రోజుల్లో 23 వేల టన్నుల యూరియా రాష్ట్రానికి సరఫరా అయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, డైరెక్టర్ గోపి, ఇతర అధికారులతో తుమ్మల సమీక్ష నిర్వహించారు. గురువారం ఒక్కరోజే వివిధ కంపెనీల నుంచి 11,930 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి వచ్చిందని, శనివారం మరో 5,680 మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి వస్తుందని తెలిపారు. వివిధ కంపెనీల నుంచి 11 రైల్వే రేకుల యూరియా రాష్ట్రానికి ఇప్పటికే తరలిందని, 18 తేదీ నాటికి మరో 11 రైల్వే రేకుల యూరియాకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. మిర్యాలగూడ, కరీంనగర్, వరంగల్, పందిళ్లపల్లి, సనత్‌నగర్,

మిగతా 13వ పేజీలో...

లోక్‌సభలోనే వారసులెక్కువ!

- 543 మంది ఎంపీల్లో 31% మంది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలవారే!
- దేశంలోని అసెంబ్లీల్లో 20%, శాసన మండలిల్లో 22%
- ఏపీలో 8, తెలంగాణలో 11 మంది ఎంపీలు వారసులే
- పురుషుల కన్నా మహిళల్లోనే అధికం: ఏడీఆర్ నివేదిక
- జాతీయ పార్టీల్లో కాంగ్రెస్‌లో వారసులెక్కువని వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శాసనసభల్లో కన్నా లోక్‌సభలోనే వారసుల సంఖ్య అధికంగా ఉందని, దేశంలో వారసత్వ రాజకీయాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తెలిపింది. 543 మంది లోక్‌సభ ఎంపీల్లో 167 మందికి.. అంటే, 31 శాతం మందికి వారసత్వ నేపథ్యం ఉండగా, 224 మంది రాజ్యసభ ఎంపీల్లో 47 మందికి (21 శాతం) వారసత్వ నేపథ్యం ఉన్నదని వెల్లడించింది. ఈ మేరకు ఏడీఆర్ శుక్రవారం

మిగతా 2వ పేజీలో...



కరీంనగర్ జిల్లాలో భారీ వర్షాలకు సోమారం మోడల్ స్కూల్ ఆవరణలో భారీగా నిలిచిన నీరు.. బయటకొస్తున్న విద్యార్థులు

నేడు, రేపు
భారీ వర్షాలు

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో దంచికొట్టిన వాన

భూపాలపల్లి జిల్లాలో పిడుగుపాటుకు 94 గొర్రెల మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శని, ఆదివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, ములుగు సహా మరికొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్

మిగతా 14వ పేజీలో...

నేపాల్ తాత్కాలిక ప్రధాని
సుశీల కర్కి

- రాత్రి 9.30 గంటలకు ప్రమాణ స్వీకారం
- ఆ వెంటనే కీలక అధికారులతో భేటీ
- వచ్చే ఏడాది మార్చి 4న ఎన్నికలకు ప్రతిపాదన
- అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేలా నేపాల్‌లో ఎమర్జెన్సీకి సిఫారసు
- ప్రభుత్వంలో చేరని 'జెన్ జెడ్' ప్రతినిధులు
- హోటల్‌కు నిరసనకారుల నిప్పు.. కిందికి దూకిన భారతీయురాలి మృతి
- భారతీయ పర్యాటకుల బస్సుపై రాళ్లు



కాఠ్మండూ, సెప్టెంబరు 12: 'జెనరేషన్ జెడ్' యువత ఆందోళనలతో అట్టుడికిన నేపాల్‌లో పరిస్థితులు కొలిక్కి వస్తున్నాయి. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి బాధ్యతలు చేపట్టారు. నేపాల్ అధ్యక్ష కార్యాలయంలో అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్, ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్దెల్‌తో

మిగతా 12వ పేజీలో...

పట్టపగలు సినీఫక్కీలో దారిదోపిడీ..
40 లక్షలు చోరీ

- ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి కారుతో ఢీకొట్టిన దుండగులు 12
- లోపలున్న వారిపై కారం చల్లి.. డమ్మీ పిస్తోలు, కత్తులతో బెదిరించి దోపిడీ
- రంగారెడ్డి జిల్లా కొత్తపల్లిలో ఘటన

బ్యాంకులో 5 లక్షలు కాజేసిన బాలుడు!

- సీసీ కెమెరా ఫుటేజీతో నిర్ధారణ
- నిజామాబాద్ జిల్లా బోధన్ ఎస్బీఐలో ఘటన.. చోరీపై పోలీసుల దర్యాప్తు
- ఈ నెల 8న ఘటన 14
- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం



బాణసంచా నిషేధంపై జాతీయ విధానం ఉండాలి కదా?

కాలుష్య నియంత్రణను ఢిల్లీకే పరిమితం చేయడం ఎందుకు?: సుప్రీంకోర్టు 2

రియల్ ఎస్టేట్ వ్యాపారి
దారుణ హత్య

- నడిరోడ్డుపైనే ఘటన
- హైదరాబాద్ కుషాయిగూడలో ఘోరం
- వ్యాపార ఆర్థిక లావాదేవీలే కారణం
- పోలీసుల అదుపులో నిందితుడు 12

బీసీ డిక్లరేషన్ విజయోత్సవ
సభ వాయిదా

- 15న కామారెడ్డిలో నిర్వహించాలని ఇంతకుముందు పీసీసీ నిర్ణయం
- భారీ వర్ష సూచన నేపథ్యంలో వాయిదా
- సభ నిర్వహణ తేదీని మళ్లీ ప్రకటిస్తాం
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ 13

ఈశాన్యాన వెలుగు రేఖ!

మిజోరంలో ఇంజనీరింగ్ అద్భుతం.. కొండలు, లోయల గుండా రైల్వేలైన్ నిర్మాణం

రాజధాని ఐజ్వాల్‌కు ఇక రైళ్ల పరుగు.. బైరాబి-సాయ్‌రంగ్ లైన్‌కు నేడు ప్రధాని ప్రారంభం

బైరాబి-సాయ్‌రంగ్ లైన్‌లో బ్రిడ్జి నంబర్ 144 ఇది. దీనిలోని అత్యంత పొడవైన ఈ పిల్లర్ ఎత్తు 114 మీటర్లు (374 అడుగులు)



ఆకాశానికి నిచ్చెన వేస్తున్నట్టు అంతెత్తు పిల్లర్.. అది కూడా మామూలుగా కాదు.. అత్యంత ఎత్తైన రాతి కట్టడం కుతుబ్‌మినార్ (72 మీటర్లు) కంటే మరో 42 మీటర్లు ఎత్తున్న 114 మీటర్ల అతి భారీ పిల్లర్.. దానిపై ఇంజనీరింగ్ నైపుణ్యానికి అద్దం పట్టే ఇనుప బ్రిడ్జి.. కిందికి చూస్తే కళ్లు తిరిగే లోయ.. దాటి కాస్త ముందుకెళితే మరికొన్ని భారీ వరుస బ్రిడ్జిలు.. ఒక దాని వెంట ఒకటిగా వచ్చే పొడవాటి టన్నెళ్లు.. ఈశాన్య భారతాన సరికొత్త వెలుగురేఖలా పేర్కొనదగ్గ బైరాబి-సాయ్‌రంగ్ రైల్వే లైన్‌పై వెళుతున్నప్పుడు కనిపించే అద్భుతాలివి.. మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు రైల్ కనెక్టివిటీ కోసం నిర్మించిన ఈ లైన్‌ను ప్రధాని మోదీ శనివారం స్వయంగా ప్రారంభించబోతున్నారు. ఈ సందర్భంగా దాని విశిష్టతలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

(ఐజ్వాల్ నుంచి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ప్రతినిధి)

ఐజ్వాల్.. మిజోరం రాజధాని. ఎటు చూసినా పచ్చని అడవులతో నిండిన కొండలు. అగాధాలను తలపించే లోయలు. ఆ లోయల్లో జలజల పారే నీటి హొయలు. ప్రతి కొండ అంచున ప్రజల ఆవాసం. చదునైన ప్రాంతం ఉన్నా లేకున్నా, ప్రకృతి సవాళ్లకు ఎదురీదే రీతిలో లోయలోకి ఎప్పుడు జారిపోతాయో అనేలా నిర్మించిన ఇళ్లు. 20-25 అడుగుల లోతు నుంచి వేసిన కాంక్రీట్ పిల్లర్లు లేదా పొడవాటి వెదురు దుంగలతో నిర్మించిన ఇళ్లే ఆవాసం. కొండ అంచుకు, ఆ ఇళ్లకు మధ్య నుంచి వేసిన రోడ్లే ప్రయాణ మార్గాలు. ఇన్ని ప్రకృతి సవాళ్ల మధ్య జీవనం సాగించే ఐజ్వాల్ వాసుల జీవితాల్లో సరికొత్త వెలుగు రేఖ బైరాబి-సాయ్‌రంగ్ రైల్వే లైను. ఇళ్లు, రోడ్లు నిర్మించడమే సవాల్‌గా ఉండే మిజోరం లో నిర్మించిన 51.38 కిలోమీటర్ల ఈ లైను ఒక ఇంజనీరింగ్ అద్భుతమనే చెప్పాలి.

11 ఏళ్ల సుదీర్ఘ యజ్ఞం

అన్ని రాష్ట్రాల రాజధానులనూ రైల్ నెట్‌వర్క్‌తో కలపాలన్న లక్ష్యంలో భాగంగా మిజోరం రాజధాని ఐజ్వాల్‌కు రైల్వే లైన్ వేసే ప్రాజెక్టుకు ప్రధాని మోదీ 2014లో శంకుస్థాపన చేశారు. అప్పటిదాకా మిజోరంలోని బైరాబి వరకు మాత్రమే రైల్వే లైను ఉండేది. అసోం సరిహద్దుకు సమీపంలోని ఈ స్టేషన్ వరకు లైన్ ఉన్నప్పటికీ మిజోరం ప్రజలకు పెద్దగా ఉపయోగం లేదనే చెప్పాలి. అందుకే రాజధాని ఐజ్వాల్‌ను కలిపే లక్ష్యంతో ఈ బైరాబి నుంచి ఐజ్వాల్ పక్కనుండే సాయ్‌రంగ్‌కు లైన్ వేసే యజ్ఞాన్ని తలపెట్టారు. కానీ ఈ మార్గం పొడవునా ఎత్తైన కొండలు, భారీ లోయలే ఉన్నాయి. వాటన్నింటి మధ్య నుంచి ఎత్తు పల్లాల్లేకుండా సమాంతరంగా రైల్వే లైన్ నిర్మించడమంటే ఎన్నో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పనే. రూ.5 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయ్యే సరికి రూ.8 వేల కోట్లకు పైగా ఖర్చయ్యింది.



బైరాబి-సాయ్‌రంగ్ లైన్‌లో నిర్మించిన ఓ భారీ టన్నెల్

ఎన్నెన్నో సవాళ్లు!

మైదాన ప్రాంతంలో ఓ కొత్త రైల్వే లైను నిర్మించడానికే ఏళ్లకు ఏళ్లు పట్టడం మనం చూస్తుంటాం. అలాంటిది పూర్తిగా కొండలు, లోయలతో నిండి ఉన్న ప్రాంతంలో ప్రాజెక్టు అంటే ఇక చెప్పేదేముంది. కొండలను తొలిచి టన్నెల్స్ నిర్మించి, వందల అడుగుల లోతున్న లోయల నుంచి పిల్లర్స్ వేసి భారీ గర్డర్స్‌తో బ్రిడ్జిలు కడితే గానీ ముందుకు సాగని ప్రాజెక్టు ఇది. పైగా మిజోరంలో ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు వర్షాలు పడుతూనే ఉంటాయి. అంటే ఏడాదిలో నవంబరు నుంచి మార్చి వరకు 5 నెలలు మాత్రమే పనులు సాగేవి. ఇక వంతెనలు, టన్నెల్స్ నిర్మించాలంటే భారీ యంత్ర సామగ్రిని తరలించాలి. ఇది మరో సవాల్. వాటి తరలింపు కోసం ఏకంగా 200 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాల్సి వచ్చింది. ఈ భారీ ప్రాజెక్టుకు ఇసుక, కంకరతో సహా దాదాపు నిర్మాణ సామగ్రి మొత్తాన్ని అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల నుంచి తరలించాల్సి రావడం మరో సవాల్.

ఇంజనీరింగ్ అద్భుతం!

బైరాబి-సాయ్‌రంగ్ లైన్ మొత్తం పొడవులో 54% మేర బ్రిడ్జిలు, టన్నెల్సే ఉంటాయంటే ఇదెంత కష్టసాధ్యమైన ప్రాజెక్టు అనేది అర్థం చేసుకోవచ్చు. చిన్నవాటిని పక్కనపెట్టినా 55 ఎత్తైన బ్రిడ్జిలు కట్టారు. మరీ ముఖ్యంగా ఈ కొండ అంచు నుంచి ఆ కొండ అంచుకు మధ్యలో ఉన్న లోయ మీదుగా బ్రిడ్జిలు వేయడానికి దాదాపు ఆరుచోట్ల అతి ఎత్తైన పిల్లర్లు వేయాల్సి వచ్చింది. 70 మీటర్ల నుంచి 114 మీటర్ల ఎత్తున్న పిల్లర్లు నిర్మించి, వాటిని కలుపుతూ ఇనుప గర్డర్లతో వేసిన ఆ బ్రిడ్జిలను చూస్తే ఇంజనీర్ల శ్రమ కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. అన్నిటికంటే ఎత్తైన 144వ నంబరు బ్రిడ్జి సాయ్‌రంగ్ స్టేషన్‌కు సమీపంలోనే ఉంది. మొత్తం 5 పిల్లర్లు ఉండగా, ఒక దాని ఎత్తు 114 మీటర్లు (374 అడుగులు). దేశంలోని రైల్వే ప్రాజెక్టుల్లో నిర్మించిన అతి ఎత్తైన పిల్లర్లలో ఇది రెండవది. మణిపూర్‌లో ఉన్న అతి భారీ పిల్లర్ ఎత్తు 141 మీటర్లు. ఇక కొండలను తొలుస్తూ వేసిన టన్నెల్స్ పొడవు మొత్తం లైన్‌లో 31 శాతం.

మారనున్న ముఖచిత్రం!

బైరాబి-సాయ్‌రంగ్ రైల్వే లైన్‌ను ఐజ్వాల్‌కు గేమ్ చేంజర్‌గా భావిస్తున్నారు. రాజధానికి రైల్ కనెక్టివిటీ ఏర్పడటంతో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కనుంది. ముఖ్యంగా సరుకు రవాణా పెరగడంతో నిత్యావసరాల ధరలు తగ్గి ప్రజలకు పెద్ద ఊరట లభిస్తుంది. అలాగే మిజోరంలో విరివిగా లభించే అటవీ ఉత్పత్తులకు, ఉద్యాన ఉత్పత్తులకు, అక్కడ తయారయ్యే కళాకృతులకు బయటి మార్కెట్లు అందుబాటులోకి వస్తాయి. ఈ లైన్‌ను శనివారం ప్రధాని మోదీ ప్రారంభించగానే ఏకంగా ఢిల్లీకి కూడా రాజధాని ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి రావడం మిజోరం యువత ఉద్యోగావకాశాలను పెంచే అంశమే. ఇక పచ్చటి అందాలతో అలరారుతూ, ఏడాదిలో అత్యధిక కాలం జల్లులు పడుతుండే మిజోరంలో పర్యాటకం కొత్త పుంతలు తొక్కేందుకూ మార్గం సుగమమవుతుంది. తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని పలు ప్రాంతాల పర్యాటకులు ఇకపై ఐజ్వాల్‌నూ తమ పర్యాటక గమ్యంగా ఎంచుకునే అవకాశముంది.

ఎన్నెన్నో విశేషాలు!

రైల్వే లైన్ పొడవు 51.38 కిలోమీటర్లు
ప్రాజెక్టు వ్యయం రూ.8,071 కోట్లు

ఎంత స్పీడ్‌కు అనుకూలం: గంటకు వంద కిలోమీటర్లు
మొత్తం బ్రిడ్జిలు: 143
వాటి పొడవు: 11.78 కిలోమీటర్లు
వాటిలో అతి పెద్దవి: 6
అత్యంత ఎత్తైన పిల్లర్: 114 మీటర్లు (374 అడుగులు)
ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు: 10
మొత్తం టన్నెళ్లు: 45
వాటి పొడవు: 15.88 కిలోమీటర్లు
వాటిలో అతి పొడవైనది: 1.8 కిలోమీటర్లు

అల్బేనియాలో 'ఏఐ మంత్రి'

» ప్రపంచంలోనే తొలిసారిగా..!



తిరానా, సెప్టెంబర్ 12: ఐరోపా దేశమైన అల్బేనియా ప్రపంచంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే ఒక మహిళా మంత్రిని నియమించింది. ఆ దేశ సంప్రదాయ దుస్తుల్లో కనిపించే ఈ ఏఐ మంత్రికి డి యెల్లా అని పేరు కూడా పెట్టారు. అల్బేనియాలో అవినీతిని అరికట్టాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు దేశ ప్రధాని ఏడీ రామా ప్రకటించారు. ముఖ్యంగా పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ విభాగంలో అవినీతి సమస్య అల్బేనియా ప్రభుత్వాన్ని చాలా ఏళ్లుగా వేధిస్తోంది. ఈ నేపథ్యంలోనే యూరోపియన్ యూనియన్‌లో చేరాలన్న అల్బేనియా కలను నెరవేర్చుకోవడానికి అవినీతి నిర్మూలన కీలకంగా మారిందని ప్రధాని రామా అభిప్రాయపడ్డారు. పబ్లిక్ టెండర్లకు సంబంధించి ఎలాంటి అవినీతి జరగకుండా డియెల్లా నిఘా పెట్టనుందని, ప్రభుత్వ నిధులు పారదర్శకంగా కేటాయింపులు జరిగేలా పర్యవేక్షిస్తుందని వెల్లడించారు.

గణేశ్ శోభాయాత్రపైకి దూసుకెళ్లిన కంటెయినర్

హాసన్ జిల్లాలో 8 మంది మృతి.. పలువురికి గాయాలు



బెంగళూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గణేశ్ నిమజ్జనోత్సవంలో ఊహించని ప్రమాదం జరిగింది. శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులపైకి మినీ కంటెయినర్ దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు, 20 మందికిపైగా గాయపడ్డారు. హాసన్ జిల్లా మొసళె హొసహళ్లి గ్రామంలో శుక్రవారం రాత్రి నిమజ్జనం సందర్భంగా శోభాయాత్ర నిర్వహిస్తుండగా ఈ ఘటన జరిగింది. ఘటనా స్థలంలోనే నలుగురు మృతి చెందగా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మరో నలుగురు మరణించారు. మృతుల కుటుంబాలకు సీఎం సిద్దరామయ్య రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

ఎస్‌ఐఆర్‌లో 12వ ధ్రువ పత్రంగా ఆధార్ కార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: దేశవ్యాప్తంగా చేపట్టే ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో ఓటర్ల ఆధార్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఈసీ నిర్ణయించింది. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించే ధ్రువపత్రాల జాబితాలో ఆధార్‌ను కూడా చేర్చాలని రాష్ట్రాల ఎన్నికల ప్రధానాధికారుల(సీఈవోల)కు సూచించింది. ఓటరు జాబితా వెరిఫికేషన్ సందర్భంగా ఓటరు గుర్తింపు కోసం ప్రస్తుతం పరిశీలిస్తున్న 11 ధ్రువ పత్రాలతోపాటు ఆధార్‌ను కూడా చేర్చాలంటూ ఈ నెల 8న సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

టేకాఫ్ సమయంలో ఊడిన విమాన చక్రం



ముంబై, సెప్టెంబరు 12: స్పైస్‌జెట్ విమానానికి శుక్రవారం ఘోర ప్రమాదం తప్పింది. ముంబైకి రావాల్సిన స్పైస్‌జెట్ క్యూ400 విమానం గుజరాత్‌లోని కాండ్లా విమానాశ్రయంలో టేకాఫ్ అవుతుండగా వెనుకభాగంలో ఉండే కుడి చక్రం ఊడిపోయింది. దీంతో ఏమవుతుందోనని విమానంలోని 75 మంది ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే విమానం ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ ఇంటర్నేషనల్ విమానాశ్రయంలో సురక్షితంగా దిగింది. మధ్యాహ్నం 3.51 గంటలకు విమానం అత్యవసర లాండింగ్ జరిగిందని అధికారులు తెలిపారు.

శబరి ఆలయంలో ద్వారపాలక విగ్రహాల బంగారు తాపడం తొలగింపు

కోచి, సెప్టెంబరు 12: శబరిమలలోని అయ్యప్ప ఆలయం వివాదంలో చిక్కుకొంది. సన్నిధానంలోని ద్వార పాలక విగ్రహాలకు ఉన్న బంగారు తాపడం రేకులను తొలగించడంపై ఆరోపణలు వచ్చాయి. చంద్రగ్రహణం పేరుతో విగ్రహాలకు ఉన్న బంగారు రేకులను తొలగించి అక్రమ రవాణా చేశారన్న ప్రచారం జరిగింది. ఏకంగా ద్వారపాలక విగ్రహాలనే తొలగించారన్న వదంతులు కూడా వ్యాపించాయి. వీటిపై కేరళ హైకోర్టు తనకుతానుగా సుమోటో విచారణ చేపట్టింది. బంగారు తాపడం పనులకు సంబంధించిన మొత్తం రికార్డులను స్వాధీనం చేసుకోవాలని శుక్రవారం ఆదేశించింది. శబరిమల ఆలయ స్పెషల్ కమిషనర్‌కు సమాచారం ఇవ్వకుండా విగ్రహాలకు ఉన్న బంగారు పూత పూసిన రాగి రేకులు తొలగించడాన్ని తీవ్రంగా పరిగణించింది.

బాణసంచాపై నిషేధం

ఢిల్లీకే పరిమితం ఎందుకు?

» జాతీయ విధానం ఉండాలి కదా?

» కేంద్రానికి సుప్రీంకోర్టు ప్రశ్నలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: బాణసంచా నిషేధం ఒక్క ఢిల్లీ-దేశ రాజధాని ప్రాంతానికే పరిమితం చేయడం ఎందుకని, దానిపై జాతీయ విధానం రూపొందించవచ్చు కదా అని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. స్వచ్ఛమైన గాలి కేవలం రాజధానిలోని ఉన్నత వర్గాల వారికే పరిమితం కాకూడదని, దేశంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండాలి కదా అని వ్యాఖ్యానించింది. కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యే విధంగా విధానాన్ని రూపొందించడం ఏమిటని ప్రశ్నించింది. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ తాను గత శీతాకాలంలో అమృత్‌సర్‌లో ఉన్నప్పుడు అక్కడ ఢిల్లీ కన్నా అధికంగా కాలుష్యం ఉండడాన్ని గమనించానని, అక్కడ మాత్రం బాణసంచాపై నిషేధం లేదని అన్నారు. "ఒక వేళ బాణసంచాను నిషేధిస్తే దానిని దేశమంతటా నిషేధించాలి" అని చెప్పారు. దీనిపై కోర్టు సహాయకురాలిగా వ్యవహరిస్తున్న అపరాజిత సింగ్ స్పందిస్తూ కాలుష్యం ఒక్క ఉన్నత వర్గాల సమస్య అని భావించడం సరికాదని చెప్పారు. ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అయినా ఢిల్లీలో కాలుష్యం పెరిగినప్పుడు ఉన్నతవర్గాల వారు వేరేచోటికి వెళ్లి ఎవరి జాగ్రత్తల్లో వారు ఉంటున్నారని అన్నారు.

కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి సమాధానం ఇస్తూ 'గ్రీన్ క్రాకర్స్' ద్వారా కాలుష్యాన్ని తగ్గించే విషయమై జాతీయ పర్యావరణ ఇంజినీరింగ్ పరిశోధన సంస్థ (నీరి) అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఈ సమస్యపై వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ నుంచి సవివరమైన నివేదిక తెప్పించాలని ధర్మాసనం ఆమెకు సూచించింది. బాణసంచా తయారీదార్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎలాంటి రసాయన మిశ్రమాలను ఉపయోగించాలో 'నీరి' సూచిస్తే దానిని తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. మరో సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ మాట్లాడుతూ బాణసంచా తయారీపై ఆంక్షలు విధించడంతో పాటు 2028 వరకు మంజూరు చేసిన లైసెన్సులను కూడా అధికార్లు రద్దు చేస్తున్నారని చెప్పారు. బాణసంచా వ్యాపారుల లైసెన్సుల రద్దుపై యథాతథ స్థితి కొనసాగుతుందని చెప్పిన ధర్మాసనం తదుపరి విచారణను 22కు వాయిదా వేసింది.

సుప్రీం ఆవరణలో ఫొటోలపై నిషేధం

సుప్రీంకోర్టు ప్రధాన ప్రాంగణంలో ఫొటోలు, వీడియోలు, రీల్స్ చేయడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీన్ని 'హై సెక్యూరిటీ జోన్'గా పరిగణించిన సుప్రీంకోర్టు.. అక్కడి లాన్‌లోకి కెమేరాలు, ట్రైపాడ్‌లు, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను తీసుకెళ్లకూడదంటూ బుధవారం సర్క్యులర్ జారీ చేసింది.


బెయిల్ పిటిషన్లపై 2 నెలల్లోనే నిర్ణయం

బెయిల్ పిటిషన్లపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం అన్ని హైకోర్టులకు సూచించింది. బెయిల్ పిటిషన్లను దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెట్టడం న్యాయాన్ని నిరాకరించడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. దీనిపై అన్ని జిల్లా కోర్టులకు సూచనలు ఇవ్వాలని హైకోర్టులను ఆదేశించింది. కేసులోని మెరిట్ ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది.

దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపును పరిశీలించండి

ప్రతిభ చూపిన దివ్యాంగులకు జనరల్ కోటా వర్తింపుచేయడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు శుక్రవారం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువ మార్కులు సంపాదిస్తే వారికి జనరల్ కోటాలో సీట్లు ఇస్తున్నారని, అదే విధానాన్ని దివ్యాంగులకు కూడా అమలు చేయాలని అభిప్రాయపడింది. వారికి కేవలం దివ్యాంగుల కోటాలోనే సీట్లు ఇస్తామనడం వివక్ష కిందకే వస్తుందని తెలిపింది. దీనిపై అక్టోబరు 14లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. పదోన్నతుల్లోనూ ఈ విధానాన్ని అవలంబించాలని సూచించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 13కు వాయిదా వేసింది.

లోకం తీరు



రీట్వీట్‌కు మసాలా పెట్టారుగా!

» కంగనా రనౌత్‌పై సుప్రీంకోర్టు వ్యాఖ్య

» క్యాష్ పిటిషన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: "మీరు చేసింది కేవలం ట్వీట్‌ను రీట్వీట్ చేయడం కాదు. దానికి మసాలా జోడించారు" అని శుక్రవారం బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తనపై నమోదైన పరువు నష్టం దావాను కొట్టివేయాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన క్యాష్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్య చేసింది. 2020-21లో జరిగిన రైతుల ఉద్యమం సందర్భంగా ఆమె మహీందర్ కౌర్ (73) అనే వృద్ధురాలిని ఉద్దేశించి చేసిన ట్వీట్ వివాదాస్పదమయింది. ఇంతకుముందు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా ఢిల్లీలోని షహీన్‌బాగ్‌లో జరిగిన ఆందోళనలో కూడా కౌర్ పాల్గొన్నారంటూ.. 'షహీన్‌బాగ్‌లో పాల్గొన్న దాదీ కూడా ఈమే. వంద రూపాయలకు దొరుకుతుంది' అని ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, తానెప్పుడూ షహీన్‌బాగ్ ఉద్యమంలో పాల్గొనలేదని పేర్కొంటూ మహీందర్ కౌర్ కంగనపై పరువు నష్టం దావా వేశారు. దీనిని కొట్టివేయాలని కోరుతూ కంగనా దాఖలు చేసిన క్యాష్ పిటిషన్‌ను కింది కోర్టులు అంగీకరించకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కంగన తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'షహీన్‌బాగ్‌లో పాల్గొన్న దాదీ కూడా ఈమే' అంటూ తొలుత ఒకరు చేసిన ట్వీట్‌ను చాలా మంది రీట్వీట్ చేశారని, కంగనా కూడా రీట్వీట్ చేశారని చెప్పారు. దీనిపై జస్టిస్ మెహతా స్పందిస్తూ రీట్వీట్‌లో 'వంద రూపాయలకు దొరుకుతుంద'ంటూ మసాలా జోడించారని, అదే ఇప్పుడు పరువు నష్టానికి కారణమైందని తెలిపారు.

కర్ణాటకలో మళ్లీ కులగణన

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ అధ్యక్షుడు కాంతరాజ్ నివేదిక సమర్పించారని, ఆ సర్వే ముగిసి పదేళ్లు కావడంతో కొత్త సర్వే చేయించాలని తీర్మానించామని వెల్లడించారు. ఈ సర్వేను శాశ్వత బీసీ కమిషన్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ప్రజల సామాజిక స్థితిగతులను తెలుసుకునేందుకు వీలుగా సర్వే కోసం 60 ప్రశ్నలను రూపొందించారని వెల్లడించారు. ప్రతి ఒక్కరి సామాజిక, విద్య, రాజకీయ, ఆర్థిక స్థితిగతులు తెలిసినప్పుడు మాత్రమే సంక్షేమ పథకాలను సమగ్రంగా అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. సర్వే గణాంకాలు ఇందుకు దోహదపడతాయని తెలిపారు. గ్యారెంటీ పథకాల ద్వారా అసమానతలను కొంతమేర తగ్గించే ప్రయత్నం చేశామని చెప్పారు. బీసీ వర్గాలలో పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత తగ్గేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని గుర్తించామని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలోని 7 కోట్ల ప్రజల సామాజిక, విద్య పరిస్థితులను తెలుసుకునేందుకు మధుసూదన నాయక్ అధ్యక్షతన కమిషన్ సర్వే చేస్తుందని తెలిపారు. కాగా.. దసరా సెలవుల్లో నిర్వహించనున్న ఈ సర్వేలో 1.75 లక్షల మంది ఉపాధ్యాయులు పాల్గొంటారని, వారి సేవలను సద్వినియోగం చేసుకుంటామని సీఎం సిద్దరామయ్య వెల్లడించారు. ఒక్కో ఉపాధ్యాయుడికి 120 నుంచి 150 ఇళ్లను కేటాయిస్తామని, ఇందుకోసం వారికి రూ.20 వేలు గౌరవ వేతనం ఇస్తామని చెప్పారు. దీనికి రూ.325 కోట్లు ఖర్చు అవుతుందని, సర్వే ఖర్చు తాత్కాలిక అంచనా రూ.420 కోట్లుగా నిర్ణయించామని, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. ఎస్సీ రిజర్వేషన్ల కోసం చేపట్టిన సర్వేలో ఉపయోగించిన టెక్నాలజీనే ఈ సర్వేలోనూ ఉపయోగిస్తారని, ప్రతి ఇంటి విద్యుత్ మీటరు ఆధారంగా జియోట్యాగ్ చేసి, యూహెచ్ఐడీ ప్రత్యేక సంఖ్యను నమోదు చేస్తారని తెలిపారు.

లోక్‌సభలోనే వారసులెక్కువ!

(మొదటి పేజీ తరువాయి)

ఒక నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో 20% మంది ఎమ్మెల్యేలకు, శాసనమండలిల్లో 22% మంది ఎమ్మెల్సీలకు కుటుంబ వారసత్వం ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లోనే అత్యధికంగా వారసులు ఉన్నారు. ఆ రాష్ట్రానికి చెందిన 604 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల్లో 141 మంది వారసులే. యూపీ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర (129 మంది), బిహార్ (96 మంది), కర్ణాటక (94 మంది) ఉన్నాయి. వారసుల విషయంలో తెలంగాణ 9వస్థానంలో ఉంది. తెలంగాణలో 176 మంది చట్టసభల సభ్యుల్లో 43 మంది (24%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చారు. 11 మంది ఎంపీలు వారసత్వ నేపథ్యం నుంచే వచ్చారు. వారిలో గడ్డం వంశీకృష్ణ, సురేష్ షెట్కార్, జీ నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అసదుద్దీన్ ఒవైసీ, ఆర్ రఘురాం రెడ్డి, మల్లు రవి, కె రఘువీర్, ధర్మపురి అర్వింద్, డీకే అరుణ, కడియం కావ్య ఉన్నారు. ఈ జాబితాలో ఐదవ స్థానంలో ఉన్న ఏపీలో మొత్తం 255 మంది చట్టసభల సభ్యులు ఉండగా.. వారిలో 86 మంది (34%) వారసులేనని ఏడీఆర్ తేల్చింది. ఏపీకి చెందిన లోక్‌సభ ఎంపీల్లో ఎనిమిది మందికి రాజకీయ వారసత్వం ఉంది. వారిలో జీఎం హరీశ్, అవినాశ్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, పుట్టా మహేష్ కుమార్, కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి, దగ్గుబాటి పురందేశ్వరి ఉన్నారు. కాగా, దేశవ్యాప్తంగా చట్టసభల సభ్యుల్లో వారసత్వ నేపథ్యం నుంచి వచ్చిన వారిలో మహిళలే ఎక్కువగా ఉండడం గమనార్హం. మొత్తం 4,665 మంది పురుష ప్రజాప్రతినిధుల్లో 856 మందికి (18%) వారసత్వ నేపథ్యం ఉంటే, 539 మంది మహిళా ప్రజాప్రతినిధుల్లో 251 మంది (47%) రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారు.



దాదాపు అన్ని రాష్ట్రాల్లో వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన స్త్రీలు ఉన్నారని, వీరిలో అత్యధిక శాతం అంటే 69% మంది మహిళలు మహారాష్ట్రలో ఉన్నారని ఏడీఆర్ తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కూడా ప్రజాప్రతినిధుల్లో 69 శాతం మహిళలు వారసులు అయితే, పురుషుల్లో 29% మంది మాత్రమే వారసత్వ నేపథ్యం ఉన్నవారు. తెలంగాణలో 64% మంది మహిళలు, 21% మంది పురుషులు వారసులేనని ఏడీఆర్ పేర్కొంది.

కాంగ్రెస్‌లో అత్యధికం

పార్టీల వారీగా చూస్తే.. కాంగ్రెస్‌లోనే అత్యధికంగా రాజకీయ వారసులు ఉన్నారు. జాతీయ పార్టీల్లోని మొత్తం 3,214 మంది ప్రజాప్రతినిధుల్లో కాంగ్రెస్‌లో 32%, బీజేపీలో 18% మంది వారసత్వ నేపథ్యం నుంచి వచ్చినవారని ఏడీఆర్ వెల్లడించింది. ప్రాంతీయ పార్టీల్లోని 1809 మంది సిట్టింగ్ ప్రజాప్రతినిధుల్లో 406 మందికి వారసత్వ నేపథ్యం ఉంది. వైఎస్సార్‌సీపీలో 38 శాతం మంది, తెలుగుదేశంలో 36 శాతం మంది వారసులే. బీఆర్ఎస్‌లోని 52 మంది ప్రజాప్రతినిధుల్లో 10 మందికి వారసత్వ నేపథ్యం ఉన్నదని ఏడీఆర్ పేర్కొంది.

5 రాష్ట్రాల్లో మోదీ పర్యటన

» నేటి నుంచి మూడు రోజులు బిజీబిజీ

» అల్లర్ల తర్వాత తొలిసారిగా మణిపూర్‌కు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: ప్రధాని మోదీ మణిపూర్ సహా ఐదు రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. శనివారం నుంచి సోమవారం వరకు మిజోరం, మణిపూర్, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లో పర్యటిస్తారని, రూ.71,850 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని ప్రధాని కార్యాలయం(పీఎంవో) శుక్రవారం వెల్లడించింది. మణిపూర్‌లో 2023 మేలో జాతుల మధ్య వైరంతో హింస చెలరేగిన తర్వాత ప్రధాని మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించనుండడం ఇదే తొలిసారి. మూడు రోజుల పర్యటనలో భాగంగా మోదీ తొలుత శనివారం మిజోరం వెళ్లనున్నారు. ఐజ్వాల్‌లో ఉదయం రూ.9 వేల కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అక్కడి నుంచి మణిపూర్ చేరుకొని.. చురచాంద్‌పూర్‌లో మధ్యాహ్నం రూ.7,300 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత రాజధాని ఇంఫాల్‌లో రూ.1,200 కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. అక్కడ బహిరంగ సభలో పాల్గొన్న తర్వాత అసోం వెళ్తారు. సాయంత్రం గువాహటిలో జరిగే భారతరత్న భూపేన్ హజారికా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు. 14వ తేదీన ప్రధాని మోదీ అసోంలో రూ.18,530 కోట్ల కీలకమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత అస్సాం బయో-ఇథనాల్ ప్రైవేట్ లిమిటెడ్ రిఫైనరీ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. 15న పశ్చిమబెంగాల్‌లో ప్రధాని పర్యటించి, కోల్‌కతాలో జరిగే 16వ కంబైన్డ్ కమాండర్స్ కాన్ఫరెన్స్-2025ను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత బిహార్ వెళ్లి.. పూర్ణియా విమానాశ్రయం కొత్త టెర్మినల్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పూర్ణియాలో దాదాపు రూ.36 వేల కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు.

నేనెక్కడ లోకల్

- నీట్ ర్యాంకు సాధించినా కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌లో 'నాన్ లోకల్' సమస్య
- భద్రాచలం విద్యార్థిని సాయి రితికకు విభజన కష్టాలు

భద్రాచలం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావంతో భద్రాచలం వాసులకు ప్రత్యేకించి విద్యార్థులకు విభజన కష్టాలు తప్పట్లేదు. ఎంబీబీఎస్ చదవాలన్న తపనతో నీట్-2025లో ర్యాంకు సాధించిన భద్రాచలం విద్యార్థినికి రాష్ట్ర కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌లో 'నాన్ లోకల్' సమస్య ఎదురైంది. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా భద్రాచలం వాసి గర్నేపల్లి సాయి రితికకు నీట్-2025లో 720 మార్కులకు 438 మార్కులతో జాతీయ స్థాయిలో 1,41,256 ర్యాంక్ (తెలంగాణ ర్యాంకు 2,538) వచ్చింది. కానీ, ఎంబీబీఎస్ తదితర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు 2 తెలుగు రాష్ట్రాల్లోనూ నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌లో సాయి రితికకు 'నాన్ లోకల్' అని చూపడం ఆమెకు, ఆమె తల్లిదండ్రులకు ఆవేదన మిగులుస్తోంది. రితిక కుటుంబం నాలుగు దశాబ్దాలుగా భద్రాచలంలోనే ఉంటోంది. తండ్రి అశోక్ కుమార్ వ్యాపారంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన కూతురు సాయి రితిక.. భద్రాచలం సరిహద్దుల్లోని ఆంధ్రప్రదేశ్- అల్లూరి జిల్లా పురుషోత్తమపట్నంలో పదో తరగతి వరకూ.. హైదరాబాద్- బాచుపల్లిలోని ప్రైవేటు జూనియర్ కాలేజీలో ఇంటర్ చదివారు. అయితే, 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతం కింద ఏపీలో కలిపిన 7మండలాల్లో యటపాక ఒకటి. పురుషోత్తమపట్నం ప్రస్తుతం యటపాక మండలంలోని గ్రామం కావడం గమనార్హం. తద్వారా.. నీట్-2025లో ర్యాంకు ద్వారా కన్వీనర్ కోటా అడ్మిషన్లకు సాయి రితిక అర్హత సాధించినా.. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌లో నాన్ లోకల్‌గా పరిగణించడంతో తమకు నష్టం జరిగిందని తండ్రి అశోక్ కుమార్ వాపోయారు. ఏపీలో నాన్ లోకల్ విద్యార్థులకు అన్‌రిజర్వుడ్ కోటాలో 15% సీట్లు కేటాయిస్తూ జీవో ఉండగా, తెలంగాణలో అది కూడా లేదని ఆవేదన వ్యక్తంచేశారు. భద్రాచలం వాసులకు విద్యారంగంలో కలుగుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు.. సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తెచ్చారు. 33 నంబర్ జీవో ద్వారా మానవీయ కోణంలో భద్రాచలం విద్యార్థులను తెలంగాణ స్థానికత కోటా అనుమతించాలని సీఎంను కోరారు. రితిక తండ్రి అశోక్ కుమార్ కూడా తన కూతురుకు న్యాయం చేయాలని వేడుకున్నారు.


సాయి రితిక

విద్యార్థి మృతి ఘటనలో కేసు

- పాఠశాల యాజమాన్య నిర్లక్ష్యమే కారణం
- విద్యార్థి తండ్రి ఫిర్యాదు.. పోలీసుల విచారణ

హనుమకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రైవేటు పాఠశాలలో గురువారం పోలేపల్లి జయంత్(15) అనే పదో తరగతి విద్యార్థి ఆకస్మికంగా మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. జయంత్ తండ్రి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు అయిన పోలెపల్లి రవి.. తన కుమారుడికి తక్షణం వైద్యసాయం అందించడంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం చేసినందు వల్లనే మృతి చెందాడని పేర్కొంటూ హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. రవి మీడియాతో మాట్లాడుతూ.. తాను దూరంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నానని, తన కుమారుడు ఆకస్మాత్తుగా పడిపోయాడని ఫోన్ చేసి చెప్పారన్నారు. ఆ తర్వాత గంట సేపటికిగానీ ఆస్పత్రికి తీసుకెళ్లలేదని ఆరోపించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ఉంటే తన కుమారుడు బతికేవాడని విలపించారు.

ఐఏఎస్ అధికారి పేషీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి విభాగంలో పనిచేస్తున్న మహిళా కాంట్రాక్ట్ ఉద్యోగి బుధవారం ఆత్మహత్యాయత్నం చేశారు. గతంలో ఈమె మీడియా రంగంలో పనిచేశారు. మిస్ వరల్డ్ పోటీలు జరిగినప్పటినుంచి ఈమెను కాంట్రాక్ట్ పద్ధతిలో ఆ విభాగంలో తీసుకున్నారు. అయితే ఆ విభాగంలో కొన్ని వేధింపులు ఎదురవడంతోనే ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఆ సీనియర్ ఐఏఎస్ అధికారి శాఖలో ఏం జరుగుతోందనే చర్చ నడుస్తోంది. ప్రస్తుతానికి ఆమెకు ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది.


నల్లగొండ జిల్లా తిప్పర్తిలో హైవేపై రాస్తారోకో చేస్తున్న రైతులు

యూరియా కోసం అన్నదాతల ఆందోళనలు

- వరంగల్ జిల్లాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి రాస్తారోకో

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

యూరియా కోసం అన్నదాతలు ఆందోళనలు, రాస్తారోకోలకు దిగుతున్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని అద్దంకి-నార్కట్‌పల్లి జాతీయ రహదారిపై శుక్రవారం రైతులు రాస్తారోకో చేశారు. 45 నిమిషాల పాటు బైఠాయించటంతో మిర్యాలగూడ వెళ్లే దారిలో 5 కి.మీ మేర, నల్లగొండ వైపు 3 కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలంలోని ఏపూర్ పీఏసీఎస్ వద్ద ఓ రైతు సొమ్మసిల్లి పడిపోయాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం(పీఏసీఎస్) వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు లైన్‌లో నిలబడ్డారు. తెల్లారాక సిబ్బంది వచ్చి యూరియా రావట్లేదని చెప్పడంతో ఆగ్రహించిన అన్నదాతలు మరిపెడ సెంట్రల్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకొని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని నిజాంపేట, రాయపోల్, చిన్నకోడూరు, చిన్నశంకరంపేట, నంగునూరు తదితర మండలాల్లో రైతులు యూరియా కోసం ఆందోళన చేశారు. రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని వరంగల్ జిల్లా రాయపర్తిలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రాస్తారోకో చేశారు. రాష్ట్రానికి అసమర్థ ముఖ్యమంత్రి ఉండటం వల్లే అన్నదాతలకు ఈ గోస వచ్చిందని మండిపడ్డారు. ముందుచూపు లేకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.

అఫిడవిట్‌పై ఏం చేద్దాం?

(మొదటి పేజీ తరువాయి)

నిబంధన కాగా, మరొకటి 12 ఏళ్ల అనుభవదారుగా ఉన్నట్లు దరఖాస్తుదారు రుజువు చేసుకోవడం. మూడోది.. క్రమబద్ధీకరణ జరిగే రోజు అమల్లో ఉన్న స్టాంప్‌డ్యూటీకి అదనంగా రూ.100 అపరాధ రుసుము చెల్లించాలనడం. అయితే ప్రస్తుతం దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేస్తున్న రెవెన్యూ అధికారుల్లో అఫిడవిట్ అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. సాదాబైనామాకు చట్టపరమైన రక్షణ లేదని, దానిపై ఆధారపడిన రైతులను అఫిడవిట్ తేవాలని ఒత్తిడి చేస్తే కొనుగోలుదారుల హక్కులు దెబ్బతినే ప్రమాదం లేకపోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అఫిడవిట్ తప్పనిసరి అంటే నకిలీ అఫిడవిట్‌లు కూడా తయారు చేసే ప్రమాదం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల భూ వివాదాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని అంటున్నారు.

ఎప్పుడో కొనుగోలు చేసిన భూమి..

సాదాబైనామా ఒప్పందాలన్నీ పాతవి అయినందున.. అమ్మకందారు మరణించినా, లేదా వారసులు ఎవరనే దానిపై వివాదాలున్నా అఫిడవిట్ సేకరించడం చాలా కష్టమవుతుందని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఎప్పుడో కొనుగోలు చేసిన భూమికి ఇప్పుడు వెళ్లి అఫిడవిట్ అడిగితే ఎవరూ అంగీకరించరని, సానుకూలత తక్కువగా ఉంటుందని రెవెన్యూ అధికారులు కూడా చెబుతున్నారు. అఫిడవిట్‌ను తప్పనిసరి చేస్తే మధ్యవర్తులు దరఖాస్తుదారుల నుంచి అదనపు మొత్తం వసూలు చేసే ప్రమాదం ఉంటుందని, దీని వల్ల చిన్న, సన్నకారు రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయనే అభిప్రాయాలు కూడా ఉన్నాయి. కొనుగోలుదారు తాను డబ్బు చెల్లించానని చెప్పినా.. అమ్మకందారు తనకు మొత్తం డబ్బు ముట్టలేదని, ఇంకా బకాయి ఉందని, అఫిడవిట్ ఇవ్వలేనని అడ్డం తిరిగితే న్యాయపరమైన సమస్యలు కూడా సాదాబైనామా రైతులు ఎదుర్కోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అఫిడవిట్ తీసుకురావడం కష్టమవుతుందని అంటున్నారు. ఈ అంశంపై రెవెన్యూ యంత్రాంగంలో విస్తృతంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో నిబంధనల నుంచి దీనిని తొలగించాలా, కొనసాగించాలా అనే దానిపై సీసీఎల్ఏ కార్యాలయ అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.



అపరాధ రుసుము తప్పనిసరి!

సాదాబైనామా దరఖాస్తుల క్రమబద్ధీకరణకు న్యాయపరమైన ఇబ్బందులు ఉన్నందున.. స్టాంప్ డ్యూటీతోపాటు అపరాధ రుసుము కూడా వసూలు చేయాలని భూభారతి నిబంధనల సమయంలో న్యాయశాఖ సూచించింది. అయితే ఈ మొత్తం ఎంత ఉండాలనే చర్చ జరగడంతో ప్రభుత్వం మధ్యే మార్గంగా క్రమబద్ధీకరణకు అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారు నుంచీ రూ.100 చొప్పున అపరాధ రుసుము వసూలు చేయాలని నిబంధనల్లో పేర్కొంది. దీంతోపాటు క్రమబద్ధీకరణ జరిగే రోజు అమల్లో ఉన్న స్టాంపు డ్యూటీ (7.5 శాతం) చెల్లించాలనే షరతు విధించింది. దరఖాస్తుదారు చలానా తీసిన తరువాతే క్రమబద్ధీకరణ ప్రక్రియ మొదలవుతుంది. ఇక 12 ఏళ్లపాటు అనుభవదారుగా ఉన్నట్లు నిరూపించుకోవడం దరఖాస్తుదారులకు సవాలుగా మారుతుందనే వాదనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఇవిగో ఫొటోలు.. వీళ్లు కాంగ్రెస్‌లో చేరలేదా?

- 'ఎమ్మెల్యేల చోరీ'పై రాహుల్ గాంధీ సిగ్గు పడాలి
- రేవంత్.. మీరు నడిపేది సర్కారా? సర్కస్సా?: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు12(ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు.. తాము ఆ పార్టీలో చేరలేదంటూ బుకాయించడం సిగ్గుచేటు.. ఇవిగో ఫొటోలు.. వీరు పార్టీ ఫిరాయించలేదా? రాహుల్‌గాంధీ జాతీయ స్థాయిలో లేవనెత్తుతున్న ఓటు చోరీ కన్నా.. ఇది దారుణమైన నేరం" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ నేతలతో కలిసి ఫొటోలు దిగిన ఫొటోలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసిన ఆయన... వీళ్లను మీరు గుర్తుపట్టగలరా? ఆ కండువాలు కాంగ్రెస్‌వి కాదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. ఇంత బహిరంగంగా, సిగ్గు లేకుండా జరుగుతున్న ఫిరాయింపు రాజకీయాల్లో భాగస్వామి అయినందుకు రాహుల్‌గాంధీకి సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. జాతీయస్థాయిలో ఓటు చోరీ గురించి నీతులు చెప్పే రాహుల్‌గాంధీ.. తెలంగాణలో ఎమ్మెల్యేల చోరీపై మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. మీరు సర్కార్ నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా? అని రేవంత్‌ను ఉద్దేశించి ప్రశ్నించారు. కాగా, మునిసిపల్ శాఖలోని విభాగాలు ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల హైదరాబాద్‌లో ఒక చిన్నారి తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్‌లో పడిపోయిందని, అదృష్టవశాత్తు ప్రాణాలు దక్కాయని పేర్కొన్నారు. తప్పును దిద్దుకోవాల్సిన జీహెచ్ఎంసీ, హైడ్రా, జలమండలి.. ఒకదానిపై మరొకటి దుమ్మెత్తి పోసుకుంటున్నాయని విమర్శించారు. కాగా, రైతుల యూరియా కష్టాలను చూపించిన జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు.


'ఎక్స్'లో కేటీఆర్ పోస్టు చేసిన ఫొటోలు



చిన్నారి తనుశ్రీ; నిందితురాలు మమత

3 ఏళ్ల కూతుర్ని గొంతుపిసికి చంపిన తల్లి

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని ప్రియుడితో కలిసి ఘాతుకం

శివ్వంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్నకూతురిని ప్రియుడితో కలిసి గొంతుపిసికి చంపిందో తల్లి. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం శభాష్‌పల్లిలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. శభాష్‌పల్లికి చెందిన బంటు మమతకు రాయపోల్ మండలానికి చెందిన వడ్డేపల్లి భాస్కర్‌తో ఎనిమిదేళ్ల క్రితం పెళ్లయింది. వీరికి చరణ్(4), తనుశ్రీ (3) పిల్లలు. భర్త భాస్కర్‌కు అర్థమయ్యేలా మాట్లాలేకపోవడం అనే బలహీనత ఉండటంతో దాన్ని సాకుగా చూపి.. అతడితో కలిసి ఉండలేనని, పెద్దలు తనకు ఇష్టంలేని పెళ్లి చేశారంటూ చెప్పి పిల్లలను తీసుకొని మమత అత్తింటి నుంచి శభాష్‌పల్లిలోని పుట్టింటికి వెళ్లిపోయింది. కొన్నాళ్లకు ఆమెకు అదే గ్రామానికి చెందిన ఫయాజ్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. అతడితో వెళ్లిపోవాలని నిర్ణయించుకున్న మమత ఈ ఏడాది జూన్ 7న కుమారుడిని తల్లి వద్దే వదిలేసి.. తనుశ్రీని వెంటబెట్టుకొని ప్రియుడు ఫయాజ్‌తో కలిసి పుట్టింటి నుంచి బయటకొచ్చింది. అయితే గ్రామ శివారులో మమత, ఫయాజ్ కలిసి చిన్నారి తనుశ్రీని గొంతు పిసికి చంపి.. గొయ్యి తీసి పూడ్చిపెట్టి వెళ్లిపోయారు. గతంలోనూ ఇద్దరు కొన్ని రోజులు కనిపించకుండా పోవడంతో బంధువులు అప్పట్లోనే వెతికిపట్టుకుని వచ్చారు. ఈసారి వారి ఆచూకీ దొరక్కపోవడంతో భర్త భాస్కర్ మే 27న శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. విచారణ చేపట్టిన పోలీసులు మమత, ఫయాజ్ ఏపీలోని గుంటూరులో ఉన్నారని తెలుసుకొని, అక్కడికి వెళ్లి అదుపులో తీసుకుని విచారించారు. తనుశ్రీని తామే చంపినట్లు విచారణలో ఆ ఇద్దరూ అంగీకరించారు. కుమార్తెను చంపి, పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని నిందితులు చూపించగా, శుక్రవారం పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గరియాబంద్ ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు


- మృతుల్లో ముగ్గురు తెలుగువారు
- బీజాపూర్‌లో మరో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టుల మృతి


బాలకృష్ణ; ప్రమోద్; విమల్ (ఫైల్)

చర్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో గురువారం ఎన్‌కౌంటర్ జరిగి 10 మంది మావోయిస్టులు మృతి చెందగా.. మృతదేహాలను శుక్రవారం గరియాబంద్ జిల్లా కేంద్రానికి తరలించారు. మృతదేహాలను గుర్తించగా.. వారిలో ముగ్గురు తెలుగువాళ్లు ఉన్నారు. మృతి చెందిన 10 మంది మీద సుమారు కోటి 60లక్షల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చనిపోయిన వారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మోడెం బాలకృష్ణ అలియాస్ మనోజ్ (రూ.కోటి రివార్డు), ప్రమోద్ అలియాస్ పాండు (ఒరిసా రాష్ట్ర కమిటీ సభ్యుడు, 25లక్షల రివార్డు), విమల్ అలియాస్ మంగన్న (టెక్నికల్ టీం ఇన్‌చార్జి, 8 లక్షల రివార్డు), విక్రమ్ (ఏరియా కమిటీ మెంబర్, 5లక్షల రివార్డు) ఉమేష్ (డిప్యూటీ కమాండర్, 5 లక్షల రివార్డు), రజిత (ఏరియా కమిటీ మెంబర్, 5 లక్షల రివార్డు), అంజలి (ఏరియా కమిటీ మెంబర్, 5లక్షల రివార్డు), సింధూ (ఏరియా కమిటీ మెంబర్, 5లక్షల రివార్డు) ఆర్తి (గార్డు, లక్ష రివార్డు), సమీర్ (మెంబర్, లక్ష రివార్డు) ఉన్నారు. వీరిలో బాలకృష్ణది వరంగల్ కాగా.. విమల్‌ది ఆదిలాబాద్ అని, ప్రమోద్‌ది ఆంధ్రప్రదేశ్ అని గరియాబంద్ జిల్లా పోలీసులు తెలిపారు. కాగా.. మృతదేహాల వద్ద నుంచి రెండు ఏకే 47, ఎస్ఎల్ఆర్, 303 తుపాకులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. శనివారం ఉదయం కూడా గరియాబంద్ జిల్లా అడవుల్లో మళ్లీ ఎదురు కాల్పులు జరిగాయని పోలీసులు తెలిపారు. అలాగే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా గంగలూరు అడవుల్లో శుక్రవారం ఉదయం పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు.

మావోయిస్టు పార్టీ నేత కల్పన లొంగుబాటు!

- ఆమె మల్లోజుల కిషన్‌జీ సతీమణి


కల్పన

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ అగ్రనేత దివంగత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ భార్య పోతుల కల్పన అలియాస్ మైనక్క తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయారని సమాచారం. ఆమెతో పాటు మరో ముగ్గురు లొంగిపోయినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని పోలీసు ఉన్నతాధికారులు శనివారం ప్రకటించనున్నారని సమాచారం. గద్వాల జిల్లా గట్టు మండలం పెంచికల్‌పేటకు చెందిన కల్పన డిగ్రీ చదువుతున్న సమయంలో 1983లో ఆర్ఎస్‌యూలో చేరి ఆ తర్వాత పార్టీలో పూర్తి స్థాయి కార్యకర్తగా మారారు. లాల్‌గఢ్ ఉద్యమ నేత, మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడైన మల్లోజుల కోటేశ్వరరావును ఆమె వివాహం చేసుకున్నారు. మల్లోజుల బెంగాల్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన సంగతి విదితమే.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

టక్కరి ట్రంప్!

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్‌కు తెలియచేశాకే ఖతార్‌మీద దాడి చేశామని ఇజ్రాయెల్ అంటోంది. ట్రంప్ దీనిని కాదనడం లేదు. అవును, ఇజ్రాయెల్ మాకు ముందే చెప్పింది, ఆ సమాచారం అందగానే, మీ మీద దాడిజరగబోతోందని ఖతార్‌కు వెంటనే తెలియచేశామని ఆయన అన్నాడు. ఈ దాడిలో తన పాత్రలేదనీ, అది తన నిర్ణయం కాదన్న ట్రంప్ వ్యాఖ్యలు నిజమే అనుకుందాం. దాడిచేయబోతున్నానని చెప్పిన ఇజ్రాయెల్‌ను ఆయన ఎందుకు నిలవరించలేదు, ఎందుకు హెచ్చరించలేదన్న ప్రశ్నలను కూడా పక్కనబెడదాం. ఇజ్రాయెల్ ఈ ఘాతుకానికి ఒడిగడుతున్న సమాచారం ఖతార్‌కు చేరివుంటే అది దాడిని ఆపగలదా లేదా అన్నది అటుంచితే, ఆత్మరక్షణ ప్రయత్నాలేవో చేసుకొనేది. మరి, అలా ఎందుకు జరగలేదు? అమెరికా అధ్యక్షుడు ఈ అరబ్ మిత్రదేశానికి అన్యాయం చేయదల్చుకోలేదు. మరోపక్క ఇజ్రాయెల్‌కూ ద్రోహం చేయడానికీ మనసొప్పలేదు. ఆయన తన మధ్య ఆసియా ప్రత్యేక రాయబారికి సమాచారం చేరవేత బాధ్యతని అప్పగించాడు. సున్నితమైన సమాచారం కదా, ఆయన దానిని అతిజాగ్రత్తగా, తాపీగా ఖతార్ చెవిలో వేశాడు. ఇజ్రాయెల్‌కు చెందిన పదిహేను యుద్ధవిమానాలు దాడులు ఆరంభించి అప్పటికే పది నిముషాలైంది. ఖతార్ రాజధాని నడిబొడ్డున జరిగిన ఈ దాడిలో ఆరుగురు హమాస్ అధికార ప్రతినిధులు మృతిచెందారు. దాడిలో తన పాత్ర లేదంటున్న ట్రంప్ దానిని నిలువరించలేదు కానీ, మహా గట్టిగా ఖండించారు. దాడి తప్పే కానీ, ఉగ్రవాదులు చావడం మాత్రం సరైనదేనని వైట్‌హౌస్ అంటోంది.

అమెరికా అధ్యక్షుడిని సంతోషపెట్టడానికి, మచ్చిక చేసుకోవడానికి తెగ ఆపసోపాలు పడుతున్న ఈ ఆయిల్ రిచ్ అరబ్ దేశానికి ట్రంప్ భలే జెల్ల కొట్టారంటూ సామాజిక మాధ్యమాలు వ్యాఖ్యానిస్తున్నాయి. పశ్చిమాసియాలో అమెరికా తన అతిపెద్ద వైమానిక స్థావరాన్ని ఖతార్‌లోనే నిర్మించుకుంది. నాలుగునెలల క్రితం ట్రంప్ వచ్చినప్పుడు, ఎర్రతివాచీ స్వాగతాలు, వేల కోట్ల రూపాయల రక్షణ సామగ్రి కొనుగోళ్ళతో ట్రంప్‌ను ఖతార్ సంతోష పెట్టింది. అంతేకాదు, అత్యంతవిలాసవంతమైన, మూడున్నరవేలకోట్ల విలువైన బోయింగ్ విమానాన్ని ఖతార్ రాజు గిఫ్ట్‌గా ఇస్తే, అమెరికా అధ్యక్షుడు దానిని నిస్సిగ్గుగా స్వీకరించాడు. భారీ బహుమతి ఇచ్చిన మిత్ర దేశాన్ని ట్రంప్ ఇప్పుడు ఈ రీతిన ఖంగుతినిపించాడు.

హమాస్ నాయకులను నిర్మూలించడం మంచిపని అంటోంది వైట్‌హౌస్. ఖతార్ మీద దాడిని పరోక్షంగా అనుమతించిన అమెరికా అధ్యక్షుడు ఇకపై అటువంటివి ఒప్పుకొనేది లేదంటున్నారు. శాంతియత్నాలు ఒక కొలిక్కివచ్చినప్పుడల్లా నెతన్యాహూ మోకాలడ్డుతూనే ఉంటారని ఆగ్రహం నటిస్తున్నారు. ఆయన ఖతార్‌కు మాత్రమే ద్రోహం చేయలేదు. శాంతిచర్చలకు వెన్నుపోటు పొడవడంలో తానూ భాగస్వామి అయ్యారు. గడువులోగా దారికిరావాలంటూ హమాస్‌ను ఒకపక్క హెచ్చరించి, మరోపక్క ఆ ప్రయత్నాల్లో ఉన్నవారిని ఇజ్రాయెల్‌తో హత్య చేయించారు. శాంతియత్నాలను భగ్నం చేసి, యుద్ధం నిరవధికంగా సాగించేందుకు ప్రయత్నిస్తున్న నెతన్యాహూతో కలసి కుట్రచేశారు.

తాలిబాన్, హమాస్, ఇరాన్ తదితర ప్రతినిధులతో అమెరికా, ఇజ్రాయెల్ చర్చలు జరపడానికి, ఒప్పందాలు కుదర్చుకోవడానికి ఎంతోకాలంగా ఒక వారధిగా, మధ్యవర్తిగా ఉపకరిస్తున్న ఖతార్‌మీద నేరుగా దాడికి తెగబడి ఇజ్రాయెల్ తీవ్ర తప్పిదం చేసింది. ఆ తప్పులో పాత్రధారి అయి, అరబ్ దేశాల నమ్మకాన్ని ట్రంప్ వమ్ముచేశారు. తమ భద్రతకు ఎటువంటి గ్యారంటీ లేదని వాటికి తెలిసొచ్చేట్టుగా చేశారు. కాల్పుల విరమణ జరిగి, హమాస్ చెరలో ఉన్న బందీలు విడుదలకావాలని ఇజ్రాయెల్ ప్రజలు ఆశిస్తుంటే, దానికి అడ్డుకట్టవేసేపనిలో నెతన్యాహూ ఉన్నారు. రెండేళ్ళుగా హమాస్‌తో యుద్ధాన్ని సాగిస్తున్న నెతన్యాహూ, దానిని విస్తరించి, పరిధులు దాటించి, నేరుగా ఇరాన్ మీదకు లంఘించినప్పుడు కూడా ట్రంప్ వారించలేదు. స్వయంగా దాడులకు తెగబడి మరీ ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చారు. హమాస్ మీద ప్రతీకారం పేరిట నెతన్యాహూ పాల్పడుతున్న ప్రతీ అక్రమాన్నీ సమర్థిస్తూ గాజాను నిర్మానుష్యం చేసే ఉమ్మడి లక్ష్యంతో పనిచేస్తున్నారు. కాల్పుల విరమణకు హమాస్ సిద్ధపడినా కూడా యుద్ధం ఆగకుండా జాగ్రత్తపడుతున్నారు. రెండేళ్ళుగా నెతన్యాహూ గాజాలో ఊచకోతలకు పాల్పడుతున్నా, పొరుగుదేశాలను చావగొడుతున్నా నోరువిప్పడానికి కూడా సాహసించని గల్ఫ్ దేశాలు ఇప్పటికైనా కాస్తంత బుద్ధితెచ్చుకొని, ఆత్మగౌరవంతో స్వతంత్రంగా వ్యవహరించడం అవసరం. అవి ఒక్కటిగా లేకపోవడం వల్లనే యుద్ధం ఆగలేదన్నది వాస్తవం.

తగ్గింపులు సరే, క్షమాపణలు ఏవీ?

కేంద్ర ప్రభుత్వానికి తుదకు వివేకోదయమయింది. ఈ సెప్టెంబర్ 3న ప్రభుత్వం విస్తృత శ్రేణి వస్తువులు, సేవలపై పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ -జీఎస్టీ) రేట్లను హేతుబద్ధీకరించి, తగ్గించింది. శుభం. జీఎస్టీ ఇప్పుడు 'గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్' భావన (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే అనేకానేక పరోక్ష పన్నులను ఒకే ఒక పన్నుగా సమైక్యపరచడం)కు సన్నిహితంగా ఉన్నది, సందేహం లేదు. పలువురు రాజకీయవేత్తలు, ఎంతో మంది వ్యాపారవేత్తలు, వివిధ సంస్థలు, (నాతో సహా) వ్యక్తులు ఎందరో వస్తు సేవల పన్ను అనేది గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్ వలే ఉండాలని ఎనిమిదేళ్లుగా వాదిస్తూ వస్తున్నారు.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆగస్టు 2016లో రాజ్యాంగ (122వ సవరణ) బిల్లుపై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడు రాజ్యసభలో నేను ఆ చర్చలో పాల్గొన్నాను. ఆనాటి నా ప్రసంగంలోని కొన్ని భాగాలను ఉటంకించడం అప్రస్తుతం కాదు. నేను ఇలా అన్నాను: "వస్తు సేవల పన్నును అమలుపరచాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని తొలుత అధికారికంగా ప్రకటించింది డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వమేనన్న వాస్తవాన్ని ఆర్థికమంత్రి అంగీకరించినందుకు నేను చాలా సంతోషిస్తున్నాను. 28, ఫిబ్రవరి 2005న ఆర్థికమంత్రి బడ్జెట్ ప్రసంగంలో జీఎస్టీని తొలిసారి ప్రకటించారు. వస్తుసేవల పన్నులో నాలుగు ప్రధాన అంశాలు ఉన్నాయి....."

"122వ రాజ్యాంగ సవరణ బిల్లులోని చాలా ముఖ్యమైన విషయాన్ని తరచి చూడదలుచుకున్నాను. మనం పరోక్ష పన్ను గురించి వ్యవహరిస్తున్నామన్న విషయాన్ని దయచేసి మరచిపోవద్దు. పరోక్ష పన్ను అనేది నిర్వచనం రీత్యా ఒక తిరోగామి పన్ను (పన్ను మొదట్లో చెల్లించేది ఒకడు. అంతిమంగా దాని భారాన్ని భరించేది మరొకడు అయినప్పుడు ఆ పన్నును పరోక్ష పన్ను అంటారు). ఏ పరోక్ష పన్ను అయినా ధనికులు, పేదలు ఒకే రీతిలో చెల్లించేదిగా ఉంటుంది... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక ఇలా పేర్కొంది: 'అధికాదాయమున్న దేశాలలో సగటు జీఎస్టీ రేటు 16.8 శాతం. భారత్ లాంటి మార్కెట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఇప్పుడిప్పుడే ఆవిర్భవిస్తున్న భారత్ లాంటి దేశాలలో సగటు జీఎస్టీ రేటు 14.1 శాతం'. ప్రపంచ వ్యాప్తంగా 190కు పైగా దేశాలలో జీఎస్టీ అనేది ఏదో ఒక రూపంలో ఉన్నది. అది సగటున 14.1 శాతం–16.8 శాతం మధ్య ఉన్నది..."

"పన్నురేట్లను మనం తక్కువగా ఉంచవలసిన అవసరమున్నది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను పరిరక్షించి తీరాలి... 'రెవెన్యూ తటస్థ రేటు' (రెవెన్యూ న్యూట్రల్ రేట్ – జీఎస్టీ వ్యవస్థలో సంస్కరణ తరువాత ప్రభుత్వం సేకరించే మొత్తం పన్ను ఆదాయం మునుపటిలాగే ఉండేందుకు దోహదం చేసే ప్రామాణిక పన్ను రేటు)ను కనుగొనడం ద్వారా ప్రభుత్వాల ప్రస్తుత ఆదాయాలను కాపాడాలి... ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో సహా ఆర్థిక నిపుణులతో సంప్రతింపులు, సమాలోచనలతో రెవెన్యూ తటస్థ రేటు 15 నుంచి 15.5 శాతంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చారు. దరిమిలా ప్రామాణిక పన్నురేటు 18శాతంగా ఉండాలని సూచించారు. ప్రధాన ఆర్థిక సలహాదారు నివేదిక నుంచి గ్రహించే కాంగ్రెస్ పార్టీ ఆ ప్రామాణిక పన్ను రేటు 18 శాతం ఉండాలని కోరిందని నేను మళ్లీ చెప్తున్నాను..."

"ప్రజల శ్రేయస్సు కోసం వారి తరఫున ఎవరో ఒకరు మాట్లాడాలి కదా. ప్రజల పేరిట నేను అడుగుతున్నాను: మీ ప్రభుత్వ ప్రధాన సలహాదారు సిఫారసు చేసిన రేటునే అమలుపరచండి. ప్రామాణిక పన్ను రేటు 18 శాతం మించకుండా చూడండి.. ప్రామాణిక పన్ను రేటు 18 శాతంగా ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు పరిరక్షించబడతాయని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు తన నివేదికలో సుసంగతంగా వాదించారు. అది ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచుతుంది. పన్ను చెల్లింపు ఎగవేతలను నివారిస్తుంది. దేశ ప్రజలందరికీ అంగీకారయోగ్యంగా ఉంటుంది. వస్తువులు, సేవలపై మీరు 24 నుంచి 26 శాతం పన్ను వసూలు చేయదలుచుకుంటే అసలు జీఎస్టీ బిల్లు తీసుకు రావడమెందుకు?...."

"అంతిమంగా ఒక పన్ను బిల్లులో పన్ను రేటు ఎంత అనేది స్పష్టంగా పేర్కొనాలి. 70 శాతానికి పైగా వస్తువులు, సేవలకు వర్తించే జీఎస్టీ రేటు ఎట్టి పరిస్థితులలోను 18 శాతానికి మించకూడదని మా పార్టీ తరఫున, నా తరఫున గట్టిగా, స్పష్టంగా కోరుతున్నాను. అలాగే తక్కువ జీఎస్టీ రేటు, డీ మెరిట్ రేటు (వినియోగదారుల ఆరోగ్యానికి హానికరమైన, ప్రతికూల సామాజిక పరిణామాలకు కారణమయ్యే పొగాకు ఉత్పత్తులు, చక్కెర పానీయాలు మొదలైన వాటి వాడకాన్ని నిరుత్సాహపరిచేందుకు సదరు సరుకులపై ప్రభుత్వం విధించే ప్రత్యేక పన్ను రేటు)ను ఆ 18 శాతం ప్రామాణిక రేటు ప్రాతిపదికన నిర్ణయించాలి".

నేను ఈ వ్యాసంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలనే 2016లో రాజ్యసభ చర్చలో వ్యక్తం చేశాను. వస్తుసేవల పన్ను రేట్లను హేతుబద్ధీకరించాలని, తగ్గించాలనే అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చినందుకు నేను అమితంగా సంతోషిస్తున్నాను. అయితే వస్తు సేవల పన్నును అమలు పరచదలుచుకున్నప్పుడు ప్రామాణిక పన్నురేటు 18 శాతంగా మాత్రమే ఉంటే భారీ ఆదాయ నష్టం, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సంభవిస్తుందని మోదీ ప్రభుత్వం వాదించింది. అది నిష్కారణ భయం మాత్రమే. ఆదాయ నష్టం సాకుతో పన్నురేట్లను అధికంగా నిర్ణయించారు. జీఎస్టీ తాజా సంస్కరణలో రెండు శ్లాబ్‌ల రేట్లు 5 శాతం, 18 శాతంగా ఉన్నాయి! పన్ను రాబడిని పెంచుకునేందుకు ప్రభుత్వానికి అనేక మార్గాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ఆదాయాన్ని కోల్పోతే, ఆ పరిస్థితిని చక్కదిద్దేందుకు సరైన మార్గం రాష్ట్రాలకు నష్టపరిహారం చెల్లించడమే.



akbar

> వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన మొదటి సంవత్సరం (జూలై 2017–మార్చి 2018) ప్రభుత్వం 11 లక్షల కోట్ల రూపాయలు వసూలు చేసుకున్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రాబడి 22 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. వినియోగదారులు కష్టపడి ఆర్జించుకున్న ప్రతి పైసాను వస్తుసేవల పన్ను ద్వారా ప్రభుత్వం లాగివేసుకున్నది. మరి జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అపహసించడంలో ఆశ్చర్యమేమున్నది? ఎనిమిది సంవత్సరాల పాటు ఈ దేశ ప్రజలు అత్యధిక పన్నులు ఎందుకు చెల్లించవలసివచ్చింది?

గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రభుత్వం వినియోగదారుల నుంచి చివరి పైసాను సైతం రాబట్టుకునేందుకు జీఎస్టీ రేట్లను బహుళ రీతుల్లో నిర్ణయించి అమలుపరిచింది. ఆదాయాన్ని మరింతగా పెంపొందించుకోవడమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యంగా ఉన్నది. వస్తుసేవల పన్ను అమలులోకి వచ్చిన మొదటి సంవత్సరం (జూలై 2017–మార్చి 2018) ప్రభుత్వం 11 లక్షల కోట్ల రూపాయలు వసూలుచేసుకున్నది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ రాబడి 22 లక్షల కోట్ల రూపాయలుగా ఉన్నది. వినియోగదారులు కష్టపడి ఆర్జించుకున్న ప్రతి పైసాను వస్తుసేవల పన్ను ద్వారా ప్రభుత్వం లాగివేసుకున్నది. మరి జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని అపహసించడంలో ఆశ్చర్యమేమున్నది? అది సబబైన ఎగతాళి సుమా! వినియోగం తగ్గిపోవడానికి, గృహ రుణాల (ఇళ్ల, వాహనాల కొనుగోలు మొదలైనవాటికి కుటుంబాలు చేసే రుణాలు) భారం పెరిగిపోవడానికి ప్రధాన కారణాలలో ఒకటి జీఎస్టీ రేట్లు అధికంగా ఉండడమే. పన్నులు తగ్గించినప్పుడు వినియోగం పెరుగుతుంది – ఇది అర్థశాస్త్ర ప్రాథమిక పాఠం. టూత్‌పేస్ట్, తలనూనె, పెన్నులు, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, ట్రాక్టర్లు, స్ప్రింకర్లు మొదలైన వాటిపై 5 శాతం జీఎస్టీ సమంజస నిర్ణయం. గత ఎనిమిది సంవత్సరాలుగా ఆ వినియోగ వస్తువులపై జీఎస్టీ అధికంగా ఎందుకు ఉన్నది? ఎనిమిది సంవత్సరాల పాటు ఈ దేశ ప్రజలు అత్యధిక పన్నులు ఎందుకు చెల్లించవలసివచ్చింది?

వస్తుసేవల పన్ను రేట్ల తగ్గింపు ఆరంభం మాత్రమే. పన్నుల వ్యవస్థ ప్రజాహితంగా ఉండేందుకు ఇంకా ఎన్నో సంస్కరణలు చేపట్టవలసి ఉన్నది. ప్రభుత్వం తప్పక చేయవలసినవి: రాష్ట్రాలు, ఉత్పత్తిదారులు, వినియోగదారులను (తప్పనిసరైతే మరిన్ని మినహాయింపులతో) ఏకైక జీఎస్టీ రేటుకు సంసిద్ధపరచాలి; పన్నుల చట్టాలలోని అర్థంకాని పరిభాషను పరిహరించాలి. సరళమైన, సుబోధకమైన మాటలలో ఆ చట్టాలను పునర్లిఖించాలి, నియమనిబంధనలు సామాన్య వినియోగదారులకు సైతం అర్థమయ్యేలా సూటిగా స్పష్టంగా ఉండి తీరాలి; ట్యాక్స్ రిటర్న్‌ను పదే పదే ఫైల్ చేయవలసిన శ్రమను గణనీయంగా తగ్గించాలి; చట్టానికి అనుగుణంగా వ్యవహరించే ప్రక్రియను సరళీకరించాలి. చిన్న వ్యాపారస్తులు, దుకాణదారులకు చార్టర్డ్ అకౌంటెంట్ సేవలు అవసరం కాకూడదు; జీఎస్టీ చట్టాలను డీ–క్రిమినలైజ్ చేయాలి. అవి వ్యాపార, వర్తకాలకు సంబంధించిన పౌరచట్టాలు అనే వాస్తవాన్ని విస్మరించకూడదు. చట్టాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారికి విధించే శిక్షను సహేతుకమైన జరిమానాలతో సరిపెట్టాలి. ఉత్పత్తిదారులు, వ్యాపారులు ఆర్థిక వ్యవస్థకు కీలకమైనవారని, సమాజ శత్రువులు కారనే యథార్థాన్ని పన్ను వసూలు అధికారుల మనసుల్లో నెలకొల్పాలి.

సరే, వస్తుసేవల పన్ను హేతుబద్ధీకరణ శ్రేష్ఠమైన నిర్ణయమే, సందేహం లేదు. అది, ప్రజలకు తాము చేసిన సమున్నత మేలుగా భారతీయ జనతా పార్టీ చెప్పుకోవడం సబబు కాదు. అంతే కాదు గత ఎనిమిది సంవత్సరాలుగా అధిక జీఎస్టీ రేట్లతో వినియోగదారులను సతమతం చేసినందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి. జీఎస్టీ వ్యవస్థలో మిగతా సంస్కరణలను అమలుపరిచేందుకు ప్రభుత్వం మరో ఎనిమిది సంవత్సరాల వ్యవధిని తీసుకోదని ఆశిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

> దేశంలో వరదలు, భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు సంభవించినప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా సేవలు అందించేది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే. వారిని దూషించేవారు మాత్రం దేశ ప్రజలకు అవసరం వచ్చినప్పుడు పారిపోయి దాక్కుంటారు.

హిందుత్వ సంస్థలపై ఎందుకంత ఆక్రోశం?

'క్రైస్తవులకూ తప్పని వేధింపులు' అంటూ ఆగస్టు 15న రాజ్‌దీప్ సర్దేశాయి రాసిన వ్యాసంలో హిందుత్వ సంస్థలపై వ్యతిరేక పైత్యం పరాకాష్ఠకు చేరింది. "నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పటి నుంచి భారతీయ ముస్లింల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై 'పలువురు' ఆక్షేపిస్తున్నారు" అని ఆయన చెప్పడంలో పెద్ద తిరకాసే ఉంది. ఈ 'పలువురు' ఎవరు? ఇస్లామిక్ ఉగ్రవాదులను నెత్తిన పెట్టుకొని, లౌకికవాద ముసుగును తగిలించుకొని, హిందువుల సంప్రదాయాలను, హిందుత్వ సంస్థలను అకారణంగా, అసందర్భంగా, అనవసరంగా దెప్పిపొడిచే 'హిందూ వ్యతిరేక హిందువులు' అని చెప్పుకోవచ్చు.

వ్యాసంలో 'సంఘ పరివార్ తీవ్రవాదులు' అనే పద ప్రయోగం చేయడం వెనుక రాజ్‌దీప్ సర్దేశాయికి జాతి వ్యతిరేక సంస్థల ప్రోత్సాహం ఉందన్న విషయం అర్థమవుతున్నది. వాస్తవంగా హిందుత్వ సంస్థల కార్యకర్తలు హింసావాదులైతే ఈ దేశంలో ప్రజాస్వామ్యం నడిచేది కాదు. దేశంలో వరదలు, భూకంపాలు, ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు సంభవించినప్పుడు ప్రతిఫలాపేక్ష లేకుండా సేవలు అందించేది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే. వారిని దూషించేవారు మాత్రం దేశ ప్రజలకు అవసరం వచ్చినప్పుడు పారిపోయి, దాక్కుంటారు.



బలవంతపు మత మార్పిడి, అమ్మాయిల అక్రమ రవాణా అనే ఆరోపణలతో కేరళకు చెందిన ఇద్దరు 'నన్స్'ను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అరెస్ట్ చేసిన విషయంలో ఈ దేశంలో క్రైస్తవ రాజకీయాల లాబీ బలంగానే పనిచేసింది. వారికి బెయిల్ ఇప్పించడంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేరళ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ ప్రధాన పాత్ర పోషించారు. బీజేపీ ఈ సందర్భంలో పూర్తి సంయమనంతో వ్యవహరించిందని అర్థం చేసుకోవాలి తప్ప, పెడర్థాలు ఎందుకు? ఈ దేశంలో క్రైస్తవ మతమార్పిడి వెనుక క్రైస్తవ దేశాల కుట్రలు, లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ రాజకీయ నాయకుల దౌష్ట్యపు ఆలోచనలు లేవని ఎవరైనా చెప్పగలరా? క్రైస్తవంలోని ఆధ్యాత్మిక ఆలోచనల ప్రేరణతోనే హిందువులు క్రైస్తవంలోకి మారుతున్నారని చెబితే, అది అతిశయోక్తి అవుతుంది. ఇదే వాస్తవమైతే ఇస్లాం మతస్థులు కూడా కన్వర్ట్ కావాలి కదా.

భారత రాజ్యాంగం మత స్వేచ్ఛ కల్పించింది కానీ, ఇతర మతాలపై దుష్ప్రచారం చేసి, ప్రలోభాలతో, మాయ మాటలతో వేరొక మతం వారిని తమ మతంలోకి మార్చుకొని సంఖ్య పెంచుకోవాలనే వెసులుబాటుకు మన రాజ్యాంగంలో చోటు లేదు. అంబేడ్కర్ మరణానికి ముందు అంటే 1956లో బౌద్ధ మతంలోకి మారేటప్పుడు దేశంలో ప్రభావవంతంగా ఉన్న క్రైస్తవాన్నో, ఇస్లామ్‌నో ఎందుకు ఎంచుకోలేదు? ఈ విషయం గురించి మన దేశంలోని స్వయం ప్రకటిత మేధావులు అనేక కట్టుకథలు చెబుతారు. వాస్తవం ఏమిటంటే– ఈ రెండు మతాల నిజస్వరూపం ఏమిటో అంబేడ్కర్‌కు బాగా తెలుసు.

ముస్లిం మత పెద్దలు నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనకుండా, క్రైస్తవ మత పెద్దలు నిర్వహించే క్రిస్మస్ వేడుకల్లో మోదీ పాల్గొన్నారని చెప్పడం వెనుక వ్యాసకర్త దురుద్దేశం అర్థమైంది. బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ అధ్యక్షులు మోహన్ జీ భగవత్ ఇటీవల ఢిల్లీలో 60మంది ఇమాముల సమావేశంలో పాల్గొన్నారు. రామ మందిరం ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆల్ ఇండియా ఇమామ్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఇలియాసీని హిందుత్వ సంస్థలు స్నేహపూర్వకంగా ఆహ్వానించాయి. మోదీ ప్రధానిగా మొదటి టర్మ్‌లో పాకిస్థాన్‌ను సందర్శించి, అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి వెళ్ళి ఆయన తల్లికి పాద నమస్కారాలు చేసి వచ్చారు. సంస్కారవంతులకు మాత్రమే ఈ వాస్తవం బోధపడుతుంది.

దేశ జనాభాలో క్రైస్తవులు కేవలం 2.3శాతం మంది మాత్రమే అని చెప్పడం పచ్చి అబద్ధం. ఈ దేశంలో క్రైస్తవులు చర్చిలో ఒక పేరు ప్రభుత్వ లెక్కల్లో మరొక పేరుతో కొనసాగుతారు. ఈ దొంగ లెక్కలను పరిగణనలోకి తీసుకుని క్రైస్తవుల జనాభా 1971లో 2.6శాతం ఉంటే నేడు 2.3శాతం ఉందని రాజ్‌దీప్ సర్దేశాయి బుకాయిస్తున్నారు. ఈ దేశంలో ముస్లింలు, క్రైస్తవులు మతపరంగా సంఘటితంగా ఉంటూ, రాజకీయ పార్టీల పైన తమ ప్రభావాలను చూపుతూ, తమ మత వ్యూహాలను చక్కగా అమలు చేస్తున్నారు. కులాల, వర్గాల, ప్రాంతాల, భాషలవారీగా విడిపోయిన హిందువులు అని పిలవబడే మెజారిటీ సమూహమే నేడు శక్తి హీనంగా ఉంది. తమ మతాచారాలను, సంప్రదాయాలను, దేవీ దేవతలను దూషించే వాళ్లను నెత్తిన పెట్టుకోవడం వీరి సహజ నైజంగా మారిపోవడం దురదృష్టకరం!

• ఉల్లి బాలరంగయ్య

ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలి

తాము ఇస్తున్న వాగ్దానాలన్నింటినీ అధికారంలోకి వచ్చాక అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రేవంత్ సీఎంగా అధికారం చేపట్టి ఏడాదిన్నర గడచినా నేటికీ ఆయా హామీలను అమలు చేయలేదు. ముఖ్యంగా విద్యారంగంలో సమస్యలు అలాగే ఉండిపోయాయి. కుటుంబ వార్షికాదాయం రూ. మూడు లక్షలలోపు ఉన్న విద్యార్థులకు వారి కోర్సులకనుగుణంగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ ఆ హామీలను విస్మరించడంతో విద్యార్థులకు (ముఖ్యంగా బీసీలకు) వారి కళాశాలల నుంచి ఫీజుల వేధింపులు తప్పడం లేదు. విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే స్కాలర్‌షిప్‌లు కూడా పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా లేవు. తాము ఇప్పటికీ బీసీల పక్షానే ఉన్నామని కాంగ్రెస్ నమ్మబలుకుతోంది. కానీ దాని కార్యాచరణ మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం చిత్తశుద్ధితో హామీల అమలుకు కృషి చేయాలి. మెడికల్, ఇంజినీరింగ్, ఇతర కోర్సులు చదువుతున్న బీసీలకు పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి. ఆయా విద్యార్థుల నుంచి కళాశాలలు వసూలు చేసిన ఫీజులను తిరిగి వారికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– పాపని నాగరాజు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

కమ్యూనిస్టుల ఐక్యత అసంభవమా?

వంద సంవత్సరాల ఉద్యమ చరిత్ర గల ఇండియన్ కమ్యూనిస్టులు గత ఆరు దశాబ్దాలలో అనేక విధాలుగా చీలిపోయారు. సమాంతరంగా అదే వంద సంవత్సరాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థిరపడి, ఈ రోజు భారతీయ జనతాపార్టీని, పరోక్షంగా ఈ దేశాన్ని శాసిస్తున్నది.

రాజ్యాంగ రీత్యా ఎన్నికల ద్వారానే గతంలో కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొన్న కమ్యూనిస్టులు, ఈ రోజు ఆ ఎన్నికల ద్వారానే తమ అస్తిత్వాన్ని కోల్పోయే దశలో ఉన్నారు. ఈ దుస్థితికి మూల కారణాలు ఏమిటి? మార్క్సిస్టు మూల సిద్ధాంతాలను, ఈ దేశ ప్రజల స్వభావానికి, అవసరాలకు అనుగుణంగా అన్వయించి ఆచరించలేకపోవడమా? ప్రజా పోరాటాలలో అపారమైన త్యాగాలు చేసిన కమ్యూనిస్టులే దిక్కుతోచని స్థితిలో ఉన్నారా? రైతాంగ–కార్మిక పోరాటాల నాయకత్వాన్ని కోల్పోయారా?

1964 తర్వాత క్రమంగా 1970 నాటికి కమ్యూనిస్టుల్లో చీలికల్లో చీలికలు ప్రారంభమైన యథార్థాన్ని చరిత్ర నిరూపిస్తున్నది. రాజకీయ విశ్లేషకుడు సీనియర్ జర్నలిస్టు మోహన్ రామ్ (ది మెయిల్–మద్రాసు) ఆ రోజుల్లోనే రాసిన 'Split within split' పుస్తకం చర్చనీయాంశమైంది. కమ్యూనిస్టుల భవిష్యత్తు గురించి ఆనాడే ఆయన హెచ్చరించాడు. తర్వాత 'Maoism in India' అనే గ్రంథం రచించాడు.

ఇక 1974 నాటికే అంతర్జాతీయంగా రష్యన్–చైనీస్ కమ్యూనిస్టు శిబిరాలుగా విడిపోగా, కోమింటర్న్ (కమ్యూనిస్టు ఇంటర్నేషనల్) బలహీనపడింది. ఆనాటి సోవియట్ రష్యాను 'సోషల్ సామ్రాజ్యవాదం'గా కొందరు పరిగణించారు. ఆ రోజుల్లోనే తరిమెల నాగిరెడ్డి సంపాదకత్వంలో, అనంతపురం నుంచి 'జనశక్తి' పక్షపత్రిక వెలువడుతుండేది. నేను రాసిన 'జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కమ్యూనిస్టుల ఐక్యత సాధ్యమా?' వ్యాసాన్ని జూన్ 5, 1974న 'జనశక్తి'లో ప్రచురించారు.

అంతకుపూర్వం వామపక్ష రచయిత ఫెలిక్స్ గ్రీన్ ('The enemy' గ్రంథంతో ప్రసిద్ధి) అమెరికన్ వారపత్రిక 'గార్డియన్' 25వ వార్షికోత్సవంలో ప్రసంగిస్తూ సోషల్ సామ్రాజ్యవాదాన్ని విమర్శించారు. అంతర్జాతీయంగా కమ్యూనిస్టుల ఐక్యత అవసరమని కోరిన ఫెలిక్స్ గ్రీన్ ప్రసంగాన్ని నేను నా వ్యాసంలో సవివరంగా ఉటంకించాను. విప్లవకారుల మధ్య చీలిక కోసం కాకుండా ఐక్యత కోసం నిజాయితీగా కృషి జరిపినప్పుడే శ్రామికవర్గాన్ని చోదకశక్తిగా నడిపించే విప్లవ పార్టీ నిర్మాణమవుతుందని నేను రాసిన ఆ వ్యాసంలోనే, ఆనాటి ఫెలిక్స్‌గ్రీన్ వాక్యాలు కొన్ని– 'విప్లవం ఒక సంఘటన కాదు. అది ఒక క్రమ పరిణామంలో వచ్చే దశ' అనే ముగింపునకు ముందు ఆయన ఒక చోట వేసిన ప్రశ్నలు "విప్లవకరమైన మార్పులు కోరుతున్న మనం చేదు నిజాలను గమనించవలసి ఉంది. సమాజాన్ని–వ్యవస్థను సమూలంగా మార్చాలనుకున్నప్పుడు ఐక్యత, సంస్థ (పార్టీ) అవసరం. ఐక్యత, నిర్మాణం లేనప్పుడు మార్పు ఎలా సాధ్యం? మనం పరస్పరం సహకరించుకొని ఒకే సంస్థను ఎందుకు నిర్మించుకోలేము? మనలోనే ఎందుకు ఇన్ని వైరుధ్యాలు?"

> ప్రస్తుతం భారతీయ ప్రజాస్వామ్యమనేది మన రాజ్యాంగ నీడలోనే మతోన్మాదాన్ని, సంకుచిత జాతీయవాదాన్ని పెంచి పోషిస్తున్నది. మరోవైపు వికృత సంస్కృతి విజృంభించి మానవీయ విలువలు నశిస్తున్నాయి. మారిపోయిన పరిస్థితులను అనుసరించి భారతీయ కమ్యూనిస్టులు తమను తాము పునరావిష్కరణ చేసుకోవాలి.



మితవాద, అతివాద కమ్యూనిస్టులలో చీలికల పర్వం కొనసాగుతున్న కాలంలోనే, కమ్యూనిస్టు విప్లవ నాయకులు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు– ఒక మౌలిక పంథా ఆధారంగా కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతా కేంద్రంగా యూసీసీఆర్ (ఎంఎల్)ను స్థాపించారు. గత నాలుగైదు దశాబ్దాల కాలంలో ఆ మౌలిక పంథాపై సరైన చర్చ జరగలేదు, ఐక్యత ఫలించలేదు.

ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, నక్సల్బరీ–శ్రీకాకుళం తదితర పోరాటాలు జరిగిన దేశ కాల పరిస్థితులు వేరు. ఆ పోరాటాలలో కమ్యూనిస్టుల విజయాలతో పాటు, ప్రయోగాలుగా కొన్ని వైఫల్యాలు మిగిలిపోయాయి. చివరికి ఈనాడు 60 సంవత్సరాల పరిణామక్రమంలో మావోయిస్టుల మిలిటెన్సీ త్యాగాల నేపథ్యంలో వారు తమ పంథా మార్చుకుంటే తప్ప భవిష్యత్తు లేదని చరిత్ర హెచ్చరిస్తున్నది.

మరోవైపు విప్లవ కమ్యూనిస్టుల పేరిట, ఆయా గ్రూపులుగా చలామణిలో ఉన్న పార్టీలలో ముఖ్యంగా గత 25 సంవత్సరాల కాలంలో మరిన్ని చీలికలు– బ్రాండ్‌నేమ్స్ తగిలించుకున్నట్లు చీలిపోయి, నాయకత్వం కోసం స్థానిక బలం కోసం ఎవరికి వారుగా విడిపోవడం ఒక హాస్యాస్పదమైన పరిణామం.

ఈ దశలో కనీసం సీపీఐ–సీపీఎం పార్టీలైనా ఏకమై ఉమ్మడిగా పార్లమెంటరీ పంథాలోనైనా ప్రజా ఉద్యమాలను నిర్వహించవచ్చునని, కీ.శే. సురవరం సుధాకర్‌రెడ్డి చివరి వరకు కూడా మనసారా కోరుకున్నారు.

ఇంతకూ కమ్యూనిస్టుల అనైక్యతకు కారణాలేమిటి అనే మీమాంసలో, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, రచయిత కందిమళ్ల ప్రతాపరెడ్డి ఇటీవల ప్రచురించిన 'భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ఉద్యమ ప్రస్థానం' అనే పుస్తకంలో నిర్మొహమాటంగా కొన్ని ప్రశ్నలు సంధించి నిలదీస్తున్నారు– వాటిలో కొన్ని– 1) విలీనానికి ఆటంకంగా ఉన్న సిద్ధాంత విభేదాలేమిటి? 2) నాయకత్వం పోతుంది, పార్టీ ఆస్తులు పోతాయన్న భయమా? 3) నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలు దెబ్బతింటాయనా? 4) విమర్శ–ఆత్మవిమర్శ అన్న మౌలిక సూత్రాన్ని విస్మరించి, విమర్శలకే పరిమితం కావడమా? 5)ప్రజల, శ్రేయోభిలాషుల ఆలోచనా విధానాలకు భిన్నంగా ఉండడమా?

ప్రతి ఒక్క కమ్యూనిస్టు ఆత్మవిమర్శ చేసుకొని, ఐక్యత–విలీనం దిశలో కృషి చేస్తూ, కలిసొచ్చిన వారితో 'వామపక్ష ప్రజాతంత్ర–ఐక్య సంఘటన నిర్మాణం' జరగాలని ఆయన కోరుతున్నారు.

ప్రస్తుతం భారతీయ ప్రజాస్వామ్యమనేది మన రాజ్యాంగ నీడలోనే మతోన్మాదాన్ని, సంకుచిత జాతీయవాదాన్ని పెంచి పోషిస్తున్నది. మరోవైపు వికృత సంస్కృతి విజృంభించి మానవీయ విలువలు నశిస్తున్నాయి. ఈ దేశంలోని అన్ని కులాల్లో బ్రాహ్మణీయ భావజాలం, మూఢ దైవభక్తి జీర్ణించుకుపోయింది. సాంస్కృతికంగా ఒక మానవీయ ప్రత్యామ్నాయ సంస్కృతిని, కమ్యూనిస్టులు ఆచరణలో నిరూపించలేదు. కులాలు, మతాచారాల మధ్య కొట్టుకుపోయారు. శ్రామిక రంగంలో వామపక్షాల అనైక్యత, బలహీనతల వల్ల మత–మితవాద శక్తులన్నీ మరింత బలపడినాయి.

ఇప్పుడైనా మార్క్సిస్టు–లెనినిస్టు మూలసూత్రాల నిబద్ధత ఉన్న కమ్యూనిస్టులందరూ చిత్తశుద్ధితో ఏకం కాని పక్షంలో మరింతగా మూలకు నెట్టబడతారు. అర్ధ భూస్వామ్య, అర్ధ వలస స్థాయి నుంచి ఈ రోజు భారతీయ ఆర్థిక–సామాజిక వ్యవస్థ పెట్టుబడిదారి దళారుల చేతిలో ఉంది. విదేశీ పెట్టుబడులకు తోడైన స్వదేశీ క్యాపిటలిస్టులు బాహాటంగానే దోచుకుంటున్నారు. దేవాలయాలు–విగ్రహాలు నిర్మించి ప్రజలను భ్రమావరణంలోకి నెడుతున్నారు. ఈ దశలో భారతీయ కమ్యూనిస్టులు మారిపోయిన పరిస్థితులను అనుసరించి 'Reinvent' చేసుకోవడం (పునరావిష్కరణ) తిరిగి తెలుసుకోవడం అవసరమని రాజనీతి శాస్త్రవేత్తలు, ప్రజా మేధావులు భావిస్తున్నారు. గత చరిత్ర–సెంటిమెంట్ల భారాన్ని వదిలివేసి, వామపక్ష నాయకులు–అనుయాయులు ఉద్యమించడమే మార్గాంతరం!

■ నిఖిలేశ్వర్



లక్ష్మీప్రియ కాలనీలో రోడ్డుపైన పారుతున్న వరద నీరు



నీటిలోనే ఉన్న సత్తిరెడ్డి కాలనీ



బంజారాకాలనీలో ఇంట్లోకి చేరిన వరద నీరు




వదలని వరద!

జలదిగ్బంధంలో హయత్‌నగర్

బంజారాకాలనీ, సత్తిరెడ్డికాలనీల్లోకి నీళ్లు

ఇళ్లలోని నీటిని తోడుకునేందుకు ఇబ్బందులు

హయత్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి హయత్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాలు శుక్రవారం కూడా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. 2020 తర్వాత భారీ ఎత్తున వరదలు రావడం మళ్లీ ఇప్పుడే అని స్థానికులు అంటున్నారు. సుమారు మూడు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి హయత్‌నగర్ పరిధిలోని బంజారాకాలనీ, సత్తిరెడ్డి కాలనీ, లక్ష్మీప్రియ కాలనీలు జగదిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరదనీరు చేరడంతో పలు ఇళ్లలోని వస్తువులు తడిసిముద్దయ్యాయి. నీటిని బయటకు తోడేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాఘవేంద్రనగర్ కాలనీ, విజయవాడ జాతీయ రహదారి రాఘవేంద్రనగర్ కాలనీ ఫేజ్-1, 2, కోర్టు ప్రాంగణం, రెండు ఆర్టీసీ బస్సు డిపోలు, గ్రామీణ నీటి సరఫరా కార్యాలయం, ఫైర్‌స్టేషన్ ఖాళీస్థలం చెరువులను తలపించాయి. లక్ష్మీప్రియ కాలనీలో కాలువ కబ్జాకు గురి కావడంతో వరద నీరంతా కింద నుంచి పారి కాలనీలను ముంచేసింది. శుక్రవారం హయత్‌నగర్ నుంచి ఇంజాపూర్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. మునగనూర్ వరద నీటి కాలువ పనులు పూర్తికాక పోవడంతో నీరంతా హిందూ శ్మశానవాటిక నుంచి బంజారాకాలనీ, సత్తిరెడ్డి కాలనీ మీదుగా ప్రవహించింది. దీంతో బంజారాకాలనీ పూర్తిగా మునిగిపోయింది. జాతీయ రహదారిపై భారీగా వరద నీరు నిలిచింది. విజయనగర్, వీరభద్రనగర్ కాలనీలు జలమయమయ్యాయి.



టార్గెట్.. జూబ్లీహిల్స్

విజయమే లక్ష్యంగా ప్రధాన పార్టీల వ్యూహాలు

ఇప్పటికే మోహరించిన కాంగ్రెస్, బీఆర్ఎస్

త్వరలో డివిజన్ల వారీగా బాధ్యతలు అప్పగించనున్న బీజేపీ

ఆ రెండు పార్టీలకు అభ్యర్థులు ఎవరు?

పరిశీలనలో పలువురి పేర్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికపై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టాయి. ఇప్పటికే నాయకులు, కార్యకర్తలను నియోజకవర్గంలో మోహరించారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో జూబ్లీహిల్స్ శాసనసభ స్థానం ఖాళీ అయింది. త్వరలో ఎన్నికల నిర్వహణ ఉంటుందన్న సంకేతాలను ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చింది. ఈనెల 30వ తేదీన తుది ఓటరు జాబితా ప్రకటించనుండగా, ఆ తర్వాత ఎప్పుడైనా ఉప ఎన్నిక నోటిఫికేషన్ ప్రకటించే అవకాశముందని అధికార వర్గాలు చెబుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ఇది రెండో

మిగతా 6వ పేజీలో..

క్యాబ్‌లో దుండగులు.. విమానంలో పోలీసులు!

కూకట్‌పల్లి హత్య కేసులో నిందితుల కోసం వేట

- పథకం ప్రకారమే ఇంట్లో పనికి..
- డబ్బు, బంగారం కోసమే జార్ఖండ్ ముఠా స్కెచ్
- కూకట్‌పల్లి హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి
- ఐదుగురు క్రిమినల్స్ ఉన్నట్లు అంచనా



రేణు(ఫైల్)

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో జరిగిన రేణు అగర్వాల్ హత్య కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. హంతకులు క్యాబ్‌లో పారిపోతున్నట్లు గుర్తించిన పోలీసులు వారిని పట్టుకునేందుకు విమానంలో బయలుదేరినట్లు తెలిసింది. ఈ హత్య కేసులో జార్ఖండ్‌కు చెందిన హర్ష, రోషన్‌లతో పాటు మరో ముగ్గురు నిందితులున్నారని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దాంతో మరో రెండు పోలీస్ బృందాలు అదనంగా రంగంలోకి దిగినట్లు సమాచారం.

పథకం ప్రకారం..

స్వాన్‌లేక్ గేటెడ్ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లో ఉండే రాకేష్, రేణు అగర్వాల్ దంపతుల ఇంట్లో జార్ఖండ్‌కు చెందిన రాజ్ పనిచేసేవాడు. అతను ఇటీవల మానేశాడు. అతని స్థానంలో పదిరోజుల క్రితం పశ్చిమ బెంగాల్‌కు చెందిన శంకర్ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా జార్ఖండ్‌కు చెందిన హర్ష పనిలో చేరాడు. అదే అపార్టుమెంట్‌లో పై అంతస్తులో ఉంటున్న రాకేష్ సోదరుడి ఇంట్లో కూడా జార్ఖండ్‌కు చెందిన రోషన్ పనిచేస్తున్నాడు. హర్ష, రోషన్‌తో పాటు పనిమానేసిన రాజ్ జార్ఖండ్‌లో ఒకే ప్రాంతానికి చెందినవారుగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. రాకేష్ అగర్వాల్ ఇంట్లో పెద్ద ఎత్తున బంగారం, రూ.లక్షల్లో డబ్బు ఉన్నట్లు రాజ్, రోషన్‌లు గుర్తించారు. డబ్బు కొట్టేయాలని పథకం వేశారు. దీనిలో భాగంగానే రాకేష్ అగర్వాల్ ఇంట్లో రాజ్ పని మానేసి వెళ్లిపోవడం, అతని స్థానంలో హర్ష పనిలో కుదిరేలా ప్లాన్ చేశారు. హర్ష చేరిన పదిరోజుల్లోనే చోరీపని పూర్తి చేయాలని నిర్ణయించుకుని అమలు చేసినట్లు తెలిసింది.

లాకర్ కీ కోసం చిత్రహింసలు

బుధవారం మధ్యాహ్నం ఈ ముఠా తమ పథకాన్ని అమలు చేసింది. రాకేష్ ఇంట్లోకి వెళ్లిన ఇద్దరూ.. ఒంటరిగా ఉన్న రేణు అగర్వాల్ నోట్లో దుస్తులు కుక్కి కాళ్లు చేతులు కట్టేశారు. లాకర్ తాళాలు ఎక్కడున్నాయో చెప్పాలని, ఎక్కడెక్కడ డబ్బు, బంగారం ఉందో చెప్పాలని

మిగతా 6వ పేజీలో..



హైబ్రిడ్ వరి పరిశోధనలో కొత్త దృక్పథం

ఐఐఆర్ఆర్‌ను సందర్శించిన కాలిఫోర్నియా ప్రతినిధులు

6

మ్యాట్రిమోనీ సైట్‌లో పాకిస్థానీ యూట్యూబర్ ఫొటో

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ. 25లక్షలు కాజేసిన ముఠా
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరో మహిళ

6

ఆర్టీఓ చలాన్ పేరుతో సైబర్ మోసం

- ఏపీకే లింక్‌లు పంపించి ఫోన్ హ్యాక్
- రెండు కేసుల్లో బాధితుల డబ్బు రికవరీ చేసిన పోలీసులు



ఈ నగరానికి ఏమైంది?

ఒకవైపు దొంగతనాలు.. మరోవైపు హత్యలు

- పేట్రేగిపోతున్న అరాచక శక్తులు
- భయాందోళనలో నగరవాసులు
- నేరస్థుల్లో పరిచయస్థులు, అయినవారే అధికం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహానగరంలో అరాచక శక్తులు, అల్లరిమూకల ఆగడాల మితిమీరిపోతున్నాయి. ఒకవైపు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలు.. మరోవైపు నరహంతకులు పేట్రేగిపోతున్నారు. కొద్ది రోజులుగా ట్రై కమిషనరేట్స్ పరిధిలో జరుగుతున్న హత్యలు, దారిదోపిడీ ఘటనలు నగరవాసులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. ప్రశాంతంగా, శాంతిభద్రతలకు నిలయంగా ఉన్న ఈ నగరానికి ఏమైంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

మెడకోసి దారుణ హత్య

రాచకొండ కమిషనరేట్ పరిధి కుషాయిగూడలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన శుక్రవారం తీవ్ర కలకలం రేపింది. స్నేహితుడిపై కత్తితో దాడిచేసిన దుండగుడు అందరూ చూస్తుండగానే మెడను కోసి దారుణంగా హత్య చేశాడు. హత్య వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

కూకట్‌పల్లిలో దారుణం

మూడు రోజుల క్రితం కూకట్‌పల్లిలో దారుణ హత్య వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. బంగారం, డబ్బు కోసం ఇద్దరు జార్ఖండ్ యువకులు ఇంటి యజమానురాలు రేణు అగర్వాల్‌ను కుక్కర్‌తో కొట్టి, కత్తితో గొంతుకోసం పొడిచి హత్య చేశారు. వారికోసం పోలీసులు గాలిస్తున్నారు.

బాలికను హత్య చేసిన బాలుడు

రేణు అగర్వాల్ హత్యకు వారం రోజుల ముందే కూకట్‌పల్లిలో సహస్ర అనే

మిగతా 6వ పేజీలో..

దోపిడీ దొంగల హల్‌చల్

ఒకవైపు దారుణహత్యలు కలకలం రేపుతుంటే, మరోవైపు అంతర్రాష్ట్ర దొంగలు నగరంలో దోపిడీలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. రెండు రోజుల క్రితం పేట్‌బషీర్‌బాద్, అల్వాల్ పరిధిలో అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ దొంగలు హల్‌చల్ చేశారు. రాత్రీపగలు తేడాలేకుండా గొలుసు దొంగతనాలకు పాల్పడ్డారు. ఆ దొంగలు ఇంకా నగరంలోనే ఉన్నారా? పారిపోయారా? అనేది పోలీసులు తేల్చలేదు.

రూ.25 లక్షలు దోచేసిన క్యాబ్ డ్రైవర్

- బాలానగర్ పరిధిలో రెండు రోజుల క్రితం క్యాబ్‌డ్రైవర్ రూ.25లక్షలతో పరారయ్యాడు. బ్యాంకులో డ్రా చేసిన డబ్బుతో క్యాబ్‌లో ఇంటికి వెళ్లిన యజమని డ్రైవర్‌కు డబ్బులు ఇచ్చే క్రమంలో మొత్తం డబ్బున్న పెట్టెను ఎత్తుకుని పోయాడు.
- సైబరాబాద్ పరిధి శంకర్‌పల్లిలో కారును అడ్డగించిన దోపిడీ దొంగలు రూ.40 లక్షలు దొంగిలించారు. కారులో స్టీల్ వ్యాపారిని అటకాయించిన దుండగులు కత్తులతో బెదిరించి కారులో ఉన్న డబ్బుతో మరో కారులో ఉడాయించారు. దుండగుల వాహనం బోల్తా పడటంతో కారును అక్కడే వదిలేసి బ్యాగుతో ఉడాయించారు. ఈ క్రమంలో రూ.15లక్షలు కారులోనే పడిపోయినట్లు పోలీసులు గుర్తించారు.
- ఇటీవల సైఫాబాద్ పరిధిలో జరిగిన భారీ దోపిడీని సెంట్రల్ జోన్, సీసీఎస్ పోలీసులు ఛేదించారు. ముంబైకి చెందిన దొంగల ముఠా సైఫాబాద్ పరిధిలోని ఓ జువెల్లరీ దుకాణంలో దోపిడీకి పాల్పడింది. రూ.కోటిన్నర విలువైన బంగారం, డైమండ్స్ దోచుకెళ్లారు.



సమీక్షలో మాట్లాడుతున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

జీరో ఫిర్యాదులే లక్ష్యంగా పని చేయాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల నుంచి జీరో ఫిర్యాదులే లక్ష్యంగా అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ)లు క్షేత్రస్థాయిలో పనిచేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల వివిధ విభాగాలకు చెందిన 180 మంది ఏఈలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ సెక్షన్లలో ఏఈలు వారానికి రెండు సార్లు విధిగా తమ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో విద్యుత్ నెట్‌వర్క్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బస్తీలు, మురికివాడల్లో ప్రమాదకరంగా ఉన్న ఓవర్‌హెడ్ లైన్ల స్థానంలో ఎయిర్ బంచుడ్ కేబుల్స్ ఏర్పాటు చేసేందుకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ సమావేశంలో దక్షిణ డిస్కం డైరెక్టర్లు డా.నరసింహులు, శివాజీ, చక్రపాణి, అధికారులు వేణు గోపాల్, సురేష్‌లు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలకు ఆదేశం

క్యాచ్‌పిట్‌లో చిన్నారి ఘటనను తీవ్రంగా పరిగణించిన హైడ్రా

ఇద్దరు సూపర్ వైజర్లకు డిమోషన్.. మూతలు తెరిచి ఉంటే 90001 13667కు ఫోన్ చేయండి: రంగనాథ్





తెరిచి ఉన్న క్యాచ్‌పిట్‌లో పడుతున్న చిన్నారి (ఫైల్)

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యాకుత్‌పురా మౌలా కా చిల్లాలో జరిగిన క్యాచ్‌పిట్ ప్రమాద ఘటనను హైడ్రా తీవ్రంగా పరిగణించింది. వరద నీటి కాలువలో వ్యర్థాలు తొలగించి తిరిగి మూత ఏర్పాటు చేయలేదని గుర్తించిన కమిషనర్ ఏవీ రంగనాథ్ బాధ్యులపై చర్యలకు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏం జరిగిందన్న సమగ్ర సమాచారం తీసుకున్న ఆయన డీఆర్‌ఎఫ్ సూపర్‌వైజర్లు ఇద్దరు, వర్షాకాల అత్యవసర బృందాల సిబ్బంది ఇద్దరి నిర్లక్ష్యం వల్లే ఘటన జరిగిందని నిర్ధారణకు వచ్చారు. డీఆర్ఎఫ్ సూపర్‌వైజర్లు ఇద్దరికి డిమోషన్ ఇచ్చారు. అత్యవసర బృందంలోని ఇద్దరు సభ్యులను తొలగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించిన రంగనాథ్.. వ్యర్థాలు తొలగించిన చోట వెంటనే క్యాచ్‌పిట్ మూతలు పెట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా క్యాచ్‌పిట్, మ్యాన్‌హోళ్లపై మూతలు లేకుంటే జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మ్యాన్‌హోల్, క్యాచ్‌పిట్ల మూతలు తెరిచి ఉంటే 90001 13667 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని నగరవాసులను రంగనాథ్ కోరారు.

₹ 21 లక్షలు హాంఫట్

డిజిటల్ అరెస్ట్ పేరుతో వృద్ధుడిని బెదిరించి దోపిడీ



హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'మీపై మనీల్యాండరింగ్ కేసులు నమోదు అయ్యాయి. మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేస్తున్నాం' అంటూ బెదిరిగించిన సైబర్ నేరగాళ్లు నగరానికి చెందిన వృద్ధుడి నుంచి రూ.21లక్షలు దోచేశారు. డీసీపీ ధార కవిత తెలిపిన వివరాల ప్రకారం.. యాకుత్‌పురాకు చెందిన 75 ఏళ్ల వృద్ధుడికి గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ కాల్ చేశారు. ముంబై పోలీస్ అధికారుల్లా పరిచయం చేసుకున్నారు. మీ ఆధార్ కార్డుతో లింకై ఉన్న బ్యాంకు ఖాతాలు దుర్వినియోగం అయ్యాయని, మనీ ల్యాండరింగ్ మోసాలకు పాల్పడ్డారని క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఉన్నతాధికారినంటూ పోలీస్ డ్రెస్‌లో వీడియోకాల్ చేశారు. 'మీపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. మీ బ్యాంకు ఖాతాలు ఆడిట్ చేయాల్సిన అవసరం ఉంది. మీ ఖాతాల్లో ఉన్న డబ్బు ఆర్‌బీఐ ఆధీనంలో ఉన్న ఖాతాకు బదిలీ చేయాలి. ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయం కాబట్టి ఎక్కడా బయటకు చెప్పొద్దు. మనీ ల్యాండరింగ్‌తో మీకు ఎలాంటి సంబంధమూ లేదని తేలితే మీ డబ్బు మీ ఖాతాలో జమ చేస్తాం' అని నమ్మించాడు. అతని మాటలు విన్న బాధితుడు వారు చెప్పిన ఖాతాకు మొత్తం రూ. 21లక్షలు బదిలీ చేశాడు. ఆ తర్వాత ఎవరూ స్పందించకపోవడం, డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. ఇదంతా సైబర్ క్రిమినల్స్ మోసమని ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాయ చేసి ముంచేశారు..

రూ.11.86 లక్షలు కొల్లగొట్టిన నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాము సూచించిన విధంగా పెట్టుబడి పెడితే అధిక లాభాలు సంపాదించవచ్చని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఇద్దరు నగరవాసుల నుంచి రూ.11.68 లక్షలు కాజేశారు. అబిడ్స్ ప్రాంతానికి చెందిన వ్యక్తి (35) ఇన్‌స్టాగ్రామ్‌లో పార్ట్‌టైం జాబ్ ఆఫర్ ప్రకటన చూసి సంప్రదించాడు. క్యూబ్ రీసెర్చ్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధినని పరిచయం చేసుకున్న చంద్రిక అనే మహిళ ముందుగా చిన్న టాస్కులు చేయించి చిన్న మొత్తాల్లో లాభాలు అందించి నమ్మకం పొందింది. తర్వాత ప్రీపెయిడ్ జాబు చేస్తే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని చెప్పింది. బాధితుడి నుంచి సెప్టెంబరు 1 నుంచి 5వ తేదీ వరకు పలు దఫాలుగా రూ.10.25 లక్షలు పెట్టుబడి పెట్టించారు. నకిలీ వెబ్‌సైట్‌లో రూ.15.57 లక్షలు ఉన్నట్లుగా చూపారు. ఈ డబ్బు విత్‌డ్రా చేసుకునే వీలు లేకపోవడం, మరింత డబ్బు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. మరో కేసులో ఆసిఫ్‌నగర్‌కు చెందిన వ్యక్తి (44) పార్ట్‌టైం జాబ్‌కోసం ప్రయత్నించాడు. ఈ సమయంలో మైకేల్ పేజ్ ఐటీ సంస్థ ప్రతినిధినని పరిచయం చేసుకున్న వీణా ఖత్రి అనే మహిళ ముందుగా చిన్న టాస్కులు ఇచ్చి లాభాలు చూపారు. తర్వాత పెట్టుబడి పెట్టాలని సూచించడంతో నమ్మిన బాధితుడు రూ.1.61 లక్షలు పెట్టుబడి పెట్టాడు. నకిలీ వెబ్‌సైట్‌లో రూ.3.50 లక్షలు వచ్చినట్లు చూపడంతో విత్‌డ్రాకు యత్నించాడు. డబ్బు విత్‌డ్రా చేసుకోవాలంటే మరో రూ.3.50 లక్షలు పెట్టుబడి పెట్టాలని డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆ నిర్మాణాన్ని కూల్చేస్తాం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ప్రభుత్వ భూమి స్వాధీనానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మియాపూర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ భవనం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, హుడా అధికారులు స్పందించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన భవనాన్ని కూల్చివేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మార్వో వెంకారెడ్డి వెల్లడించారు. హుడా ఎమ్మార్వో దివ్యారెడ్డి స్పందిస్తూ దీనిపై సీఎం కార్యాలయం నుంచి ఆరా తీశారని, గతంలో కూల్చివేసినా తిరిగి నిర్మాణం చేపట్టినట్లు తెలిపామని అన్నారు. తక్షణం కూల్చివేయాలి అనుకున్నా, ఏడంతస్తుల భవనం కావడం, సిబ్బంది, పెద్ద మిషనరీ అవసరం ఉండటంతో సోమవారానికి కూల్చివేతను వాయిదా వేశామన్నారు. కాగా, హైడ్రా ఉన్నతాధికారులు, హుడా సైట్ ఆఫీసర్, టౌన్ ప్లానింగ్ అధికారి అక్రమ భవనాన్ని శుక్రవారం పరిశీలించారు.

ప్రైవేటుకు స్పోర్ట్స్ కాంప్లెక్సులు

ఈఓఐ ప్రకటించిన జీహెచ్ఎంసీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్సులు, మైదానాల కార్యకలాపాలు, నిర్వహణ (ఓ అండ్ ఎం)ను ప్రైవేట్‌కు అప్పగించాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఈ మేరకు ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) కోరుతూ శుక్రవారం టెండర్ నోటిఫికేషన్ ప్రకటించింది. క్రీడల వారీగా కోచ్‌లు, భవనం నిర్వహణ, విద్యుత్, ప్రాంగణం పరిశుభ్రత, పచ్చదనం, పాలనాపరమైన వ్యవహారాలు చూసుకునేందుకు ఓ వ్యక్తి, బిల్లింగ్, రికార్డుల మెయింటెనెన్స్ వంటివి ఎంపికైన సంస్థల చేయాల్సి ఉంటుంది. 24 గంటల పర్యవేక్షణకు వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. షేక్‌పేట, అమీర్‌పేట, సనత్‌నగర్, హిందీనగర్, రెడ్‌హిల్స్, విజయనగర్ కాలనీ, విక్టోరియా ప్లే గ్రౌండ్, గోల్కొండ, తాళ్లగడ్డ ప్రాంతాల్లోని స్పోర్ట్స్ కాంప్లెక్సులు, మైదానాల నిర్వహణ బాధ్యతలు అప్పగించేందుకు ఈఓఐ ప్రకటించారు. స్పోర్ట్స్ కాంప్లెక్సులు, అక్కడ అందుబాటులో ఉన్న క్రీడల ఆధారంగా బిడ్డింగ్ అప్‌సెట్ ధర నిర్ణయించింది. ఎక్కువ చెల్లించేందుకు ముందుకు వచ్చిన సంస్థలను ఎంపిక చేస్తామని ఓ అధికారి తెలిపారు. రెండేళ్ల కాలవ్యవధికి బాధ్యతలు అప్పగించనున్నారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలకు ఏర్పాట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో రెండు రోజులపాటు నిర్వహించే మిలాద్ ఉన్ నబీ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలో శనివారం సాయంత్రం దారుల్‌సలాం పార్టీ ప్రధాన కార్యాలయం మైదానంలో బహిరంగసభ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ముసారాంబాగ్ బ్రిడ్జి మూసివేత

● మూసీలో పెరిగిన వరద

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలను నిలిపివేశారు. జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ నుంచి నీటిని దిగువనున్న మూసీలోకి వదలడంతో వరద ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 2గంటల నుంచి ముసారాంబాగ్ బ్రిడ్జి మీదుగా వరదనీరు ప్రవహించడంతో బ్రిడ్జిని తాత్కాలికంగా మూసివేశారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వాహనాల రాకపోకలను నిలిపివేసి బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు.

గోల్నాక బ్రిడ్జిపై పెరిగిన ట్రాఫిక్

ముసారాంబాగ్ బ్రిడ్జి మూసివేత కారణంగా వాహనాలను గోల్నాక బ్రిడ్జి వైపు మళ్లిస్తున్నారు. దీంతో గోల్నాక బ్రిడ్జిపై వాహనాల రాకపోకల రద్దీ భారీగా పెరిగి ట్రాఫిక్ నెమ్మదిగా ముందుకు సాగుతోంది.



వాహనాల రాకపోకలను నిలిపివేసేస్తూ ముసారాంబాగ్ బ్రిడ్జికి అడ్డుగా ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు



ముసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి వరద ప్రవాహం

మరిన్ని గేట్లు ఓపెన్

● ఓఆర్ఆర్, హిమాయత్‌సాగర్ సర్వీస్‌రోడ్ల మూసివేత

నార్సింగ్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జంట జలాశయాలకు సంబంధించిన గేట్లు శుక్రవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో మరిన్ని తెరిచారు. గండిపేట జలాశయం ఐదు గేట్లు నాలుగు అడుగుల మేర తెరిచి 3వేల క్యూసెక్కుల నీటికి కిందికి వదులుతున్నారు. హిమాయత్‌సాగర్ జలాశయం నాలుగు గేట్లు నాలుగు అడుగుల మేర తెరిచి 5వేల క్యూసెక్కుల నీటికి దిగువకు వదులుతున్నారు. దీంతో ఈసీ, మూసీ నదులలో వరద ఉధృతి పెరగడంతో నార్సింగ్ ఔటర్ రింగ్‌రోడ్ సర్వీస్ రోడ్డు, హిమాయత్‌సాగర్‌లోని సర్వీస్ రోడ్డును మూసివేశారు. నార్సింగ్ నుంచి మంచిరేవుల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి.

భవన నిర్మాణ అనుమతుల జారీలో వేగం పెంచాలి

● సమీక్షా సమావేశంలో కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కర్ణన్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతుల జారీలో వేగం పెంచాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణ అనుమతులు, నివాసయోగ్య పత్రం, కోర్టు కేసులు, ప్రజా ఫిర్యాదులు, లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ప్రమాదాలు జరగకముందే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సెల్లార్ తవ్వకాలపై నిషేధం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పారదర్శకంగా పౌర సేవలందించి ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలన్నారు. చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు, అదనపు సీసీపీలు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

రెజిమెంటల్‌బజార్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతికి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యమిస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ వైఎంసీఏలో ఇంటర్నేషనల్ ఇంటిగ్రేటెడ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ అండ్ మల్టిఫెరియస్ ప్రోగ్రామ్ సెంటర్ శంకుస్థాపన, నూతన ఆడిటోరియం, లగ్జరీ గెస్ట్ రూమ్‌లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం పని చేస్తుందని అన్నారు. వైఎంసీఏ ఆశ్రయ్‌కు చైర్మన్‌గా సేవలు అందించిన మాజీ మంత్రి గీతారెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, వైఎంసీఏ అధ్యక్షులు జయకర్ డేనియల్, తెలంగాణ హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, సుప్రీంకోర్టు న్యాయవాది జోయ్స్, కార్పొరేటర్ కొంతం దీపిక, బిషప్ సింగం, లెనార్డ్ తదితరులు పాల్గొన్నారు.



ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, తదితరులు

మహాతపస్వి రామోజీరావు

రాంనగర్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పత్రికా రంగంతో పాటు అనేక రంగాలను సృశించి వాటిని నూతన దిశలో పయనింపజేసిన మహాతపస్వి రామోజీరావు అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ కొనియాడారు. రామోజీరావు గురించి ప్రముఖులు, సామాన్య ప్రజలు స్పందించి కొనియాడిన అంశాలు, ఆయన జీవిత విశేషాలతో కూడిన సంకలనాన్ని 'విరచిత రామోజీ విశ్వనరుడు' పేరిట రఘు ఆరికపూడి పుస్తక రూపంలో తీసుకొచ్చారు. దీనిని శుక్రవారం రాంనగర్‌లోని తన కార్యాలయంలో బండారు దత్తాత్రేయ ఆవిష్కరించి మాట్లాడారు. నిస్వార్థభావంతో సమాజంలో మార్పు కోసం కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. బ్లూ బుక్ ట్రస్ట్, రఘు ఆరికపూడి సేవా ట్రస్ట్ సంయుక్తంగా ఈ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కో-ఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, హాస్యబ్రహ్మ శంకరనారాయణ, సంఘ సేవకులు రితీష్ జాగిర్దార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విశ్వనరుడు రామోజీ పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు

నేడు అంబేడ్కర్ వర్సిటీ పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ఎంట్రన్స్ టెస్ట్‌ను శనివారం ఎల్బీనగర్ సర్కిల్‌లోని అయోన్ డిజిటల్ జోన్(ఐడిజెడ్-9577)లో నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంట్రన్స్ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ పోర్టల్‌ను www.braouonline.in, వెబ్‌సైట్ www.braou.ac.in లేదా 040-23680411/498/240 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలన్నారు.

18 నుంచి ఫార్మా ప్రో అండ్ ప్యాక్ 2025 ఎక్స్‌పో

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి) : భారతీయ లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాలలో అంతర్జాతీయ ధోరణులు, రాబోయే ఆవిష్కరణలను గురించి అవగాహన కలిగించేందుకు ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఫార్మా ప్రో అండ్ ప్యాక్ 2025 ఎక్స్‌పోను నగరంలో నిర్వహించబోతున్నారు. ఈ మేరకు ఇండియన్ ఎనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ అసోసియేషన్ (ఐఏఐఏ) అధ్యక్షులు చెరుకూరి రవీంద్రనాథ్ తెలిపారు. ఇండియన్ ఫార్మా మెషినరీ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఎంఎంఏ) అధ్యక్షులు హర్షిత్ షా మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో దాదాపు 650 మంది ఎగ్జిబిటర్లు పాల్గొననున్నారని, అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన శాస్త్రవేత్తలు పాల్గొంటారని ఆయన తెలిపారు.

టార్గెట్.. జూబ్లీహిల్స్

(5వ పేజీ తరువాయి)

ఎన్నిక. రెండు కూడా గ్రేటర్ పరిధిలోని నియోజకవర్గాలు కావడం గమనార్హం. గతంలో కంటోన్మెంట్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత ప్రమాదంలో మరణించడంతో ఉప ఎన్నిక జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో బోణీ కొట్టని కాంగ్రెస్.. కంటోన్మెంట్‌లో విజయం సాధించి సత్తా చాటింది. ఇప్పుడు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ అవే ఫలితాలు పునరావృతం చేయాలని అధికార పార్టీ భావిస్తోంది.

వ్యూహాత్మకం.. గెలుపు లక్ష్యం...

ఉప ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా వ్యూహాత్మకంగా పార్టీలు ముందుకు సాగుతున్నాయి. అభ్యర్థి ఎంపిక నుంచి క్షేత్రస్థాయిలో ప్రణాళికల రూపకల్పన, అమలు వరకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాయి. నియోజకవర్గంలో పార్టీ బలాబలాలు, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఏ ప్రాంతంలో ఏ నాయకుడికి బాధ్యతలు అప్పగించాలన్న దానిపైనా ప్రత్యేకంగా దృష్టి సారిస్తుండడం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కార్మిక శాఖ మంత్రి గడ్డ వివేక్‌లకు ఎన్నికల బాధ్యతలు అప్పగించింది. పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇతర నేతలనూ భాగస్వాములను చేస్తున్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఇలా..

బీఆర్‌ఎస్ డివిజన్ల వారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు బాధ్యతలు అప్పగించింది. ఐదు బూత్‌లకో కార్పొరేటర్/మాజీ కార్పొరేటర్, సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే పార్టీ శ్రేణులతో వారు సమావేశాలు నిర్వహిస్తున్నారు. గులాబీ పార్టీ నుంచి దివంగత గోపీనాథ్ సతీమణి మాగంటి సుజాత బరిలో దిగుతుందని ఇప్పటికే కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సంకేతాలిచ్చారు. దీంతో ఆమె కాలనీలు, బస్తీల్లో గోపీనాథ్ సంతాపసభలు నిర్వహిస్తున్నారు. గోపీనాథ్ తనయలూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఉప ఎన్నికల్లో విజయం లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతోంది. పార్టీ కార్యకర్తలతో రెండు పర్యాయాలు నాయకులు ఉప ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు.

అభ్యర్థులు ఎవరు?

కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. అధికార పార్టీ నుంచి నవీన్ యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి టికెట్ ఆశిస్తున్నట్టు తెలుస్తోంది. మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి పేరు కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగినా, ఆయన దానిని కొట్టి వేశారు. బీజేపీ నుంచి లంకల దీపక్‌రెడ్డి, కీర్తిరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, మాధవీలత, డాక్టర్ పద్మవీరపనేని, మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు మనుమడు ఎన్‌వీ సుభాష్ అభ్యర్థిత్వం ఆశిస్తున్నారు. వీరిలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న దానిపై సస్పెన్స్ నెలకొంది.



సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్న సీఓడీ, హెచ్‌ఎంఏ సభ్యులు

జనరేషన్ జడ్ అభివృద్ధికి నిపుణులు మార్గదర్శనం చేయాలి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యువత కేవలం వృత్తి నిపుణులుగా కాకుండా, దేశ నిర్మాణకర్తలు, మార్పును తెచ్చేవారిగా ఉండాలని సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ (సీఓడీ) సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ కందుల అన్నారు. సీఓడీ, హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్‌ఎంఏ) సంయుక్త ఆధ్వర్యంలో సీఓడీ వ్యవస్థాపకులు డాక్టర్ బీఎల్ మహేశ్వరి జ్ఞాపకార్థం హైటెక్‌సిటీలోని సంస్థ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఎంఏ అధ్యక్షుడు అల్వాల దేవేందర్ రెడ్డి మట్లాడుతూ జనరేషన్ జడ్ ఉద్యోగ రంగంలోకి అడుగిడుతున్న తరుణంలో సీనియర్లు మార్గదర్శకత్వం చేసి, వారి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సీఓడీ అధ్యక్షురాలు డాక్టర్ సునీత మహేశ్వరి మాట్లాడుతూ తన తండ్రి సీఓడీని స్థాపించి దేశంలో అగ్రగామి సంస్థగా తీర్చిదిద్దడంలో ఆయన కృషిని గుర్తు చేసుకున్నారు. వీహబ్ సీఈఓ సీత పల్లచోల్ల మాట్లాడుతూ డబ్బు కన్నా, నమ్మకం సంబంధాలు ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఏ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌మోహన్, వింగ్ కమాండర్ ఏ భరత్‌భూషణ్, నాగేశ్ విశ్వనాథం, రమేష్ వేముగంటి తదితరులు పాల్గొన్నారు.

నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర కమ్యూనిస్టులదే

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిజాం రాచరికాన్ని ఓడించిన చరిత్ర ముమ్మాటికీ కమ్యూనిస్టులదే అని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నర్సింహ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని అన్నారు. కమ్యూనిస్టు పోరాటాల ఫలితంగానే వెట్టిచాకిరీ రద్దు, భూసంస్కరణ చట్టం అమలు జరిగిందని అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్, సీనియర్ నాయకులు పి.ప్రేమ్‌పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్. ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి. స్టాలిన్‌లతో కలసి ఆయన మాట్లాడారు. సాహసం, అమరత్వంతో కూడిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను, హిందూ ముస్లిం మధ్య జరిగిన సంఘర్షణగా ఉద్యమంలో పాల్గొనని బీజేపీ ప్రస్తుతం చిత్రీకరిస్తోందని విమర్శించారు. భవిష్యత్తు తరాలకు తప్పుడు చరిత్రను అందిస్తే రాష్ట్ర ప్రజలు సహించరని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్యాగాలు చేసిన చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందుదామనుకున్న బీజేపీకి ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గసభ్యులు ఎండి. సలీమ్, కె.శ్రీనివాస్, ఆరుట్ల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ



మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

రైల్వే స్టేషన్లలో అదనంగా సీసీ కెమెరాలు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలను మరింత పెంచాల్సిన అవసరం ఉందని డీజీపీ జితేందర్ అన్నారు. రైల్వేల రాష్ట్రస్థాయి సెక్యూరిటీ కమిటీ సమావేశం శుక్రవారం డీజీపీ కార్యాలయంలో జరిగింది. అధ్యక్షత వహించిన డీజీపీ జితేందర్ మాట్లాడుతూ సీసీ కెమెరా వ్యవస్థ పటిష్ఠ పరచుకోవడం ద్వారా దొంగతనాలను, డ్రగ్స్ సరఫరాను పసిగట్టవచ్చని అన్నారు. దొంగతనాలు, మరణాలు, మహిళలపై నేరాలు, డ్రగ్స్ సరఫరా వంటి నేరాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అంతకు ముందు రైల్వేల భద్రత విషయంలో జీఆర్‌పీ,ఆర్‌పీఎఫ్ అధికారులు వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు డీజీపీ అనిల్‌కుమార్, రైల్వే ఐజీ రమేష్ నాయుడు, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ నగరానికి ఏమైంది?

(5వ పేజీ తరువాయి)

బాలిక హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బ్యాట్ దొంగతనానికి వెళ్లిన 14 ఏళ్ల బాలుడు.. బాలికను హత్య చేశాడు.

భార్యను చంపి ముక్కలుగా..

రాచకొండ కమిషనరేట్ పరిధిలో పదిరోజుల క్రితం భార్య గర్భిణి అని తెలిసికూడా గొంతునులిమి హత్య చేశాడు. ఆమె శరీర భాగాలను రంపంతో కోసి తల, కాళ్లు, చేతులు ముక్కలుగా నరికి ప్లాస్టిక్ కవర్లలో మూటగట్టి మూసీలో పడేశాడు. ఒళ్లు గగుర్పొడిచే ఈ దారుణ హత్య మేడిపల్లి పరిధిలో వెలుగులోకి వచ్చింది. ఇవే కాకుండా చాంద్రాయణగుట్ట పరిధిలో ఇటీవల వెలుగులోకి వచ్చిన రెండు హత్యలు కలకలం సృష్టించాయి.

పరిచయస్తులే అధికం

దారుణహత్యలకు, నేరాలకు, దోపిడీలకు పాల్పడుతున్న వారిలో ఎక్కువగా తెలిసినవారు, పరిచయస్తులే ఉంటున్నారని పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యంగా హత్యలకు పాల్పడుతున్న వారిలో రక్తసంబంధీకులు, స్నేహితులు ఉంటున్నారు. అనైతిక సంబంధానికి అడ్డొస్తున్నారనో, డబ్బుల పంపకాల్లో తేడాలు, స్నేహితుడు మోసం చేశాడనో, ఆస్తికోసమో.. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ఘటనల్లో తెలిసిన వారే హంతకులు, నేరస్థులుగా తేలుతున్నారు.

క్యాబ్‌లో దుండగులు.. విమానంలో పోలీసులు!

(5వ పేజీ తరువాయి)

చిత్రహింసలు పెట్టారు. సుమారు గంటకుపైగా ఆమెను చిత్రహింసలు పెట్టినా నోరు విప్పకపోవడంతో ఆగ్రహానికి గురైన దుండగులు కుక్కర్‌తో ఆమె తలపై బలంగా మోదారు. ఆపై కత్తితో గొంతుకోసి విచక్షణా రహితంగా పొడిచి చంపేశారు. అనంతరం ఇంట్లోనే స్నానం చేసి, ట్రావెల్ బ్యాగుతో యజమాని స్కూటీపై పారిపోయారు.

క్యాబ్‌లో దుండగుల పరారీ..

దుండగులు హఫీజ్‌పేట రైల్వేస్టేషన్‌లో స్కూటీని వదిలేసి, క్యాబ్ మాట్లాడుకొని పారిపోయినట్లు పోలీసులు గుర్తించినట్లుగా తెలిసింది. స్కూటీని స్వాధీనం చేసుకున్న పోలీసులు టెక్నికల్, సైంటిఫిక్ ఎవిడెన్స్ సేకరించారు. ఇదిలా ఉండగా.. దుండగులు క్యాబ్‌లో పారిపోయినట్లు గుర్తించిన పోలీసులు హుటాహుటిన విమానంలో జార్ఖండ్‌కు బయల్దేరారు. వారు జార్ఖండ్ చేరుకునేలోపు, పోలీసులు అక్కడికి రీచ్ అయినట్లు తెలిసింది. కాగా.. మరో బృందం క్యాబ్‌ను వెంబడించి వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ముఠాలో మొత్తం ఐదుగురు నిందితులు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరంతా శంకర్ ఏజెన్సీ ద్వారా వివిధ ప్రాంతాల్లో పనిమనుషులుగా చేరిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. నిందితులు ఎక్కువ మంది ఉన్నట్లు తేలడంతో మరో రెండు బృందాలు అదనంగా దిగినట్లు తెలిసింది. నేడు హంతకుల ముఠాను అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

రేడియేషన్ థెరపీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రేడియేషన్ థెరపీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. శుక్రవారం భారత రేడియేషన్ థెరపిస్టులు, టెక్నాలజిస్టుల సంఘం (ఏఆర్‌టీటీఐ) ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించిన వార్షిక సదస్సు ఆర్టికాన్-2025ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ, విదేశాల నిపుణుల మధ్య సహకారం కోసం ఒక విశిష్ట వేదికగా ఈ సదస్సు నిలిచిందన్నారు. సదస్సులో సింధు హాస్పిటల్ డైరెక్టర్ డా. ఎం. బాబయ్యతో పాటు దేశవిదేశాల ప్రతినిధులు, ప్రముఖ ఆస్పత్రుల వైద్య సంచాలకులు, అంకాలజిస్టులు, రేడియేషన్ థెరపీ నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

దమ్ముంటే రాజీనామా చేసి గెలవాలి

• ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌పై కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఫైర్



రాజేంద్రనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి ప్రస్తుతం అభివృద్ధి కోసమే తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశానని, పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే ఉన్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ మాట్లాడటం సిగ్గుచేటని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌పై మండిపడుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన తరుణంలో స్థానిక ఎమ్మెల్యే చిల్లర రాజకీయాలకు తెరలేపారని పేర్కొన్నారు. స్పీకర్ ఎమ్మెల్యేకు నోటీసులు ఇవ్వడంతో తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని చెప్పే సమాధానం విస్తుపోయేలా ఉందన్నారు. కాంగ్రెస్ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేపై శాసనసభాపతి చర్యలు తీసుకోవాలన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యే తమ పదవికి రాజీనామా చేసి, తిరిగి ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని తోకల శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యేగా ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొంటున్నారో చెప్పాలన్నారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే అదే పార్టీలోకి మారడం ప్రకాష్‌గౌడ్‌కు పరిపాటిగా మారిందన్నారు.

గతంలో టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లోకి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారుతూ తన ఆస్తులను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డికి క్షీరాభిషేకాలు చేశారని, ఇది నిజం కాదాని మండిపడ్డారు. ఇప్పటికీ నాలుగు సార్లు గెలిచానని చెప్పుకొంటున్న ప్రకాష్‌గౌడ్ ఎంఐఎం పుణ్యామా అని గెలుస్తున్నావని చురకలంటించారు. ప్రకాష్‌గౌడ్ నీతిలేని రాజకీయాలకు పునాది వేసుకున్నారని, రాజకీయాల్లో కొనసాగాలనుకుంటే రాజీనామా చేసిన తర్వాత కాంగ్రెస్ పార్టీ బీఫామ్ తీసుకొని గెలిచి చూపించాలన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పుకోలేని పరిస్థితి ప్రకాశ్‌గౌడ్‌కు దాపురించిందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

'ఆర్టీసీని పరిరక్షించుకోవాలి'

రాజేంద్రనగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సేవ్ ఆర్టీసీ అంటూ టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతూ నిరసనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాజేంద్రనగర్ డిపో కార్యదర్శి వడ్డె చంద్రయ్య, హైదరాబాద్ రీజియన్ కార్యదర్శి ఎస్.క్రిష్ణ మాట్లాడుతూ, ఆర్టీసీని పరిరక్షించుకోవాలన్నారు. ఆర్టీసీని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు సబ్సిడీ మీద ఇస్తున్న విద్యుత్ బస్సులను సబ్సిడీ మీద ఆర్టీసీలకే ఇవ్వాలని కోరారు. విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేయాలన్నారు. కార్మికులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పని గంటల భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఆర్. పాపయ్య, బి.నారాయణ, చారి పాల్గొన్నారు.

పించన్ల పెంపునకు ప్రభుత్వంపై యుద్ధం

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చేయూత పింఛన్ల పెంపు కోసం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై ప్రత్యక్ష యుద్ధం చేస్తామని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కోర్ కమిటీ చైర్మన్ అందె రాంబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లలితాబాగ్ డివిజన్ ముక్కెర బస్తీ వద్ద దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్నికలకు ముందు దివ్యాంగులకు రూ. 6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, నేత, బీడీ కార్మికులతో పాటు చేయూత పింఛన్లు రూ. 4వేలకు పెంచుతామన్న హామీని విస్మరించారని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ముందుకొచ్చి పింఛన్ దారులకు మద్దతుగా పోరాటం చేస్తున్నారన్నారు. ఈ పోరాటంలో భాగంగానే ఈనెల 15న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట మహా ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఎం.రమేశ్ మాదిగ, వై.నరసింహ మాదిగ, దార్ల యాదగిరి మాదిగ, శారద, జంగమ్మ, అండాలమ్మ, లక్ష్మమ్మ, సునీత, కళమ్మ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం విషయంలో రెండు వర్గాల మధ్య గొడవ

కార్వాన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఓ స్థలం విషయంలో రెండు గ్రూపుల మధ్య గొడవ జరిగింది. టప్పాచబుత్ర పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కార్వాన్ నియోజకవర్గం, గుడిమల్కాపూర్ డివిజన్ రాంసింగ్‌పురాలో 16 ఎకరాల స్థల వివాదం కొన్నేళ్లుగా కోర్టులో కొనసాగుతోంది. అనీలాజైషా(75) అనే మహిళకు తన సోదరులతో ఉన్న ఆస్తి తగదాలో తనకు కోర్టు ద్వారా 3.08 ఎకరాల స్థలం వచ్చిందని, ఈ స్థల వివాదం కోర్టులో ఉన్నందున సాక్ష్యాధారాల కోసం తన లాయర్ వేణుగౌడ్‌తో కలిసి స్థలం పరిశీలనకు వచ్చింది. అనీలా జైషా తరఫు యువకులు దాడి చేయడంతో కుందన్‌లాల్ గాయపడ్డాడు. సమాచారం అందుకున్న కుల్సుంపురా ఏసీపీ మునావర్ అలీ ఆధ్వర్యంలో టప్పాచబుత్రా, కుల్సుంపురా, గుడిమల్కాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలపై లాఠీచార్జి చేయడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ అభిలాష్ తెలిపారు.

'అక్రమ మదర్సాలపై చర్యలు తీసుకోవాలి'

పహాడీషరీఫ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ సుల్తాన్ పూర్‌లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కాషాయ జెండాలను శుక్రవారం శానిటేషన్ సిబ్బందితో పోలీసు అధికారులు దగ్గరుండి తీయించడంపై బీజేపీ రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అందేలా శ్రీరాములు మాట్లాడుతూ, అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాలపై చర్యలు తీసుకోమంటే హిందువులు ఉన్న గ్రామంలో కాషాయ జెండాలను ఎందుకు తొలగించారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈనెల 19 తారీఖున అధికారులు అడిగిన గడువు ముగిస్తుందని.. అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాపై చర్యలు తీసుకోకుంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అధికారులను హెచ్చరించారు.

17వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

రాజేంద్రనగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల వారోత్సవాలను ఈనెల 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఫైమిధ తెలిపారు. రాజేంద్రనగర్ మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.మునీశ్వరీ అధ్యక్షతన శుక్రవారం బుద్వేల్‌లోని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యాలయం (ఏఆర్ దేవరాజ్ భవన్)లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఈనెల 11నుంచి 17వతేదీ వరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని మండలాల్లో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి లక్ష్మి, బండారి శాంతమ్మ, కె.జ్యోతి, పి.బుజ్జి, ఆర్.వెంకటమ్మ, జి.విజయ పాల్గొన్నారు.

'ఇది అతని సంతకం' నాటకం ప్రదర్శన

రవీంద్రభారతి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషి జీవితంలో ఒక గోల్, నిర్దిష్టమైన ప్రణాళిక ఉంటుంది. వాటిని ఆచరణలో పెట్టి సాధించుకోగల వారి జీవితం పరిపూర్ణమవుతోందనే సందేశాన్నిస్తూ సాగిన 'ఇది అతని సంతకం' నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. శుక్రవారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ ఆధ్వర్యంలో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారు సమర్పించిన 'ఇది అతని సంతకం' నాటకం ప్రదర్శించారు. ప్రతి నెలా నాటకం ప్రేక్షకుడికి వినోదం, నటుడికి ఆనందం పేరిట సాగుతున్న నాటకోత్సవంలో భాగంగా ఈ నెల ఈ నాటకాన్ని ప్రదర్శించారు. స్నిగ్ధ (గోపి సత్యప్రకాష్) రచించిన ఈ నాటకానికి ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. మనిషి జీవితం ఎలా ఉండాలో అనే సారాంశంతో సాగిన ఈ నాటకం ఆహూతుల్ని రంజింపజేసింది. ఈకార్యక్రమానికి పలువురు నాటక ప్రయోక్తలు అతిథులుగా హాజరై కళాకారులను సత్కరించారు. రసరంజని సంస్థ నాటక రంగానికి చేస్తున్న సేవలను కొనియాడారు.

ఆకట్టుకుంటున్న గృహోపకరణాల ఎగ్జిబిషన్



ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా దృశ్యం

నార్సింగ్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా చేతివృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్‌ను మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్‌గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, శారీస్, భాగల్‌పూర్‌శారీస్, డిజైనరల్ శారీస్, కాంతావర్క్ శారీస్, హ్యాండ్ బ్యాలక్ ప్రింటెడ్ శారీస్, లెలిన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీటాప్స్, డిజైనర్ బ్లౌస్, లక్నో చికెన, బనారస్ శారీస్, ఖాదీమెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌సీట్స్ కొండపల్లి టాయ్స్ తదితర శారీస్‌ను మహిళలకు అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాలో పాల్గొని కొనుగోలు చేసుకోవాలని కోరారు.

ఈ నెల 15,16న స్పాట్ అడ్మిషన్లు

మదీన, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): హుసేని ఆలం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 15, 16న స్పాట్ అడ్మిషన్లకు 'దోస్త్' అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పియా చిన్నమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా తొలి ప్రాధాన్యం స్థానిక కోటా విద్యార్థులకు ఇస్తారని, స్పాట్ అడ్మిషన్ ద్వారా చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదన్నారు. అడ్మిషన్లు ఇంటర్ మార్కుల మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ ప్రకారం తీసుకుంటారన్నారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో 20 సీట్లు, బీకాం బీఎఫ్ఎస్ఐలో 33 సీట్లు, బీఏలో 8 సీట్లు, బీఏ కంటెంట్ అండ్ క్రియేటివ్ రైటింగ్‌లో 60 సీట్లు, బీఎస్సీ లైఫ్ సైన్సెస్‌లో 8 సీట్లు, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 24 సీట్లు, బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో 3 సీట్లు, బీఏలో 15 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు ఈనెల 15, 16 తేదీలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని హుసేనీ ఆలం కళాశాలకు రావాలని దోస్త్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ తెలిపారు. ఇతర వివరాలకు 9849623336 సంప్రదించవచ్చన్నారు.

స్నేహితుడిపై దాడి

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడిపై దాడి చేసిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమా ఫాతిమానగర్‌కు చెందిన జావిద్(35), అక్బర్(40) స్నేహితులు. వీరిద్దరి మధ్య పాత గొడవలున్నాయి. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి రోడ్డుపై వెళ్తు క్రమంలో ఇద్దరిమధ్య స్వల్ప వివాదం తలెత్తింది. ఆగ్రహానికి గురైన అక్బర్ జావెద్‌పై దాడి చేసి కన్ను భాగంలో తాళం చేవితో గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/E8lxMoZలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయగలరు.



మాట్లాడుతున్న దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా

శాంతియుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలి

చార్మినార్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మిలాద్-ఉన్-నబీ జులూస్ సందర్భంగా యువకులు మార్కజే మిలాద్-ఉన్-నబీ జులూస్ కమిటీ ఆదేశాలు పాటించలని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా అన్నారు. శుక్రవారం దక్షిణ మండలం డీసీపీ కార్యాలయంలో పోలీస్ అధికారులు మార్కజే మిలాద్-ఉన్-నబీ జులూస్ నిర్వాహకులతో సనా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, యువకులు మిలాద్-ఉన్-నబీ సందర్భంగా శాంతి యుతంగా ర్యాలీ నిర్వహించుకోవాలని, డీజే, బాణ సంచాలకు అనుమతి లేదని, ద్విచక్ర వాహనాలతో స్టంట్లు చేసి ప్రమాదలకు గురికాకూడదన్నారు. ర్యాలీకి రూట్ మ్యాప్‌లో పోలీస్‌లు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారన్నారు. సమావేశంలో దక్షిణ మండలానికి చెందిన అడిషనల్ డీసీపీ, నలుగురు ఏసీపీలు ఇన్‌స్పెక్టర్లు మెలద్ జులూస్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉద్యోగ నియామకాలపై దృష్టి పెట్టాలి'

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థల బలోపేతానికి, కొత్త ఉద్యోగ నియామకాలపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి.టి. జీవన్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం నాంపల్లి ఎక్సైజ్ ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడి పుష్కర కాలం గడుస్తోందని, ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సమస్యలు, క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పరిధిలో కార్పొరేషన్లలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు, కొత్త నియమాకాలపై సీఎంకు వినతి పత్రం అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో 93 ప్రభుత్వ రంగ కార్పొరేషన్లు నడుస్తున్నాయని, 32 కార్పొరేషన్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వానికి ఎన్నో లాభాలను అర్జించి పెడుతున్న సంస్థల్లోనైనా నూతన ఉద్యోగ నియామాలపై దృష్టి సారించాలని ఆయన కోరారు.

రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ అందజేయాలి

చాంద్రాయణగుట్ట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ని శుక్రవారం ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఆడాల శివకుమార్ కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఆర్థికమంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంద కార్తీక్ ఉన్నారు.



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో ఆడాల శివకుమార్

గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు తీర్పు చరిత్రాత్మకం

రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య


అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 ఫలితాలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైందని, తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి రిక్రూట్‌మెంట్‌ను త్వరగా పూర్తిచేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్ చేస్తే నిరుద్యోగులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో హైకోర్టు తీర్పుపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ గ్రూప్-1 ఫలితాల్లో తెలుగు మీడియం వారికి అన్యాయం జరిగిందని ఆరోపించారు. పరీక్ష రాసిన 719 మందికి ఒకే విధంగా మార్కులు రావడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. డబ్బుకోసం అక్రమాలకు పాల్పడ్డారని, సమగ్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, నందగోపాల్, పగిళ్ల సతీష్, వంశీకృష్ణ, రాందేవ్‌మోది తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న టీఎస్ఏ నాయకులు

పరీక్ష రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష రద్దు చేయాలని తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎం.శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో టీజీపీఎస్సీ నిర్లక్ష్య వైఖరి బహిర్గతం అయిందన్నారు. అభ్యర్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తిరిగి పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడీ ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి రాజేష్ చౌహాన్, సురేష్, రాజ్‌కుమార్ యాదవ్, పృథ్వీరాజ్, వినోద్ పాల్గొన్నారు.


చైతన్య యాత్ర కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ చీమ శ్రీనివాస్ తదితరులు

నేటి నుంచి ఉద్యమకారుల చైతన్య యాత్ర

బర్కత్‌పుర, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13 నుంచి రెండు నెలల పాటు 584 మండలాల్లో చైతన్యయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. యాత్ర శనివారం ఉదయం 11 గంటలకు ఎల్‌బీనగర్ చౌరస్తాలోని శ్రీకాంత్‌చారి విగ్రహం నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఈ సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఉద్యోగ నియామకాల్లో ఉద్యమకారులకు 20 శాతం కోటా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి సురేందర్‌రెడ్డి, నాయకులు దయానంద్, వీరస్వామి, రజనీకాంత్, సుదర్శన్, జగన్‌యాదవ్, ఆర్‌పీఐ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ గౌడ్

బీసీ ఉద్యోగుల సంఘానికి గుర్తింపునివ్వాలి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలనీ, క్రీమీలేయర్‌ను ఎత్తివేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రమంజిల్‌లో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వారాల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ ఉద్యోగుల వివరాలు బీసీ కమిషన్‌కు సమర్పించాలని, పెండింగ్ బిల్స్, రిటైర్‌మెంట్ బకాయిలను రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. జ్ఞానేశ్వర్, కార్యదర్శి అనురాధ, మహేంద్రసాగర్, యాదన్న తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ వాణి బాధ్యతల స్వీకరణ



అడ్డగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి సూపరింటెండ్‌గా డాక్టర్ వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానన్నారు. 2006లో వరంగల్ కేఎంసీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఏడాదిపాటు అదనపు డీఎంఈ, డీఎంఈగా పనిచేశారు.

శివారు ప్రయాణికులే లక్ష్యంగా కొత్త బస్ రూట్లు

- ఐటీ కారిడార్ కేంద్రంగా బస్సుల సంఖ్య పెంపు
- ఎక్కువ మంది ప్రయాణాలు సాగించే మార్గాలపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాల ప్రయాణికులే లక్ష్యంగా కొత్త బస్‌రూట్లు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఆర్టీసీ చర్యలు చేపడుతోంది. గ్రేటర్‌జోన్ పరిధిలో ఆర్టీసీ 700కు పైగా రూట్లలో బస్సులు నడుపుతుండగా మరిన్ని కొత్త రూట్లపై దృష్టిపెట్టింది. మెహిదీపట్నం, దిల్‌సుఖ్‌నగర్, మియాపూర్, ఉప్పల్, ఎల్‌బీనగర్, ఈసీఐఎల్, పటాన్‌చెరు వంటి ప్రాంతాల నుంచి సమీపంలో 20 కిలోమీటర్ల పరిధిలో కొత్తగా వెలుస్తున్న కాలనీలు, గెటెడ్ కమ్యూనిటీలకు బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటోంది. ప్రధానంగా ఎక్కువ మంది ప్రయాణాలు సాగిస్తున్న రూట్లలో 25 బస్ డిపోల మేనేజర్లు క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ ప్రయాణికుల రద్దీ వివరాలు సేకరిస్తున్నారు. ఆఫీస్, కాలేజీ సమయాల్లో ఉదయం, సాయంత్రం ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల ట్రిప్పులు పెంచేదిశగా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుంది.

ఐటీ కారిడార్ కేంద్రంగా ఎలక్ట్రిక్ బస్సులు

గ్రేటర్‌లోని ప్రధాన ప్రాంతాల నుంచి ఐటీ కారిడార్‌కు ఆర్టీసీ బస్సులు అధిక సంఖ్యలో నడిపే దిశగా ఆర్టీసీ చర్యలు చేపడుతుంది. అక్టోబరు, నవంబరు నెలలో అందుబాటులోకి తీసుకురాబోతున్న 275 ఎలక్ట్రిక్ బస్సులను ఐటీ కారిడార్ కేంద్రంగా నడిపేందుకు పరిశీలిస్తున్నారు. మాదాపూర్, రాయదుర్గం, గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాలకు శివారు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులతో పాటు మెట్రో డీలక్స్ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటుంది.

ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలి

వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన శైలజా రామయ్యర్


చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న శైలజా రామయ్యర్

రాంనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించాలని ఇండస్ట్రీస్ కామర్స్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, టెస్కో వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజా రామయ్యర్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం టెస్కో ఆధ్వర్యంలో శుక్రవారం రాంనగర్‌లోని రాజ్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించడం, వినియోగదారులకు నాణ్యమైన చేనేత వస్త్రాలు సరసమైన ధరలకు అందించడమే ప్రధాన లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర చేనేత సహకారం సంఘం (టీజీఎస్‌సీవో) పనిచేస్తుందన్నారు. ఈ నెల 12 నుంచి నవంబరు 12వ తేదీ వరకు వస్త్ర ప్రదర్శన కొనసాగుతుందన్నారు. తగ్గింపు ధరలకు వస్త్రాలు విక్రయిస్తారన్నారు. ప్రదర్శనలో పోచంపల్లి, ఇక్కత్, గద్వాల, నారాయణపేట, గొల్లభామ పట్టు చీరలు, సీకో చీరలు, కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ రెడీమెడ్స్ లుంగీలు, టవల్స్ దుప్పట్లు, కలంకారి, ఖాదీ వస్త్రాలతో పాటు రాజమండ్రి, వెంకటగిరి, బందరు, ధర్మవరం చీరలు ప్రదర్శనలో అమ్మకానికి ఉంచారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో టెస్కో మేనేజింగ్ డైరెక్టర్ రఘునందన్‌రావు, ఓఎస్‌డీ రతన్‌కుమార్, ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, ప్రెసిడెంట్ విజయ్‌కుమార్, డివిజనల్ మార్కెటింగ్ అధికారి కళింగరెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు సందీప్‌జోషి, కేటీచారి, మాధడి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మ్యాట్రిమోనీ సైట్‌లో పాకిస్థానీ యూట్యూబర్ ఫొటో

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి రూ. 25 లక్షలు కాజేసిన ముఠా
- ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరో మహిళ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మ్యాట్రిమోనీ సైట్‌ను ప్రారంభించి, అందులో అందమైన అమ్మాయిల ఫొటోలు పెట్టి మోసాలు చేస్తున్న ముఠాలోని ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు పాకిస్థానీ యూట్యూబర్ ఫొటో పెట్టి, ఆమెనే పెళ్లి కూతురుగా చూపించి నగరానికి చెందిన వ్యక్తి నుంచి రూ.25 లక్షలు వసూలు చేశారని సైబర్ క్రైం అధికారులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం బిజాపూర్‌కు చెందిన అనీసా మహ్మదైసయీమ్(33), జోహర్ ఫాతిమా(24), నగరానికి చెందిన మహ్మద్ అబ్దుల్ అమేర్ ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఖుబ్‌సూరత్ రిస్తే పేరుతో వెబ్‌సైట్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు ప్రారంభించారు. ఇందులో అందమైన యువతుల ఫొటోలు పెట్టి యువకులను ఆకర్షించి మోసాలు చేస్తున్నారు. నగరానికి చెందిన ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఖుబ్‌సూరత్ రిస్తే' పేరుతో ఉన్న మ్యాట్రిమోనీ పేజ్‌లో అందమైన యువతి ఫొటో చూశాడు. అందులో మహిళ ఫోన్ నంబర్ ఉండటంతో ఆమెతో మాటలు కలిపాడు. సదరు మహిళ తరచూ వీడియో కాల్స్ చేసి యువకుడితో మాట్లాడేది. త్వరలో పెళ్లి చేసుకుందామని చెప్పేది. ఆమె మాటలు నమ్మిన బాధితుడు ఆమెతో తరచూ చాటింగ్‌లో ఉండేవాడు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం అంటూ సాకులు చెప్పిన మహిళ పలు దఫాలుగా రూ.25 లక్షలు వసూలు చేసింది. తర్వాత మ్యాట్రిమోనీ ప్రొఫైల్‌లో తాను చూసిన యువతి ఫొటో.. పాకిస్థానీ యూట్యూబర్‌దని గ్రహించాడు. డబ్బు తిరిగి ఇవ్వమనగా నిందితులు తిరస్కరించడంతో సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులు అనీసా, అబ్దుల్ అమేర్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు మొబైల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ట్యాబ్, ఐదు బ్యాంక్ పాస్‌బుక్‌లు, మూడు చెక్‌బుక్‌లు, మూడు డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. మరో మహిళ జోహర్ ఫాతిమా పరారీలో ఉన్నట్లు సైబర్ క్రైం అధికారులు తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు


నిందితుడు దినేష్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను మభ్యపెట్టి, పెళ్లి చేసుకొని లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సంగారెడ్డి ప్రాంతానికి చెందిన కార్ని దినేష్(29) చైతన్యపురి ప్రాంతంలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రేమ పేరుతో బాలికకు(17) మాయ మాటలు చెప్పి అపహరించి పెళ్లి చేసుకొని లైంగి దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చైతన్యపురి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు ప్రారంభించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు నిందితుడు దినేష్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది.

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్లు..

అత్యాచారం కేసులో నిందితుడికి న్యాయస్థానం పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. సైబరాబాద్ క్రైం విభాగం డీసీపీ ముత్యం రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల నేతాజీనగర్‌కు చెందిన ఎం. సందీప్(29) ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయస్థానం నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. కిడ్నాప్ చేసినందుకు మరో ఐదేళ్ల శిక్ష విధించిందని డీసీపీ ముత్యంరెడ్డి తెలిపారు.

తనయుడికి తల్లి తలకొరివి


కొడుకుకు తలకొరివి పెడుతున్న తల్లి గౌరమ్మ

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) ఇంట్లో మరో మొగ దిక్కు లేకపోవడంతో కన్న తల్లే కొడుకుకి తలకొరివి పెట్టిన విషాదకర సంఘటన గుండ్లపోచంపల్లిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న గౌరమ్మకు ముగ్గురు ఆడ పిల్లలు, ఒక కొడుకు పవన్ అలియాస్ నరేశ్(18). వారం రోజుల క్రితం బైక్ పైనుంచి అకస్మాత్తుగా జారి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నరేశ్ శుక్రవారం మృతి చెందాడు. తల్లే కుమారుడికి తలకొరివి పెట్టడంతో స్థానికులు కంటతడిపెట్టారు.

ప్లాట్లు, ఫ్లాట్లు ఇపిస్తానంటూ రూ. కోట్లు వసూలు

నిందితుడి అరెస్ట్

కొత్త పేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్లాట్లు, ఫ్లాట్లు ఇప్పిస్తానంటూ కోట్ల రూపాయలు వసూలు చేసిన నిందితుడిని ఎల్‌బీనగర్ లా అండ్ ఆర్డర్, ఎస్ ఓ టీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ రింగ్ రోడ్డు సమీపంలో డుమ్మావత్ శ్రీకాంత్ కొందరితో కలిసి క్రితిక ఇన్‌ఫ్రా డెవలపర్స్ పేరుతో ప్లాట్ల విక్రయ కార్యాలయం ఏర్పాటు చేశాడు. నగర శివారుల్లో పలు వెంచర్లలో ప్లాట్లు విక్రయించే ముసుగులో వినియోగదారుల వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడని అతడి పై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఎల్‌బీనగర్‌లో అపార్ట్‌మెంట్ నిర్మిస్తున్నామని, సెల్లార్ పనులు జరుగుతున్నాయని నమ్మించి ఫ్లాట్ ఇప్పిస్తానని నమ్మించి ఉప్పల్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.38.46 లక్షలు తీసుకున్నాడు. ఇలా పలువురి వద్ద డబ్బులు తీసుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఏపీలో కూడా అతడిపై కేసులున్నాయి. ఎల్‌బీనగర్‌లో 13, మేడిపల్లి, సరూర్‌నగర్, వనస్థలిపురంలో ఒకటి చొప్పున కేసులు నమోదయ్యాయి.

ఆర్టీవో చలాన్ పేరుతో సైబర్ మోసం

- ఏపీకే లింక్‌లు పంపించి ఫోన్ హ్యాక్
- ఖాతాల్లో నగదుతో సైబర్ నేరగాళ్ల ఆన్‌లైన్ షాపింగ్
- రెండు కేసుల్లో బాధితుల డబ్బు రికవరీ చేసిన పోలీసులు



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో ఏపీకే లింక్‌లు పంపించి సైబర్ నేరగాళ్లు కాజేసిన మొత్తాన్ని సైబర్ క్రైం సిబ్బంది రికవరీ చేశారు. మొఘల్‌పురాకు చెందిన టైలర్ (48) ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు చలాన్ పెండింగ్ ఉందంటూ 'ఆర్‌టీఓ చలాన్' పేరుతో ఏపీకే లింక్ పంపించారు. బాధితుడు లింక్‌ను ఓపెన్ చేసి మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. దీంతో ఫోన్‌ను నియంత్రణలోకి తీసుకున్న సైబర్ నేరగాళ్లు అతడి ఖాతా నుంచి డబ్బు కాజేశారు. డబ్బు బదిలీ అయినట్లు మెసేజ్ రావడంతో సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. బాధితుడి క్రెడిట్ కార్డు ద్వారా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మింత్రా యాప్‌లలో షాపింగ్ చేసినట్లు పోలీసులు గుర్తించి లావాదేవీల్లో కొన్ని ప్రాసెస్ ఉన్నట్లు గురించారు. సైబర్ నేరగాళ్లు కాజేసిన రూ.95,239లను బాధితుడి ఖాతాలో జమ అయ్యేందుకు చర్యలు తీసుకున్నారు. మరో కేసులో.. అశోక్‌నగర్‌కు చెందిన ఐటీ ఉద్యోగి తన ఫోన్‌కు వచ్చిన ఆర్‌టీఓ చలాన్ ఏపీకే లింక్‌ను ఓపెన్ చేయగానే అతడి ఖాతా నుంచి రూ.23,532 సైబర్ నేరగాళ్లు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం అధికారులు డబ్బు తిరిగి బాధితుడి ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకున్నారు.


వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

పిండం అభివృద్ధి దశలోనే క్యాన్సర్ కణితుల రూపాంతరం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు జీవనశైలి కూడా పిల్లల క్యాన్సర్‌కు కారణమవుతుందని వైద్యులు అంటున్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్‌లో కామినేని ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్య నిపుణులు మాట్లాడారు. ప్రతీ ఏడాది సెప్టెంబరు నెలను పిల్లల క్యాన్సర్ అవగాహన మాసంగా నిర్వహిస్తారని తెలిపారు. పిల్లలు పుట్టకముందే పిండం అభివృద్ధి చెందే దశలో ఉండగానే కొన్ని రకాల కణాలు క్యాన్సర్ కణితులుగా రూపాంతరం చెందుతాయని, అవి వేగంగా పెరిగితే చిన్న వయస్సులో క్యాన్సర్ బయటపడుతుందని డాక్టర్ కంచన్ ఎస్. చన్నావర్ చెప్పారు. జన్యుపరమైన పరీక్షలు చేస్తే కొన్ని రకాల క్యాన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చన్నారు జెనెటిక్స్ మాలిక్యులర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ అనీ క్యూ హసన్ అన్నారు. దేశంలో పిల్లలకు వస్తున్న మొత్తం క్యాన్సర్ కేసుల్లో 5శాతం తెలుగు రాష్ట్రాల్లోనే ఉంటున్నాయని, పిల్లల క్యాన్సర్ కేసుల్లో 5నుంచి 10 శాతం జన్యుపరమైన కారణాలని, ప్రాథమిక దశలోనే గుర్తిస్తే నివారించవచ్చన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కార్పొరేషన్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కార్పొరేషన్ కీలక నిర్ణయాలు తీసుకుంది. దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య అధ్యక్షతన శుక్రవారం బోర్డు సమావేశం జరిగింది. నిరుద్యోగ దివ్యాంగులను ఉద్యోగులుగా మార్చడం, పారా క్రీడాకారులను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు తీర్మానాలను ఆమోదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధం అవడానికి దివ్యాంగులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో ఏడాది పొడవునా ఉచితంగా కోచింగ్ అందించాలని నిర్ణయించారు. పారా స్పోర్ట్స్‌లో ప్రతిభ ఉన్న దివ్యాంగులను ప్రోత్సహించడానికి జిల్లా స్థాయిలో క్రీడా వారోత్సవాలు నిర్వహించి రాష్ట్ర స్థాయిలో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలని, క్రీడా సామగ్రి అందించడానికి రూ.50లక్షల నిధులు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నారు. దృష్టిలోపం ఉన్న నిరుద్యోగ దివ్యాంగుల కోసం అఫ్జల్‌గంజ్‌లో ఉన్న స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో డిజిటల్ యాక్సెసబుల్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని, దీనికి రూ.10లక్షలు కేటాయించాలని తీర్మానంలో పేర్కొన్నారు.

పోకిరీలు వేధిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయండి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోకిరీలు వేధిస్తే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టి. ఉషారాణి మహిళలు, బాలికలకు సూచించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 15 రోజుల్లో మహిళలను వేధిస్తున్న 214 మందిని షీటీమ్స్ పట్టుకున్నాయి. ఐదుగురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, మిగతా వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు.

23న సికింద్రాబాద్ నుంచి జ్యోతిర్లింగ దక్షిణ్ భారత్ గౌరవ్ టూరిస్టు రైలు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాల యాత్రికుల కోసం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఈనెల 23న జ్యోతిర్లింగ సహిత దివ్య దక్షిణ్ యాత్ర భారత్‌గౌరవ్ ప్రత్యేక టూరిస్టు రైలు బయలుదేరుతోంది. ప్యాకేజీలో టూర్ ధర (ఒక్కొక్కరికి)ఎకానమీ రూ.14,100, 3 ఏసీ రూ.22,500లు, కంఫర్ట్ సెకండ్ ఏసీ రూ.29,500లుగా నిర్ణయించినట్లు ఐఆర్‌టీసీ అధికారులు తెలిపారు. వివరాలు, బుకింక్ కోసం :9701360701, 9281030726, 9281030740, 9281495845 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

వేర్వేరు ప్రాంతాల నుంచి 52 ప్రత్యేక రైళ్లు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు వేర్వేరు ప్రాంతాల నుంచి 52 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేశామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 5 నుంచి 27 వరకు తిరుపతి-అనకాపల్లె-తిరుపతి మధ్య 8 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈనెల 17 నుంచి నవంబరు 26 వరకు (బుధ) సంబల్‌పూర్- ఇరోడ్ (08311) మధ్య 11 రైళ్లు, ఈనెల 19నుంచి నవంబరు 28 వరకు (శుక్ర)ఇరోడ్- సంబల్‌పూర్ (08312) మధ్య 11 రైళ్లు, ఈనెల 15 నుంచి నవంబరు 24 వరకు (సోమ) విశాఖపట్నం- తిరుపతి(08583) మధ్య 11 రైళ్లు, ఈనెల 16నుంచి నవంబరు 25 వరకు (మంగళ) తిరుపతి-విశాఖపట్నం (08584) మధ్య 11 ప్రత్యేకరైళ్లు నడుస్తాయని వివరించారు.

'మా బృందానికి ఇబ్బందులు లేవు'

నేరేడ్‌మెట్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మానస సరోవరం యాత్రకు వెళ్లిన మా బృందానికి ఎలాంటి ఇబ్బందులు లేవనీ వినాయకనగర్ డివిజన్‌కు చెందిన బహ్మం చెప్పారు. శుక్రవారం ఉదయం మానస సరోవరం దర్శించుకున్న తమ బృందం ఖాట్మండ్‌లోని పశుపతి నాథ్ దేవాలయాన్ని దర్శించుకోవడానికి వెళ్లిందని, పరిస్థితులు అనుకూలిస్తే ఆదివారం దైవ దర్శనం చేసుకుంటామని తెలిపారు.

హైబ్రిడ్ వరి పరిశోధనలో కొత్త దృక్పథం

ఐఐఆర్‌ఆర్‌ను సందర్శించిన కాలిఫోర్నియా ప్రతినిధులు


రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధన సంస్థను సందర్శించిన కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం ప్రతినిధులు

రాజేంద్రనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం యూసీ డేవీస్‌కు చెందిన ప్రొఫెసర్ వెంకటేశన్ సుందరేశన్ ఆధ్వర్యంలో నిపుణుల బృందం జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్‌ఆర్)ను శుక్రవారం సందర్శించింది. ఐఐఆర్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ రామన్ మీనాక్షి సుందరంతో చర్చించారు. ఈ సందర్భంగా వెబ్‌నార్ నిర్వహించారు. ప్రొఫెసర్ వెంకటేశన్ సుందరేశన్ మాట్లాడుతూ హైబ్రిడ్ వరిలో సింథటిక్ అపోమిక్సిస్‌ను సాధించడానికి మిమే విధానంలో పేయిర్ 1, రెక్ 8, ఓఎస్‌డీ 1 జన్యుకణాలలో మ్యూటేషన్లు ప్రేరేపించడం, గుడ్డు కణంలో బీబీఎం1 జన్యువును పరీక్షించడం జరుగుతుందన్నారు. ప్రయోగశాలలో చేసిన పరిశోధనలలో అలైంగిక పద్ధతి ద్వారా హైబ్రిడ్ మొక్కలు 84శాతం వరకు క్లోనల్ విత్తనాలను ఉత్పత్తి చేస్తాయన్నారు. రైతులు హైబ్రిడ్ విత్తనాన్ని తదుపరి పంటకు వాడవచ్చన్నారు. కొత్త విత్తనాన్ని కొనాల్సిన అవసరం ఉండదన్నారు. వెబ్‌నార్‌లో 85 మంది శాస్త్రవేత్తలు, విద్యార్థులు ప్రత్యక్షంగా, 100 మంది వర్చువల్‌గా పాల్గొన్నారు.

భోజన కుతూహలం

కలుపు మొక్కే కదా అని వదిలేయవద్దు!

కలుపు మొక్కలను పొలాల నుంచి పీకి పారేస్తూ ఉంటాం. కానీ మనం కలుపు మొక్కలుగా భావించే వాటిలో కొన్నింటికి అపూర్వమైన ఔషధ గుణాలు ఉంటాయి. అలాంటి వాటిలో పిత్తపాపడ మొక్క ఒకటి. వరి, గోధుమ చేలలో పెరిగే ఈ మొక్క గురించి కొందరు రైతులకు తెలుసు. అందుకే వారు చిన్న చిన్న ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఈ మొక్కను వాడతారు. ఈ మొక్క ఆకులు చిరు చేదుగా ఉంటాయి. భోజన కుతూహలంలోని 12వ అధ్యాయంలో ఈ ఆకుల గురించి వర్ణనతో పాటుగా వీటిని ఏ విధంగా వాడాలనే విషయం కూడా ఉంది. ఇక ఈ ఆకులకు ఉన్న ఔషధ గుణాలేమిటో తెలుసుకుందాం.



- ఈ మొక్క పిత్త, కఫ దోషాలను నివారిస్తుంది. వేడి, పైత్యం వల్ల వచ్చే జ్వరాలను నివారిస్తుంది.
- ఈ మొక్క ఆకులను ఎండబెట్టి వాటితో టీ కాచుకొని తాగితే వెంటనే చెమటలు పట్టి జ్వరం తగ్గుతుంది.
- కొందరికి ప్రతి రోజూ రాత్రి అరికాళ్లలో మంటలు వస్తూ ఉంటాయి. వారికి ఈ మొక్క ఆకులు మంచి ఔషధంలా పనిచేస్తాయి.
- ఈ మొక్క ఆకులు అజీర్తిని తగ్గిస్తాయి. గ్యాస్ బాధకు ఇవి మంచి విరుగుడు.
- ఈ ఆకులు చర్మవ్యాధులను తగ్గిస్తాయి. అలర్జీల వల్ల చర్మంపై కలిగే దురదను నివారిస్తాయి. ఈ ఆకుల రసాన్ని రాస్తే చర్మం మృదువుగా మారుతుంది.
- ఈ ఆకులతో షడంగ పానీయం తయారుచేస్తారు. మంచి నీటిని తీసుకొని దానిలో పిత్తపాపడ ఆకులను వేసి బాగా మరిగించాలి. మామూలు నీళ్ల బదులుగా వీటిని తాగితే శరీరంలోని రకరకాల దోషాలు తొలగిపోతాయి. రోగనిరోధక శక్తి కూడా బాగా పెరుగుతుంది.
- ఈ ఆకులకు బైల్ అనే పిత్తస్రావాన్ని పెంచే శక్తి ఉంది. పిత్తస్రావం పెరిగితే కామెర్లు తగ్గుతాయి. కాలేయంలో వాపు ఉన్నా తగ్గుతుంది. చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి జ్వరాల వచ్చినప్పుడు కూడా వీటిని తాగుతారు.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు





వెలక్కాయలో పుల్లటి గుజ్జు ఉంటుంది. దానితో రకరకాల వంటకాలు చేస్తూ ఉంటాం. అదే వెలక్కాయ పండితే గుజ్జుకు కొద్దిగా తియ్యదనం వస్తుంది. ఈ గుజ్జులో బెల్లం లేదా చక్కెర కలుపుకొని పిల్లలు ఇష్టంగా తింటూ ఉంటారు. సీజనల్‌గా దొరికే పుల్లటి వెలక్కాయలతో చేసే వెరైటీ రుచులు మీకోసం...

వెలక్కాయతో వెరైటీ రుచులు...

వెలక్కాయ పులిహోర

కావాల్సిన పదార్థాలు

• బియ్యం- ఒక కప్పు, వెలక్కాయ- ఒకటి, నూనె- రెండు చెంచాలు, ఆవాలు- అర చెంచా, జీలకర్ర- అర చెంచా, పచ్చి శనగపప్పు- ఒక చెంచా, మినప్పప్పు- ఒక చెంచా, పల్లీలు- కొన్ని, జీడిపప్పు- కొన్ని, ఎండు మిర్చి- రెండు, ఇంగువ- చిటికెడు, పసుపు- పావు చెంచా, కరివేపాకు- కొద్దిగా, పచ్చిమిర్చి- మూడు, ఉప్పు- అర చెంచా

తయారీ విధానం

• బియ్యాన్ని కడిగి నీళ్లు పోసి పావుగంటసేపు నానబెట్టాలి. తరువాత పొడి పొడిగా ఉండేలా అన్నం వండుకోవాలి.

• వెలక్కాయను పగులగొట్టి లోపలి గుజ్జును పళ్లెంలోకి తీయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అర కప్పు నీళ్లు పోసి మరిగించాలి. అందులో వెలక్కాయ గుజ్జు వేసి బాగా కలిపి నాలుగు నిమిషాలు ఉడికించి దించాలి.

• స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. ఆవాలు, జీలకర్ర, ఇంగువ, పసుపు, ఎండు మిర్చి, పల్లీలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, కరివేపాకు, పచ్చిమిర్చి చీలికలు, జీడిపప్పు వేసి దోరగా వేపాలి. తరవాత ఉడికించిన వెలక్కాయ గుజ్జు, ఉప్పు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ తాలింపు మిశ్రమాన్ని అన్నంలో వేసి బాగా కలపాలి. అంతే... కమ్మని వెలక్కాయ పులిహోర రెడీ..!

కాల్చిన వెలక్కాయతో పచ్చడి

కావాల్సిన పదార్థాలు

• వెలక్కాయలు- రెండు, పచ్చిమిర్చి- పది, జీలకర్ర- ఒక చెంచా, ఉప్పు- తగినంత, బెల్లం- చిన్న ముక్క, కొత్తిమీర- కొద్దిగా



తయారీ విధానం

• వెలక్కాయలను కొద్దిగా పగులగొట్టాలి. వాటి మీద చిన్న బీటలు వస్తే చాలు. స్టవ్ వెలిగించి, గ్రిల్ పెట్టి దాని మీద వెలక్కాయలను ఉంచి, అన్ని వైపులకూ తిప్పుతూ నల్లగా కాల్చాలి. ఆపైన స్టవ్ మీద నుంచి తీసి చల్లార్చాలి. వాటి లోపల ఉండే గుజ్జును చెంచా సహాయంతో ఒక పళ్లెంలోకి తీయాలి. కొత్తిమీరను కాడలు తుంచి నీళ్లతో శుభ్రంగా కడగాలి. మిక్సీలో జీలకర్ర, కొత్తిమీర, పచ్చిమిర్చి ముక్కలు, బెల్లం, ఉప్పు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. వెలక్కాయ గుజ్జును కూడా వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. తరువాత గిన్నెలోకి తీసి ఉప్పు సరిచూడాలి. ఇలా తయారుచేసుకున్న పచ్చడిని వేడి అన్నంలో కలుపుకొని తింటే రుచిగా ఉంటుంది.

వెలక్కాయలో ఉండే సి విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. గుండె జబ్బులను నివారిస్తాయి. వాంతులు, విరేచనాలు, జ్వరం, మలబద్ధకం, అల్సర్ లాంటి సమస్యలకు వెలక్కాయ ఔషధంలా పనిచేస్తుంది.

వెలక్కాయతో చేసిన వంటకాలు తినడం వల్ల పొట్టలో పేరుకున్న గ్యాస్ తొలగిపోతుంది. అలసట, నీరసం, మూత్రపిండాల సమస్యలు మాయమవుతాయి. కాలేయం పూర్తిగా శుభ్రపడుతుంది. జీర్ణక్రియ వేగవంతమవుతుంది. మధుమేహం నియంత్రణలో ఉంటుంది.

వెలక్కాయ క్యాండీ

కావాల్సిన పదార్థాలు

• పండిన వెలక్కాయ- ఒకటి, బెల్లం- ఒక కప్పు, నిమ్మరసం- రెండు చెంచాలు, నల్ల ఉప్పు- అర చెంచా, కారం- అర చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, పంచదార పొడి- అర కప్పు, నెయ్యి- పావు చెంచా

తయారీ విధానం

• పండిన వెలక్కాయ నుంచి గుజ్జు తీయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు గ్లాసుల నీళ్లు పోసి మరిగించాలి. అందులో వెలక్కాయ గుజ్జు వేసి బాగా కలుపుతూ అయిదు నిమిషాలు ఉడికించి దించాలి. ఈ గుజ్జును స్ట్రయినర్‌లో వేసి చిక్కని రసాన్ని వడబోయాలి. ఈ రసాన్ని బ్లెండర్‌తో బాగా కలపాలి. లేదంటే మిక్సీలో వేసి రెండు నిమిషాలు గ్రైండ్ చేసినా సరిపోతుంది.

• స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అందులో వెలక్కాయ రసం, బెల్లం వేసి బాగా కలపాలి. బెల్లం పూర్తిగా కరిగాక అందులో నిమ్మరసం, నల్ల ఉప్పు, కారం, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమం... గిన్నెకు అంటుకోకుండా దగ్గరకు వచ్చే దాకా ఉడికించాలి. తరువాత నెయ్యి రాసిన పళ్లెంలోకి తీసి సమంగా పరచాలి. చల్లారిన తరవాత ముక్కలుగా కోయాలి. ఈ ముక్కల మీద చక్కెర పొడి చల్లి బాగా కలపాలి. పుల్లగా, తియ్యగా ఉండే ఈ క్యాండీలు ఆర్నెల్లపాటు నిల్వ ఉంటాయి.



సెలబ్ టాక్

పుట్టింది... పంజాబీ కుటుంబంలో. పెరిగింది ముంబయిలో. తెరంగేట్రం తెలుగులో. ఆరంభంలో తడబడినా... 'గదార్2'తో బాలీవుడ్‌లో మెగా హిట్ కొట్టారు సిమ్రత్ కౌర్ రంధ్వా. ప్రస్తుతం వివేక్ అగ్నిహోత్రి 'ది బెంగాల్ ఫైల్స్'లో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆమె జర్నీలో ఆసక్తికర అంశాలు కొన్ని.

ఆ పాత్ర పేరుతో పిలుస్తున్నారు



సిమ్రత్ కౌర్ మొట్టమొదట వెండితెరపై కనిపించింది 'ప్రేమతో మీ కార్తిక్' చిత్రంతో. 2017లో విడుదలైన ఆ సినిమాలో హీరో కార్తికేయకు జతగా నటించారు. ఆ తరువాత 'డర్టీ హరీ, బంగార్రాజు' తదితర చిత్రాలు చేశారు. అయితే రెండేళ్ల కిందట విడుదలైన 'గదార్2'తో బాలీవుడ్‌లో మెగా ఎంట్రీ ఇచ్చారు సిమ్రన్. 'ముస్కాన్'గా నటించి అందరి మనసులు కొల్లగొట్టారు. అందుకే తన కెరీర్ గురించి మాట్లాడాలంటే... 'గదార్2'కు ముందు... తరువాత అంటారు సిమ్రన్. ఆ వెంటనే హిందీలోనే 'వన్‌వాస్' చేశారు. ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి తెరకెక్కిస్తున్న 'ది బెంగాల్ ఫైల్స్'లో భారతి బెనర్జీ పాత్ర పోషిస్తున్నారు. ఈ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. "ఇది యువతరం చూడాల్సిన చిత్రం. ఎందుకంటే వాళ్లకు మన చరిత్ర తెలియాలి. ఇక ఇందులో ప్రముఖ నటులు మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, దర్శన్ కుమార్, పల్లవి జోషి తదితరులు కనిపిస్తారు. ఎవరికివారే అద్భుతంగా నటించారు" అంటున్న సిమ్రత్ చేతిలో ఇప్పుడు మరో భారీ బడ్జెట్ చిత్రం 'గదార్3' కూడా ఉంది.

అనుకోకుండా ఇటు వైపు...

ముంబయి డాన్ బాస్కో ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదివిన సిమ్రత్... నటి అవుతానని ఎప్పుడూ అనుకోలేదట. మరి ఇటువైపు ఎలా వచ్చారని అడిగితే... "నటిని కావాలని నేను ఎప్పుడూ కోరుకోలేదు. అసలు సినిమాల్లో ప్రయత్నాలు కూడా చేయలేదు. ఏదో అలా జరిగిపోయింది అంతే. కానీ ఇక్కడ అవకాశాలు తెచ్చుకోవడమే కాదు, నిలదొక్కుకోవడం కూడా ఎంతో కష్టం. ముఖ్యంగా పరిశ్రమలో మనకంటూ ఎవరూ లేనప్పుడు... ఎటు వెళ్లాలి? ఎలా వెళ్లాలి? అనేవి తెలియవు. అడుగడుగునా ఇబ్బందులు, సవాళ్లు ఎదురవుతాయి. పరిశ్రమకు చెందిన వాళ్లకైనా ఇక్కడ పని దొరకడం అంత సులువు కాదు" అని ఓ సందర్భంలో గతాన్ని గుర్తు చేసుకున్నారు.

వెనక్కి తిరిగి చూసుకోలేదు...

అయితే 'గదార్2' తన జీవితాన్నే మార్చేసింది అంటారు సిమ్రత్. "2023 ఆగస్టు 10 వరకు నేను కేవలం సిమ్రత్‌ను మాత్రమే. ఆగస్టు 11 నుంచి జనం నన్ను 'ముస్కాన్' అంటూ పిలుస్తున్నారు. అంటే నా పాత్ర వారిని అంతగా ఆకట్టుకుందనే కదా. ఆ తరువాత నేను వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో నా మూడో చిత్రం చేస్తున్నా. అది కూడా భారీ బడ్జెట్ ప్రాజెక్ట్"

అంటూ ఆనందంగా చెబుతున్న ఈ భామ... కొన్ని మ్యూజిక్ వీడియోల్లో కూడా సిమ్రత్ నటించారు. యూట్యూబ్‌లో వాటిని లక్షలమంది వీక్షించారు.

అనుభవ పాఠాలు...

బాలీవుడ్‌లో ఎంట్రీతోనే బ్లాక్‌బస్టర్‌ను చూసినా... ఆ తరువాత సిమ్రత్ చేసిన చిత్రాలు తక్కువే. సాధారణంగా అంతపెద్ద హిట్ తరువాత కొత్త ప్రాజెక్టులు వెతుక్కొంటూ వస్తాయి. ఇదే విషయం ఆమెను అడిగితే... ఎన్ని సినిమాలు చేసేమనే దానికన్నా చేసినవాటిలో ఎన్ని పాత్రలు గుర్తున్నాయన్నది ముఖ్యమంటారు. ఎనిమిదేళ్ల కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని, వాటి నుంచి పాఠాలు నేర్చుకున్నాని చెబుతారు. "హృదయరేఖ నేరుగా వెళితే మనం చనిపోయినట్టు. ఆ రేఖ ఎప్పుడూ ఎత్తుపల్లాలుగానే ఉండాలి'... ఈ మాటలే నాకు నిత్య స్ఫూర్తి. కిందకు పడిపోయిన సందర్భాలు నాకు తిరిగి పుంజుకొనే శక్తినిస్తాయి" అంటూ చెప్పుకొచ్చిన సిమ్రత్... ఈ ఎనిమిదేళ్లల్లో ఎనిమిదే సినిమాల్లో కనిపించారు. ఇప్పుడు ఒక చిత్రం విడుదలకు, మరొక మెగా ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కడానికి సిద్ధంగా ఉన్నాయి.



ప్రేరణ

హూలా హూప్ క్వీన్

ఫ్లో ఆర్ట్‌లో భాగమైన హూలా హూప్‌లో రాణిస్తూ, ఆ క్రీడను అటు వృత్తిపరంగా, ఇటు ప్రవృత్తిపరంగా రెండు విధాలా సద్వినియోగం చేసుకుంటోంది బెంగుళూరుకు చెందిన సుప్రియ శ్రీవాత్సవ. మానసిక, శారీరక వికాసానికి ఈ క్రీడ తోడ్పడుతుందంటున్న సుప్రియ ఔత్సాహికుల కోసం శిక్షణ కేంద్రాన్ని కూడా నడుపుతోంది. మరిన్ని వివరాలు ఆమె మాటల్లోనే...



2015లో హూప్స్ పట్ల నాకు ఆసక్తి యాదృచ్ఛికంగా ఏర్పడింది. అందుకు ఒక రష్యా మహిళకు ధన్యవాదాలు చెప్పుకోవాలి. ఆ సమయంలో నేను గోవాలో ఒక హాస్టల్‌లో ఉన్నాను. అక్కడే బస చేస్తున్న ఒక రష్యన్ మహిళ... భారతీయ మహిళలను చులకనగా మాట్లాడడం మొదలుపెట్టింది. దాంతో మన మహిళల సత్తాను నిరూపించడానికి అక్కడే ఉన్న ఒక హూప్‌ను తీసుకుని నడుముకు తగిలించుకుని గుండ్రంగా తిప్పే ప్రయత్నం చేశాను. నిజానికి హూప్‌ను ఉపయోగించడం నాకదే మొదటిసారి. అయినా ఎంతో అనుభవం ఉన్నట్టు హూప్‌ను గిరగిరా తిప్పేసి, అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశాను. హూప్‌తో అనుబంధం నాకు ఆ సమయంలోనే ఏర్పడింది. అయితే అప్పటికే అమెజాన్‌లో పనిచేస్తున్నాను. ఎక్కువ గంటలు పని చేయడం వల్ల హూప్‌తో ఆడడానికి ఎక్కువ సమయం దొరికేది కాదు. అయినా వారాంతాల్లో, తీరిక దొరికిన ప్రతిసారీ హూప్‌ను సాధన చేయడం మొదలుపెట్టాను. శ్రావ్యమైన సంగీతం వింటూ, హూప్‌ను నడుముకు తగిలించుకుని గిరగిరా తిప్పుతుంటూ ఉంటే, ఒత్తిడి తొలగి మనసు తేలికవడంతో పాటు శరీర దారుఢ్యం కూడా పెరుగుతున్నట్టు క్రమేపీ గ్రహించాను. అలా ఒక ఏడాదిలోనే హూలా హూప్‌లో పరిణతి సాధించాను.

కుంగుబాటు నుంచి కోలుకుని...

'విద్య పంచుకుంటే పెరుగుతుంది' అని నా కుటుంబం నేర్పింది. అలాంటి కుటుంబం నుంచి వచ్చాను కాబట్టి హూలా హూప్‌తో ఒరిగే ప్రయోజనాలను నలుగురికీ నేర్పించాలనుకున్నాను. అందుకే యూట్యూబ్ ఛానల్ నడపడంతో పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులు మొదలుపెట్టేశాను. అలాగే వేడుకల్లో హూలా హూప్ విన్యాసాలను ప్రదర్శించి అందరికీ అవగాహన కల్పించడం కొనసాగించాను. నిజానికి మానసిక సమస్యలతో కుంగిపోయిన నాకు ఈ కొత్త అభిరుచి కొత్త జీవితాన్ని అందించింది. నా మీద నాకు నమ్మకం ఏర్పడింది. నాలా ఎన్నో రకాల కుంగుబాట్లకు లోనై, నిరాశా నిస్పృహలతో జీవితాలను వెళ్లదీస్తున్నవాళ్లు ఎంతోమంది ఉంటారు. నా జీవితంలో ఊహించని సంఘటనలు జరిగాయి. 21 ఏళ్ల వయసులో లైంగిక వేధింపులకు గురయ్యాను. ఆ ప్రభావం నన్ను ఆరు నెలల పాటు కుంగదీసింది. అయినా కోలుకొని ఆ తర్వాత మింత్రలో, అమెజాన్‌లో వృత్తి జీవితాన్ని కొనసాగించాను. ఏడేళ్ల పాటు పర్పుల్ ఫిల్టర్ అనే ఫ్రీలాన్స్ ఏజెన్సీని కూడా నడిపాను. ఓ పక్క హూలా హూప్ సాధన చేస్తూనే, వృత్తి జీవితాన్ని కొనసాగించాను. చివరకు 2023 డిసెంబరు నుంచి, ఫ్లో ఆర్ట్‌నే పూర్తి స్థాయి వృత్తి జీవితంగా మార్చుకున్నాను.



వృత్తిగా మలుచుకోవచ్చు

హూప్స్ అనగానే అందరికీ సర్కస్ కళాకారులు గుర్తొస్తారు. దాంతో ఈ కళను చులకనగా చూస్తూ ఉంటారు. కానీ నిజానికి శరీరాకృతి, బరువుకు తగిన హూప్‌ను ఎంచుకుంటే సులభమైన విన్యాసాలు సాధ్యపడతాయి. ఫ్లో ఆర్ట్‌ను వృత్తిగా మలుచుకునేవాళ్లు శరీర భంగిమ, ఆకృతి, బరువుల మీద దృష్టి పెట్టాలి. శరీరం స్పందించే తీరుకు తగ్గట్టు విన్యాసాలను రూపొందించుకోవాలి. హూప్‌ను ఒక గమ్యంగా కాకుండా ఒక ప్రయాణంగా భావించి, తగిన మెలకువలను అనుసరిస్తూ, సృజనాత్మకతను ప్రదర్శించగలిగితే ఈ కళలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు.

మేకప్

చిట్కాలతో చమక్కు

మేకప్‌తో అన్ని లోపాలనూ సరిదిద్దడం సాధ్యపడకపోవచ్చు. కానీ వేసుకునే మేకప్‌లో కొన్ని మెలకువలు పాటించగలిగితే, రెట్టింపు ఫలితాన్ని పొందవచ్చు. అదెలాగంటే...

• **కనురెప్పలు దట్టంగా:**
పలుచని కనురెప్పలు దట్టంగా కనిపించడం కోసం మస్కారా వేసుకుంటాం. అయితే మస్కారాతో వేసుకున్నంత మాత్రాన దట్టంగా కనిపించే పరిస్థితి ఉండదు.
ఇలాంటప్పుడు కొద్దిపాటి వెంట్రుకలతో మరింత దట్టంగా కనురెప్పలు కనిపించాలని అనుకుంటే ఒక చిట్కా పాటించాలి. మస్కారా కంటే ముందు కనురెప్పలకు ఐషాడో బ్రష్‌తో ఫేస్ పౌడర్‌ను పట్టించాలి. దీంతో కనురెప్పలకు ల్యాష్ ఫైబర్ మస్కారా ఎఫెక్ట్ కలుగుతుంది.
ఈ తర్వాత మస్కారా అప్లై చేస్తే, కనురెప్పలు దట్టంగా కనిపిస్తాయి.

• **లిప్‌స్టిక్ చెదరకుండా:**
కొందరికి నాలుకతో పెదవులు తడుపుకొనే అలవాటు ఉంటుంది. ఇంకొందరికి పెదవులు కొరుక్కొనే అలవాటు ఉంటుంది. దాంతో లిప్‌స్టిక్ చెదిరిపోతుంది కాబట్టి ఎక్కువ సమయం పాటు లిప్‌స్టిక్ చెదిరిపోకుండా ఉండడం కోసం ఒక చిట్కాను ఉపయోగించాలి. అందుకోసం మొదట లిప్ లైనర్‌తో పెదవుల చుట్టూ ఔట్‌లైన్ గీసుకోవాలి. తర్వాత లిక్విడ్ లిప్‌స్టిక్‌తో పెదవులను నింపేయాలి. దీనిపైన అదే షేడ్ క్రీమీ లిప్‌స్టిక్ అప్లై చేయాలి. తర్వాత, బ్రష్‌తో లూజ్ పౌడర్ తీసుకుని, పెదవులపైన టిష్యూ పేపర్‌ను ఉంచి, ఆ పౌడర్‌ను అద్దాలి. దీంతో లిప్‌స్టిక్ మ్యాటిఫై అయిపోయి, పెదవులకు హత్తుకుపోతుంది. ఈ చిట్కాతో లిప్‌స్టిక్ రోజంతా చెదిరిపోకుండా ఉంటుంది.



• **ముఖం మెరిసేలా:**
ఇందుకోసం ప్రత్యేకించి స్ట్రోబింగ్ క్రీమ్ దొరుకుతుంది. ఇది లేని వాళ్లు ఒక చిన్న కిటుకుతో అదే ఫలితాన్ని రాబట్టవచ్చు. అందుకోసం ఒక చిన్న గిన్నెలో లిప్ బామ్ తీసుకుని, రోజ్‌గోల్డ్ షిమ్మరీ ఐషాడో జోడించి బాగా కలపాలి. దీన్ని బేస్ మేకప్ అడుగున అప్లై చేసుకుని, ఆ తర్వాత మేకప్ మొదలుపెట్టాలి. ఇలా చేస్తే, ఈ మిశ్రమం స్ట్రోబింగ్ క్రీమ్‌లా చర్మానికి మెరుపునిస్తుంది.

15వ ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

వల్లే ఈ నెల 9న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నిక జరగడం, రాధాకృష్ణన్ 'ఇండీ' కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించడం తెలిసిందే. ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేసిన రాధాకృష్ణన్ ఇక రాజ్యసభ చైర్మన్‌గానూ వ్యవహరించనున్నారు. 2030 సెప్టెంబరు 11 వరకు ఆయన పదవిలో కొనసాగుతారు. ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ మాత్రమే కనిపించారు. ఖర్గేతో రాధాకృష్ణన్ కరచాలనం చేశారు. మిగతా ప్రతిపక్షాల నేతలెవరూ రాలేదు. 2022లో ఉపరాష్ట్రపతిగా ధన్‌ఖడ్ ప్రమాణ స్వీకారానికి కూడా విపక్ష నేతలెవరూ హాజరుకాకపోవడం గమనార్హం. కాగా.. ప్రమాణస్వీకారం అనంతరం రాధాకృష్ణన్ రాజ్‌ఘాట్‌ను సందర్శించారు. మహాత్మాగాంధీకి నివాళులర్పించారు. సదైవ్ అటల్ (స్మారక చిహ్నం) వద్ద మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయికి, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లోని పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ స్మారక చిహ్నం వద్ద, కిసాన్ ఘాట్ వద్ద మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్‌కు నివాళులు అర్పించారు. ఆ తర్వాత రాజ్యసభ చైర్మన్ చాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సహాయ మంత్రులు అర్జున్‌రామ్ మేఘ్వాల్, ఎల్.మురుగన్ స్వాగతం పలికారు. అనంతరం పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణాస్థల్ వద్ద దేశ ప్రసిద్ధ నేతలు, స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కర్తల విగ్రహాలకు ఆయన నివాళులు అర్పించారు.



ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతులు ధన్‌ఖడ్, వెంకయ్య, హమీద్ అన్సారీలతో రాధాకృష్ణన్

మోదీ అభినందనలు

కొత్త ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ తన పదవీకాలాన్ని విజయవంతంగా నిర్వహించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. ప్రజాజీవితం, ప్రజాస్వామ్య విలువలకు ఆయన జీవితాంతం కట్టుబడుతూ వచ్చారని 'ఎక్స్'లో పేర్కొన్నారు. దేశ నిర్మాణం, సామాజిక సేవ, ప్రజాస్వామ్య విలువల బలోపేతానికి తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు.

సీపీ జీవన విశేషాలు..

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)తో సుదీర్ఘ అనుబంధం ఉన్న సీపీ రాధాకృష్ణన్ (68) తమిళనాడులోని తిరుప్పూర్‌లో 1957 మే 4న జన్మించారు. తూత్తుకుడిలోని వీవో చిదంబరం కాలేజీలో బీబీఏ చదివారు. 16ఏళ్ల వయసు నుంచే ఆర్‌ఎస్‌ఎస్, జన్‌సంఘ్‌తో అనుబంధం పెంచుకున్నారు. కోయంబత్తూరు నుంచి 1998, 99ల్లో రెండు సార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. అన్నాడీఎంకే, డీఎంకేలతో బీజేపీ పొత్తు పెట్టుకోవడంలో కీలకపాత్ర పోషించారు. నాటి ప్రధాని వాజపేయికి సన్నిహితుడు. ఏకాభిప్రాయ సాధకుడిగా పేరు సంపాదించారు. తమిళనాడు రాజకీయాల్లో 'మిస్టర్ క్లీన్' కూడా. 2003 నుంచి 2006 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి కృషిచేశారు. 2023 ఫిబ్రవరిలో ఝార్ఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. తర్వాత తెలంగాణ.. నిన్నటి వరకు మహారాష్ట్ర గవర్నర్‌గానూ పనిచేశారు.

మలేసియా వెళ్లడానికి రాహుల్‌కు టైముందా?

ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారానికి లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ గైర్హాజరుపై బీజేపీ మండిపడింది. మలేసియా వెళ్లడానికి ఆయనకు టైముంటుందని ఆ పార్టీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఎద్దేవాచేశారు.

త్వరలో భారత్‌కు ట్రంప్!

(మొదటిపేజీ తరువాయి)

పాటు క్వాడ్ బలోపేతానికి ట్రంప్ కట్టుబడి ఉన్నారని వెల్లడించారు. ఆయన పర్యటనకు సంబంధించి ఇప్పటికే చర్చలు కూడా జరిగాయని పేర్కొన్నారు. ఈ ఏడాది చివర్లో క్వాడ్ దేశాధినేతల సదస్సును భారత్ నిర్వహించనుంది. దీనికి సంబంధించిన తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఫిబ్రవరిలో అమెరికా పర్యటన సందర్భంగా ఈ సమావేశానికి హాజరు కావాలని ట్రంప్‌ను ప్రధాని మోదీ ఆహ్వానించారు. కాగా, భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకోవడమే తమకు అత్యంత ప్రాధాన్యమని గోర్ స్పష్టం చేశారు. భారత్‌ను అమెరికాకు చేరువ చేయడంతో పాటు చైనాకు దూరం చేయడమే లక్ష్యమని చెప్పారు. ప్రస్తుతం అమెరికా, భారత్ మధ్య నెలకొన్న తాత్కాలిక అడ్డంకులు త్వరలోనే తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. భారత ప్రభుత్వం, ప్రజలతో తమ దేశానికి దశాబ్దాల నుంచి సత్సంబంధాలు ఉన్నాయని, చైనీయులతో కంటే కూడా అమెరికన్లతోనే వారికి సాన్నిహిత్యం ఎక్కువని గోర్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ చంచల మనస్కుడు: థరూర్

సింగపూర్, సెప్టెంబరు 12: సామాన్యప్రజానీకం ఎప్పుడూ వినని.. ఆంగ్లేయులకు సైతం అర్థం కాని అరుదైన ఆంగ్ల పదాలతో మాటల గారడీ చేసే కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ తాజాగా ట్రంప్ తీరుపై తనదైనశైలిలో వ్యాఖ్యలు చేశారు. ట్రంప్‌ని 'మెర్క్యూరియల్ ఇండివిడ్యువల్'.. అనగా ఏ క్షణంలో ఎలా ప్రవర్తిస్తాడో తెలియని చంచల మనస్కుడైన వ్యక్తిగా అభివర్ణించారు. అమెరికాలో వ్యవస్థలు దేశాధ్యక్షుడికి చిత్తం వచ్చినట్టుగా వ్యవహరించే అవకాశాన్ని కల్పిస్తున్నాయని విమర్శించారు. ట్రంప్ సుంకాలు భారత్‌ను దెబ్బతీస్తున్నాయని.. ఇప్పటికే సూరత్‌లో రత్నాభరణాల రంగంలో 1.35 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని.. సీఫుడ్, ఉత్పత్తి రంగాల్లోనూ గణనీయంగా ఉద్యోగాలు పోతున్నాయని.. ఆందోళన వ్యక్తం చేశారు.

భారత సైనికుల్ని కరిగించటానికి చైనా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఆయుధం!

వాషింగ్టన్, సెప్టెంబరు12: ఐదేళ్ల కిందటి గల్వాన్ ఘర్షణ సందర్భంగా భారత సైనికుల మీద చైనా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఆయుధాన్ని ప్రయోగించిందని అమెరికా సెనేటర్ బిల్ హ్యాగెర్టీ తెలిపారు. 'ఐదేళ్ల కిందట ఓ సరిహద్దు గొడవపై ఇరుదేశాలు ఘర్షణకు దిగాయి. ఈ సందర్భంలో భారత్ సైనికుల్ని కరిగించడానికి చైనా ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ ఆయుధాన్ని ఉపయోగించింది' అని ఆరోపించారు. అయితే, ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంతన్నది నిర్ధారణకాలేదు. గల్వాన్ ఘర్షణ సమయంలోనూ ఈ తరహా ఆయుధం గురించి ఎలాంటి వార్తలు వెలువడలేదు. చైనాకు ఇండియా దగ్గరవుతున్న వేళ హ్యాగెర్టీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఆసక్తికరంగా 'నేనెవరు?'



రాజేంద్రప్రసాద్ ముఖ్య పాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'నేనెవరు?'. చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో అండేకర్ జగదీశ్‌బాబు నిర్మించారు. దసరా సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే చిత్ర బృందం ఆడియో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'నా సినీ జీవితంలో 'నేనెవరు' ఓ మంచి చిత్రంగా నిలిచిపోతుంది. సామాజిక బాధ్యతతో దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కథ మీద నమ్మకంతో జగదీశ్‌బాబు ఈ సినిమాను నిర్మించేందుకు ముందుకొచ్చారు' అని చెప్పారు. 'ప్రతి ఒక్కరి జీవితానికి అన్వయించుకునే కథ ఇది. దర్శకుడు వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు' అని నిర్మాత తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, దర్శకుడు వి. సముద్ర తదితరులు పాల్గొన్నారు.

ముక్కోణ ప్రేమ కథ



సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నీరజా కోన తెరకెక్కిస్తోన్న చిత్రం 'తెలుసు కదా'. శ్రీనిధి శెట్టి, రాశీ ఖన్నా కథానాయికలు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. అక్టోబరు 17న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ముక్కోణ ప్రేమ కథ అని టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది. ఇందులో సిద్ధు చాలా స్టైలిష్‌గా కనిపించారు. హీరో, ఇద్దరు హీరోయిన్లతో చిత్రీకరించిన సన్నివేశాలు ఆసక్తిగా ఉన్నాయి. వైవా హర్ష తన నటనతో ఆకట్టుకున్నారు.


అలరించే అందెల రవమిది



సంప్రదాయ సంగీతం ఇతివృత్తంగా రూపుదిద్దుకున్న చిత్రం 'అందెల రవమిది'. ఇంద్రాణి దావలూరి ప్రధాన పాత్ర పోషిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. తనికెళ్ల భరణి కీలకపాత్ర పోషించారు. ఈనెల 19న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఇంద్రాణి మాట్లాడుతూ "స్వర్ణకమలం' చిత్రం స్ఫూర్తితో 'అందెల రవమిది' తెరకెక్కించాను' అని చెప్పారు. 'టైటిల్‌కు తగ్గట్లే ఇంద్రాణి తన సినిమాను ఒక కళాఖండంలా తీర్చిదిద్దారు' అని నిర్మాత కేఎస్ రామారావు అభినందించారు.

అత్యుత్తమ కళాకారుడు బ్రహ్మానందం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



హాస్య నటుడు బ్రహ్మానందం దేశ సినీ చరిత్రలోనే అత్యుత్తమ కళాకారుడని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కొనియాడారు. 30 ఏళ్లకు పైగా సుదీర్ఘమైన తన నటజీవితంలో 1200కు పైగా చిత్రాలలో నటించి కోట్లాది మంది ప్రేక్షకుల మనసులలో చిరస్థానం సంపాదించుకున్నారని అన్నారు. శుక్రవారం, ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ ఆఫ్ సౌత్ ఏషియాలో 'మీ బ్రహ్మానందం', 'మే అప్‌కా బ్రహ్మానందం' పేరుతో తెలుగు, హిందీ భాషల్లో రూపొందించిన జీవితచరిత్ర పుస్తకాలను ముఖ్యఅతిథి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. తెలుగు, కన్నడ, మలయాళం, తమిళం, హిందీ, ఇంగ్లీష్‌లో బ్రహ్మానందం రాసిన పుస్తకం విడుదల కావడం చాలా గొప్ప విషయమని అన్నారు. బ్రహ్మానందం మాట్లాడుతూ.. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి అంచలంచెలుగా ఎదిగి దేశ ఉపరాష్ట్రపతిగా పనిచేసిన వెంకయ్యనాయుడు తన పుస్తకావిష్కరణకు రావడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు.

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

ఈ సినిమా విజయం నాకో తీపి జ్ఞాపకం

- బన్నీ వాసు



'మంచి కంటెంట్ ఉన్న సినిమాను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకంతో 'లిటిల్ హార్ట్స్' చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేశాం. మా అంచనా నిజమైంది. ప్రేక్షకుల నుంచి ఈ చిత్రానికి అపూర్వ స్పందన దక్కుతోంది. నా టీవీ వర్క్స్ బేనర్ మీద విడుదల చేసిన తొలి చిత్రమే ఇంత గొప్ప విజయం అందుకోవడం నాకో తీపి జ్ఞాపకం' అని నిర్మాత బన్నీ వాసు అన్నారు. మౌళీ తనుజ్, శివాని నాగరం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించిన చిత్రమిది. నిర్మాత వంశీ నందిపాటితో కలసి బన్నీ వాసు విడుదల చేశారు. ఇటీవలే విడుదలై చక్కని ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. వంశీ నందిపాటి మాట్లాడుతూ "లిటిల్ హార్ట్స్' విజయం ఎంతో సంతృప్తినిస్తోంది. దర్శకుడిగా సాయి మార్తాండ్‌కే ఈ ఘనత దక్కుతుంది. మౌళి, శివాని నటన ప్రేక్షకులను అలరిస్తోంది. బన్నీ వాసుతో కలసి ఈ సినిమాను పంపిణీ చేసినందుకు సంతోషంగా ఉంది' అన్నారు.

సంజయ్ మొదటి భార్య పరిస్థితి ఏమిటి?



అపర కుబేరుడు సంజయ్ కపూర్ ఈ ఏడాది జూన్ 12న హఠాత్తుగా గుండెపోటుతో మరణించి అందరినీ విషాదానికి గురి చేశారు. సంజయ్ మరణించి రెండు నెలలు అయిందో లేదో ఆయన మాజీ భార్య కరిష్మా కపూర్, ప్రస్తుత భార్య ప్రియా సచ్‌దేవ్ మధ్య కీచులాటలు మొదలయ్యాయి. దానికి కారణం సంజయ్ కపూర్‌కు రూ. 30 వేల కోట్ల ఆస్తి ఉండడమే. ఆ ఆస్తి మాదేనంటూ మాజీ భార్య, ఇప్పటి భార్య ఇద్దరూ ఘర్షణకు దిగితే, కరిష్మా ఇద్దరు పిల్లలు ఏకంగా కోర్టు గుమ్మం ఎక్కేసి ఆస్తిలో వాటా ఇవ్వకుండా తమ పినతల్లి మోసం చేస్తోందంటూ కేసు పెట్టారు. ప్రియ వెనక్కి తగ్గకుండా ఇప్పటికే ఈ పిల్లలకు కపూర్ కుటుంబం నుంచి రూ. 1900 కోట్లు వచ్చాయనీ, ఇంకా ఎంత డబ్బు కావాలంటూ అసహనంతో తను కూడా కోర్టులో వాదించారు. ఇలా సంజయ్ ఇద్దరు భార్యలూ కోర్టులో వాదులాడుకుంటుంటే , తాజాగా నందితా మత్వానీ వెలుగులోకి వచ్చారు. ఈవిడ ఎవరనుకుంటున్నారు.. సంజయ్ కపూర్ మొదటి భార్య.. ఫ్యాషన్ డిజైనర్ అయిన నందితను 1996లో సంజయ్ పెళ్లి చేసుకున్నారు. నాలుగేళ్ల కాపురం చేసిన తర్వాత వీరిద్దరూ విడిపోయారు. ఆ తర్వాత నందిత చాలా కాలం వార్తల్లో నిలిచారు. హీరో రణబీర్ కపూర్‌తో, డినో మోరియాతో ప్రేమ వ్యవహారాలు నడిపి, చివరికి నటుడు విద్యుత్ జమ్వాల్‌తో సెటిల్ అయ్యారు. తన మాజీ భర్త సంజయ్ రూ. 30 వేల కోట్ల ఆస్తిలో వాటాల గురించి ఇంత గొడవ జరుగుతుంటే నందిత ఎందుకు మౌనంగా ఉన్నారు? నాకూ వాటా కావాలంటూ కోర్టుకి ఎందుకు రాలేదు? ఈ ప్రశ్నలకు సింపుల్ సమాధానం సంజయ్, నందితకు పిల్లలు లేకపోవడమే! కరిష్మాకు ఇద్దరు పిల్లలు, ప్రియకు ఓ కొడుకు.. సంజయ్ వల్ల కలిగారు. అందుకే వారసుల మధ్య ఇప్పుడు ఆస్తి కోసం యుద్ధం జరుగుతోంది. సంజయ్ వల్ల తనకు సంతానం కలగక పోవడంతో ఈ వివాదానికి సందిత దూరంగా ఉన్నారు.

అలాంటి వ్యక్తినే పెళ్లి చేసుకుంటా

తమన్నా భాటియా



హీరోయిన్ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. విజయ్ వర్మతో బ్రేకప్ అయ్యాక పూర్తిగా తన కెరీర్‌పైనే దృష్టి సారించారు. పలు సందర్భాల్లో తన ప్రేమ, పెళ్లి గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం దాటవేస్తూ వచ్చారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పెదవి విప్పారు. 'నేను మంచి జీవిత భాగస్వామిగా ఉండాలనుకుంటున్నాను. అతను కూడా అలాంటి వాడే అయి ఉండాలి. 'ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో తమన్నా నాకు భార్యగా దొరికింది' అని అతను ఫీలవ్వాలి. అలాంటి అదృష్టవంతుడిని కచ్చితంగా పెళ్లి చేసుకుంటా. ఆ శుభతరుణం త్వరలోనే వస్తుంది' అని అన్నారు. తమన్నా వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఈమె ఎవరితోనో లవ్‌లో ఉందంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు.


దక్షిణేశ్వర్ సురేష్

తొలిరోజు మనదే

● సింగిల్స్‌లో దక్షిణేశ్వర్, సుమిత్ గెలుపు

● భారత్ 2-0 ● స్విట్జర్లాండ్‌తో డేవిస్ కప్

బీల్ (స్విట్జర్లాండ్): డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్-1లో భాగంగా ఆతిథ్య స్విట్జర్లాండ్‌తో పోరులో తొలిరోజు భారత్‌దే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ రివర్స్ సింగిల్స్ మ్యాచుల్లో భారత ఆటగాళ్లు గెలవడంతో 2-0 ఆధిక్యం లభించింది. అయితే, ప్రధానంగా తొలిసారి డేవిస్ కప్ ఆడుతున్న తమిళనాడుకు చెందిన దక్షిణేశ్వర్ సురేష్ తనకంటే మెరుగైన ర్యాంకరైన ప్రత్యర్థిని ఓడించడం మొదటిరోజు ఆటలో విశేషం. తొలి సింగిల్స్‌లో 626వ ర్యాంకర్ దక్షిణేశ్వర్ 7-6 (5), 6-3తో 155వ ర్యాంకరైన జెరోమ్ కిమ్‌ను చిత్తు చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం జరిగిన రివర్స్ సింగిల్స్‌లో అనుభవజ్ఞుడైన సుమిత్ నగల్ 6-3, 7-6(4)తో మార్క్ అండ్రియా హస్లెర్‌పై గెలిచి భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. ఇక, శనివారం జరిగే డబుల్స్ మ్యాచ్‌లో శ్రీరామ్ బాలాజీ/బొల్లిపల్లి రిత్విక్ చౌదరి జోడీ బరిలోకి దిగనుంది.

స్టార్లతో కళకళ

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

భారత్ ఆశలన్నీ నీరజ్‌పైనే


నీరజ్

స్టార్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం


డుప్లాంటిస్

నేటి భారత షెడ్యూల్

ఉ. 4 గం.: పురుషుల 35 కి.మీ. రేస్ వాక్-రాంబాబు, సందీప్; మహిళల 35 కి.మీ. రేస్‌వాక్-ప్రియాంక గోస్వామి

సా. 4.30: మహిళల 1500 మీ. హీట్-పూజ

టోక్యో: ఒలింపిక్స్ తర్వాత అథ్లెటిక్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది ప్రపంచ చాంపియన్‌షిప్స్. విశ్వవ్యాప్త ప్రఖ్యాత అథ్లెట్ల సత్తాకు పరీక్షగా నిలిచే ఈ చాంపియన్‌షిప్స్ శనివారం టోక్యోలో ప్రారంభం కానున్నాయి. ఈనెల 21 వరకు జరిగే పోటీలలో 200 జట్ల నుంచి 2000 మంది అథ్లెట్లు తలపడుతున్నారు. 49 విభాగాలలో మొత్తం 147 పతకాలకోసం హోరాహోరీ పోరు జరగనుంది. షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్, షకారీ రిచర్డ్‌సన్, నోవా లైల్స్, కిషానే థాంప్సన్, సిడ్నీ మెక్‌లాలిన్, అర్మాండ్ డుప్లాంటిస్, నీరజ్ చోప్రా వంటి మేటి అథ్లెట్లు ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.

షెల్లీ ఘనంగా ముగిస్తుందా..?

ఈసారి వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో జమైకా స్ప్రింట్ దిగ్గజం, మహిళల 100 మీ. స్ప్రింట్ రారాణి షెల్లీ ఆన్ ఫ్రేజర్ ప్రైస్‌పై అందరి దృష్టి నిలిచింది. 38 ఏళ్ల స్టార్ ఈ పోటీల తర్వాత ట్రాక్ నుంచి రిటైర్ కానుంది. మూడు ఒలింపిక్, 10 ప్రపంచ చాంపియన్‌షిప్స్ స్వర్ణ పతకాల విజేత షెల్లీ టైటిల్‌తో ఘనమైన వీడ్కోలు తీసుకోవాలని భావిస్తోంది. అలాగే మహిళల 100, 200 మీ.లలో అమెరికన్ క్వీన్ షకారీ రిచర్డ్‌సన్ ప్రధాన ఆకర్షణ కానుంది. గత వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో నెగ్గిన 100 మీ. టైటిల్‌ను నిలబెట్టుకోవాలని రిచర్డ్‌సన్ పట్టుదలగా ఉంది. గాయాలతో సతమతమవుతున్న పురుషుల 100.మీ., 200 మీ.ల డిఫెండింగ్ చాంపియన్ నోవా లైల్స్ (అమెరికా) టైటిళ్లు నిలబెట్టుకుంటాడేమో చూడాలి. సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న జమైకా స్ప్రింటర్ కిషానే థామ్సన్..నోవాకు గట్టి పోటీ ఇవ్వనున్నాడు. బరిలో దిగిన ప్రతి టోర్నీలో రికార్డులు నమోదు చేస్తున్న పురుషుల పోల్‌వాల్ట్ మొనగాడు అర్మాండ్ డుప్లాంటిస్ టోక్యోలో నెలకొల్పే రికార్డుపై ఉత్కంఠ ఏర్పడింది. ఇంకా భారత స్టార్ నీరజ్ చోప్రా, మహిళల 400 మీ. హర్డిల్స్‌లో ప్రపంచ రికార్డు గ్రహీత సిడ్నీ మెక్‌లాలిన్ (అమెరికా), మహిళల 1500, 5వేల మీ.లలో కిప్‌యేగాన్ (కెన్యా) మెరుపులు చూసి తీరాల్సిందే.

టైటిల్‌పై నీరజ్ గురి

భారత్ ఆశలన్నీ సూపర్ స్టార్ నీరజ్ చోప్రాపైనే నిలిచాయి. 2023 బుడాపెస్ట్ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో జావెలిన్ పసిడి పతకంతో చరిత్ర సృష్టించిన నీరజ్.. ఆ టైటిల్‌ను నిలబెట్టుకోడమే ధ్యేయంగా బరిలోకి దిగుతున్నాడు. అయితే పాకిస్థాన్‌కు చెందిన ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్, చెక్ త్రోయర్ జాకబ్ వాల్డేచ్‌ల నుంచి నీరజ్‌కు తీవ్రమైన పోటీ ఎదురుకానుంది. ఇక..మొత్తం 19 మంది అథ్లెట్ల భారత బృందం టోక్యోలో తలపడుతోంది. కానీ పతక ఆశలు మాత్రం నీరజ్‌పైనే నిలిచాయి. ఈనెల 17న జావెలిన్ ఈవెంట్ మొదలు కానుంది. భారత్ నుంచి అన్నూరాణి (మహిళల జావెలిన్), పారుల్ చౌధరి (3000మీ స్టీపుల్ ఛేజ్), మురళీ శ్రీశంకర్ (లాంగ్ జంప్), గుల్వీర్ సింగ్ (5000మీ.), ప్రవీణ్ చిత్రవేల్ (ట్రిపుల్ జంప్) కూడా బరిలో ఉన్నారు.

ఫైనల్‌కు జైస్మిన్


జైస్మిన్

సెమీస్‌లో మీనాక్షి ● ప్రపంచ బాక్సింగ్

లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్ జైస్మిన్ లంబోరియా ఫైనల్ చేరింది. మహిళల 57 కిలోల విభాగం సెమీస్‌లో జైస్మిన్ 5-0తో ఒమైలిన్ అల్కాలా (వెనెజులా)ను చిత్తుచేసి కనీసం రజతం ఖాయం చేసుకుంది. మరో అమ్మాయి మీనాక్షి హుడా సెమీస్ చేరడంతో భారత్ ఖాతాలో మరో పతకం ఖరారైంది. 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో మీనాక్షి 5-0తో అలైస్ పుంప్రే (ఇంగ్లండ్)ను ఓడించింది. ఇక..పురుషుల విభాగంలో భారత్ పోరు ముగిసింది. బరిలో మిగిలిన జాదుమని సింగ్ 50 కిలోల కేటగిరీ క్వార్టర్‌ఫైనల్లో సాంఝర్ (కజకిస్థాన్) చేతిలో 0-4తో పరాజయం పాలయ్యాడు.

పాక్ శుభారంభం

ఒమన్‌పై ఘనవిజయం

ఆసియా కప్‌లో నేడు

బంగ్లాదేశ్ × శ్రీలంక

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..


మహ్మద్ హారీస్ (66)

దుబాయ్: భారత్‌తో మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ జట్టు కూడా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం గ్రూప్ 'ఎ'లో ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 93 పరుగుల తేడాతో నెగ్గింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మహ్మద్ హారీస్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 66) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ ఆరంభంలో తడబడినా.. చివరకు 20 ఓవర్లలో 7 వికెట్లకు 160 పరుగులు సాధించింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (29), ఫఖర్ జమాన్ (23 నాటౌట్), మహ్మద్ నవాజ్ (19) ఫర్వాలేదనిపించారు. పేసర్ షా ఫైజల్, స్పిన్నర్ ఆమిర్ కలీమ్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో పాక్ బౌలర్ల ధాటికి ఒమన్ బ్యాటర్లు తేలిపోయారు. దీంతో ఆ జట్టు 16.4 ఓవర్లలో 67 పరుగులే చేసి చిత్తుగా ఓడింది. 10 పరుగుల వ్యవధిలోనే ఏడు వికెట్లు కోల్పోవడం గమనార్హం. హమ్మద్ మీర్జా (27) ఒక్కడే కాస్త పోరాడాడు. స్పిన్నర్లు సుఫియాన్, సయిామ్ అయూబ్‌లతో పాటు పేసర్ ఫహీమ్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు

పాకిస్థాన్: 20 ఓవర్లలో 160/7 (మహ్మద్ హారీస్ 66, ఫర్హాన్ 29, ఫఖర్ 23; కలీమ్ 3/31, ఫైజల్ 3/34).

ఒమన్: 16.4 ఓవర్లలో 67 ఆలౌట్. (హమ్మద్ 27; ఫహీమ్ 2/6, సుఫియాన్ 2/7, సయిామ్ అయూబ్ 2/8).

యష్, రజత్ శతకాలు

● సెంట్రల్ జోన్ 384/5 ● 'సౌత్'తో దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్ రెండో రోజే పట్టు బిగించింది. యష్ రాథోడ్ (137 బ్యాటింగ్), కెప్టెన్ రజత్ పటీదార్ (101) శతకాల సహాయంతో.. శుక్రవారం ఆట ముగిసే సమయానికి సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 384/5 స్కోరు సాధించింది. ప్రస్తుతం జట్టు 235 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్ మలేవర్ (53) హాఫ్ సెంచరీ చేయగా, క్రీజులో యష్‌తో పాటు సారాంశ్ (47 బ్యాటింగ్) ఉన్నాడు. లెఫ్టామ్ పేసర్ గుర్జప్‌నీత్‌కు మూడు వికెట్లు దక్కాయి. సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకు కుప్పకూలిన విషయం తెలిసిందే.

బెంగళూరు హ్యాట్రిక్

జైపూర్: ప్రొ. కబడ్డీ లీగ్‌లో బెంగళూరు బుల్స్ జోరు ప్రదర్శిస్తూ వరుసగా మూడో విజయం సాధించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో 28-23తో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. దీపక్ శంకర్ మరో 'హై ఫైవ్'తో అదరగొట్టగా, రైడర్ అలీరెజా 8 పాయింట్లతో సత్తా చాటాడు. జైపూర్‌లో నితిన్ కుమార్ (8) ఒక్కడే రాణించాడు. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 46-36తో బెంగాల్ వారియర్స్‌ను చిత్తు చేసింది.

ఇక దయచేయండి!



విరుష్కతో కివీస్ హోటల్ సిబ్బంది

న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ, అనుష్క జోడీని వెళ్లిపోవాలని న్యూజిలాండ్‌లోని ఓ హోటల్ సిబ్బంది కోరిన ఉదంతాన్ని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. గతంలో భారత పురుషులు, మహిళల జట్లు ఒకే సమయంలో కివీస్‌లో పర్యటించాయి. ఇరు జట్లూ ఒకే హోటల్‌లో బస చేశాయి. ఈక్రమంలో బ్యాటింగ్‌కు సంబంధించి సలహాలు ఇవ్వాలని స్మృతి మంధాన, జెమీమా..విరాట్‌ను కోరారు. దాంతో అదే హోటల్‌లోని కేఫ్‌కు రావాలని విరాట్ వారికి సూచించాడు. అప్పటికే కోహ్లీ, అనుష్క జోడీ అక్కడ ఉంది. దాదాపు నాలుగు గంటలపాటు విరాట్, మంధాన, జెమీమాతోపాటు అనుష్క మాట్లాడుకున్నారట. తొలి అరగంట క్రికెట్ విషయాలపై చర్చించగా.. ఆపై సాధారణ జీవితానికి సంబంధించిన మాటల్లోకి జారుకున్నట్టు జెమీమా వెల్లడించింది. అప్పటికే రాత్రి 11.30 కావడంతో కేఫ్ సిబ్బంది వచ్చి విరాట్, అనుష్కను అక్కడ నుంచి వెళ్లిపోవాలని సూచించినట్టు రోడ్రిగ్స్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది.

సెమీస్‌లో సాత్విక్ జోడీ

● లక్ష్యసేన్ కూడా..
● హాంకాంగ్ ఓపెన్



హాంకాంగ్: భారత షట్లర్లు లక్ష్యసేన్, సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్నారు. సింగిల్స్‌లో లక్ష్యసేన్, డబుల్స్‌లో సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో ప్రవేశించారు. ఇద్దరు భారత ఆటగాళ్ల మధ్య జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో లక్ష్య 21-16, 17-21, 21-13తో ఆయుష్ షెట్టిపై గెలుపొందాడు. గత మ్యాచ్‌లో 2024 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ కొడాయి నరౌకాకి షాకిచ్చి సంచలనం సృష్టించిన ఆయుష్.. లక్ష్యతో పోరులో మాత్రం తడబడ్డాడు. అయితే ఓడినా.. ఆయుష్ గెలుపు కోసం చివరిదాకా పోరాడిన తీరు ఆకట్టుకుంది. గంటా ఆరు నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో తొలి గేమ్ ఓడినా, రెండో గేమ్‌లో లక్ష్యపై పైచేయి సాధించి మ్యాచ్ గెలిచేలా కనిపించాడు. కానీ, నిర్ణాయక మూడో గేమ్ ఆఖర్లో పలుమార్లు ఔట్ షాట్‌లు కొట్టి మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఫైనల్ బెర్త్ కోసం తైవాన్ షట్లర్, మూడో సీడ్ చో తిన్ చెన్‌తో లక్ష్య అమీతుమీ తేల్చుకోనున్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్స్‌లో 8వ సీడ్ సాత్విక్/చిరాగ్ జంట 21-14, 20-22, 21-16తో మలేసియా జోడీ ఆరిఫ్ జునైది/రాయ్ కింగ్ యాప్‌ను ఓడించింది. ఇటీవలే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తా చాటిన సాత్విక్ ద్వయం సెమీఫైనల్లో తైవాన్ జోడీ చెన్ చెంగ్ కాన్/లిన్ బింగ్ వీతో తలపడనుంది.

గాథ పోరు ముగిసె..

● నెంబర్‌వన్ చేతిలో ఓటమి

● ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్

గ్వాంగ్జు (దక్షిణ కొరియా): ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్‌కు ఈసారీ నిరాశ తప్పలేదు. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రీక్వార్టర్స్ చేరి టైటిల్‌పై ఆశలు రేపిన 15 ఏళ్ల గాథ ఖడాకే పోరాటం ముగిసింది. ప్రపంచ నెంబర్‌వన్, పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణాల విజేత లిమ్ షియోన్ (కొరియా)తో జరిగిన పోరులో గాథ 0-6తో ఓటమిపాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్స్ రికర్వ్ విభాగంలో భారత్ చివరిసారిగా 2019లో పురుషుల జట్టు రజతం నెగ్గింది. కాగా, ఈసారి టోర్నీలో కాంపౌండ్ ఈవెంట్‌లో పురుషుల జట్టు స్వర్ణం, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో జ్యోతి సురేఖ/రిషభ్ జోడీ రజతం నెగ్గిన సంగతి తెలిసిందే.

ఐపీఓ మార్కెట్లో సంస్కరణలు

● కనీస పబ్లిక్ షేర్ హోల్డింగ్‌పై కంపెనీలకు ఊరట

● 10 ఏళ్ల వరకు గడువు పెంపు

● సెబీ చైర్మన్ పాండే



ఇతర ప్రధాన నిర్ణయాలు

● రూ.250 కోట్లకు మించిన ఐపీఓల్లో యాంకర్ ఇన్వెస్టర్ల వాటా 10% నుంచి 15 శాతానికి పెంపు

● రూ.250 కోట్ల కంటే తక్కువ ఉండే ఐపీఓల్లో మదుపు చేసే యాంకర్ ఇన్వెస్టర్ల సంఖ్య 5 నుంచి 15 మధ్య ఉండాలి

● నియమిత మదుపరులకు సేవలు అందించే ఏఐఎఫ్‌లకు ఊరట

● రీట్స్, ఇన్విట్స్.. ఈక్విటీ పెట్టుబడులుగా వర్గీకరణ

● ప్రతి స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇద్దరు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల నియామకం

ముంబై : దేశ క్యాపిటల్ మార్కెట్లో మరిన్ని సంస్కరణలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శ్రీకారం చుట్టింది. శుక్రవారం చైర్మన్ తుహిన్ కాంత పాండే అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో సెబీ దీనికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దమొత్తంలో మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల జారీలో మరింత వెసులుబాటు కల్పించాలని సెబీ నిర్ణయించింది. రూ.50,000 కోట్ల నుంచి రూ.లక్ష కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ ఉన్న కంపెనీలు తమ ఈక్విటీలో 25 శాతం కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) కలిగి ఉండాలన్న గడువును ప్రస్తుత మూడేళ్ల నుంచి ఐదేళ్లకు పొడిగించారు. కంపెనీలు ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ముందు కనీసం 8 శాతం ఈక్విటీ షేర్లను జారీ చేసి, ఆ తర్వాత మిగతా 17 శాతం ఈక్విటీ షేర్లను దశలవారీగా ఐపీఓల ద్వారా విక్రయించేందుకు అనుమతిస్తారు. రూ.లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు ఐదేళ్లలో జారీ చేయాల్సిన ఎంపీఎస్ ఈక్విటీ షేర్ల పరిమితినీ సెబీ సవరించింది. ప్రస్తుతం ఈ కంపెనీలు ఇందుకోసం ముందుగా 5 శాతం ఈక్విటీని ఎంపీఎస్‌గా జారీ చేయాలి. దీన్ని 2.75 శాతానికి కుదించాలని సెబీ నిర్ణయించింది. ఇక రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ క్యాప్ ఉన్న కంపెనీలు 25 శాతం ఎంపీఎస్‌కి చేరాల్సిన గడువునీ ప్రస్తుత ఐదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. ఇందుకోసం ఈ కంపెనీలు ముందు తమ ఈక్విటీలో 2.5 శాతం షేర్లను ఐపీఓ ద్వారా జారీ చేస్తే సరిపోతుంది. మిగతా 22.5 శాతం ఈక్విటీ షేర్లను మార్కెట్ పరిస్థితులను బట్టి పదేళ్లలో జారీ చేస్తే సరిపోతుంది.

పెద్ద కంపెనీలకు ఊరట: సెబీ తాజా నిర్ణయం త్వరలో పబ్లిక్ ఇష్యూకి వచ్చే రిలయన్స్ జియో, ఎన్ఎస్ఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఒకేసారి పెద్ద మొత్తంలో ఐపీఓలు జారీ చేస్తే.. ఆ ఇష్యూలను భరించే శక్తి మార్కెట్‌కు లేకపోవడంతో పాటు సెకండరీ మార్కెట్ కూడా తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. నిర్దిష్ట గడువులోనే దశల వారీగా ఈ వాటా విక్రయించేందుకు అనుమతించాలని కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. సెబీ ఎట్టకేలకు శుక్రవారం దీనికి ఆమోదం తెలిపింది.

రిటైల్ మదుపరులకు ఊరట: ప్రస్తుతం రూ.5,000 కోట్లకు మించిన ఐపీఓ ఇష్యూల్లో రూ.2 లక్షల లోపు పెట్టుబడితో దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు 35 శాతం షేర్లు కేటాయిస్తున్నారు. దీన్ని 25 శాతానికి కుదించాలని సంస్థాగత మదుపరుల నుంచి ఒత్తిడి వచ్చింది. అయినా ఈ వాటాను యథాతథంగా 35 శాతం వద్దే కొనసాగించాలని నిర్ణయించినట్టు సెబీ చైర్మన్ పాండే చెప్పారు. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు కేటాయించే 50 శాతం వాటానూ అలాగే కొనసాగించాలని సెబీ నిర్ణయించింది.

ఎఫ్‌పీఐల పెట్టుబడులకు సింగిల్ విండో: భారత స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు సింగిల్ విండో విధానాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. దీని ద్వారా తక్కువ రిస్క్ కలిగిన ఎఫ్‌పీఐల పెట్టుబడులను ఆకర్షించవచ్చని భావిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా సింగిల్ విండో ఆటోమేటిక్ అండ్ జనరలైజ్డ్ యాక్సెస్ ఫర్ ట్రస్టెడ్ ఫారిన్ ఇన్వెస్టర్స్ (స్వాగత్-ఎఫ్ఐ) పేరుతో కొత్త ముసాయిదాను రూపొందించింది. కాగా దేశంలో ప్రతి నెలా 100 ఎఫ్‌పీఐలు నమోదవుతూ వస్తున్నాయని సెబీ తెలిపింది. ఏడాది క్రితం 10,500 ఎఫ్‌పీఐలు నమోదై ఉండగా ప్రస్తుతం ఈ సంఖ్య 12,000 దాటిందని పేర్కొంది.

బిజినెస్

అపోలో హాస్పిటల్స్ చేతికి అపోలో హెల్త్

● ఐఎఫ్‌సీ నుంచి 31 శాతం వాటా కొనుగోలు

● డీల్ విలువ రూ.1,254 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో హెల్త్ అండ్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్‌ఎల్‌ఎల్) పూర్తి స్థాయిలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్ఈఎల్) అనుబంధ సంస్థ కానుంది. ఇందుకోసం ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) చేతిలో ఉన్న 31 శాతం వాటాను ఏహెచ్ఈఎల్ రూ.1,254.07 కోట్లకు కొనుగోలు చేయనుంది. శుక్రవారం జరిగిన సమావేశంలో ఏహెచ్ఈఎల్ డైరెక్టర్ల బోర్డు ఈ షేర్ల కొనుగోలు ఒప్పందానికి ఆమోదం తెలిపింది. దీంతో ఏహెచ్‌ఎల్‌ఎల్ ఈక్విటీలో ఏహెచ్ఈఎల్ వాటా 99.42 శాతానికి చేరుతుంది. మిగతా 0.58 శాతం షేర్లు ఈ-సాప్స్ కింద ఉద్యోగుల వద్ద ఉంటాయి. ఏహెచ్‌ఎల్‌ఎల్ కార్యకాపాలపై పూర్తి నియంత్రణ, యాజమాన్యం కోసం ఐఎఫ్‌సీ నుంచి ఈ వాటాలను కొనుగోలు చేస్తున్నట్టు ఏహెచ్ఈఎల్ రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. దీనివల్ల ఏహెచ్‌ఎల్‌ఎల్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడడంతో పాటు, ఆ సంస్థ వ్యాధి నిర్ధారణ సేవలను ఏహెచ్ఈఎల్‌తో పూర్తి స్థాయిలో అనుసంధానించేందుకు వీలవుతుందని పేర్కొంది. ఈ చర్య అపోలో గ్రూప్ సమగ్ర ఆరోగ్య సేవలకు మరింత విలువ జోడిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ సునీతా రెడ్డి తెలిపారు. ఏహెచ్‌ఎల్‌ఎల్‌పై పూర్తి పట్టు ద్వారా ఆ కంపెనీకి చెందిన ప్రాథమిక ఆరోగ్య, వ్యాధి నిర్ధారణ సేవలు, మహిళల ఆరోగ్యం, డెంటల్, డయాలసిస్, అంబులెన్స్ సేవలను మరింత ముందుకు తీసుకు వెళతామని ఏహెచ్ఈఎల్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

గురుగ్రామ్‌లో క్యాన్సర్ కేర్ సెంటర్: గురుగ్రామ్‌లో రూ.573 కోట్ల పెట్టుబడితో అదనంగా సమగ్ర క్యాన్సర్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకూ ఏహెచ్ఈఎల్ బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కేంద్రం ద్వారా ఏటా అదనంగా 350 రోగులకు వైద్య సేవలు అందించవచ్చు. 2029 మార్చి నాటికి ఈ కేంద్రం ఏర్పాటు పూర్తవుతుంది.

మళ్లీ ధరలు సుర్..

ఆగస్టు ద్రవ్యోల్బణం 2.07%

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం మరోసారి ఊర్ధ్వముఖ చలనం ప్రారంభించింది. కూరగాయలు, మాంసం, చేపలు, గుడ్ల ధరలు పెరగడంతో ఆగస్టు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 2.07 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం జూలైలో 1.61%, గత ఏడాది ఆగస్టులో (-) 0.69% ఉంది. 9 నెలల పాటు వరుసగా తగ్గుతూ వచ్చిన వినియోగదారుల ధరల సూచీ ఆగస్టులో తొలిసారి ఎగువకు కదిలింది. అయితే ఆర్‌బీఐకి ప్రభుత్వం నిర్దేశించిన కట్టడి పరిధి 4% (2 శాతం ఎగువకు లేదా దిగువకు సద్దుబాటుతో)లోపే ఉంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రాంతాల్లో 1.18% నుంచి 1.69 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.1% నుంచి 2.47 శాతానికి పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే కేరళలో గరిష్ఠంగా9.04% ఉండగా అసోమ్‌లో కనిష్ఠంగా -0.66% ఉంది. ఆహార, ఇంధన విభాగాలు మినహా ఇతర విభాగాల్లో ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉంది.

మార్కెట్లలో కొనసాగిన ర్యాలీ

ఇటు ఈక్విటీలు, అటు బులియన్ పరుగులు

ముంబై: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న ఆశలతో పాటు ఇన్ఫోసిస్ ప్రకటించిన భారీ బైబ్యాక్ ఉత్తేజంతో శుక్రవారం కూడా ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ కొనసాగింది. వరుసగా సెన్సెక్స్ ఐదో రోజు, నిఫ్టీ ఎనిమిదో రోజు లాభాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 444.12 పాయింట్లు లాభంతో 81,992.85 పాయింట్లను తాకిన సెన్సెక్స్ చివరికి 355.97 పాయింట్ల లాభంతో 81,904.70 వద్ద ముగిసింది. నిఫ్టీ 108.50 పాయింట్ల లాభంతో 25,114 వద్ద ముగిసింది. వారం మొత్తంలో సెన్సెక్స్ 1193.94 పాయింట్లు, నిఫ్టీ 373 పాయింట్లు లాభపడ్డాయి. వరుసగా 8 సెషన్లలో నిఫ్టీ 534 పాయింట్లు లాభపడింది.

బంగారం, వెండి భగభగ

బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల ర్యాలీ కూడా అప్రతిహతంగా కొనసాగుతోంది. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.700 పెరిగి మరో జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,13,800 వద్ద ముగిసింది. 99.5% స్వచ్ఛత గల బంగారం ధర సైతం రూ.700 పెరిగి రూ.1,13,300 వద్ద స్థిరపడింది. రెండు రోజుల నష్టాలకు తెర దించిన వెండి ధర బలమైన పునరుజ్జీవం సాధించింది. కిలో వెండి రూ.4,000 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.1,32,000 వద్ద స్థిరపడింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



13వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	132
కరీంనగర్	121	ఒంగోలు	132
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	118
కర్నూలు	121	నెల్లూరు	123
విశాఖపట్నం	144	అనంతపురం	123
గోదావరి	140		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,280 ▲	1,02,000 ▲	1,41,000 ▲
విజయవాడ	1,13,150 ▲	1,07,000 ▲	1,31,800 ▲
విశాఖపట్నం	1,13,040 ▲	1,00,540 ▼	1,42,000 ▲
రాజమండ్రి	1,11,270 ▲	1,02,000 ▲	1,28,300 ▲
ప్రొద్దుటూరు	1,13,200 ▼	1,04,140 ▼	1,31,600 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲



జువెలరీ రిటైలర్ జోయాలుక్కాస్.. కూకట్‌పల్లిలో రెండో షోరూమ్‌ను ప్రారంభించింది. ఈ షోరూమ్‌ను శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, వివేకానంద నగర్ కాలనీ కార్పొరేటర్ రోజా దేవీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోయాలుక్కాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఆంటోనీ జోస్, థామస్ మాథ్యూ, సీఓఓ హెన్రీ జార్జ్, రిటైల్ హెడ్ రాజేశ్ కృష్ణన్, మార్కెటింగ్ హెడ్ అనీష్ వర్గీస్, రీజినల్ మేనేజర్ సునీల్ పీఎస్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మార్కెట్లోకి విన్‌ఫాస్ట్

వీఎఫ్6, వీఎఫ్7 ఎలక్ట్రిక్ కార్లు విడుదల



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వియత్నాం కేంద్రంగా ఉన్న విన్‌గ్రూప్ జేఎస్‌సీ ఎలక్ట్రిక్ వాహన సంస్థ విన్‌ఫాస్ట్ ఇండియా.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తొలి షోరూమ్‌ను ప్రారంభించింది. శుక్రవారం నాడిక్కడ కంపెనీ డిప్యూటీ సీఈఓ అరుణోదయ్ దాస్.. గచ్చిబౌలి, బేగంపేటల్లో నానేష్ ఆటోమోటివ్స్ ఏర్పాటు చేసిన షోరూమ్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మార్కెట్లోకి విన్‌ఫాస్ట్ ప్రీమియం ఎలక్ట్రిక్ కార్లు వీఎఫ్6, వీఎఫ్7 విడుదల చేశారు. వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 10 ఏళ్ల బ్యాటరీ వారంటీతో ఈ కార్లను తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. కాగా, వీఎఫ్6 ప్రారంభ ధర రూ.16.49 లక్షలు, వీఎఫ్7 ప్రారంభ ధర రూ.20.89 (ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు దాస్ తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి దేశవ్యాప్తంగా 27కి పైగా నగరాల్లో 35 డీలర్‌షిప్స్, 26 వర్క్‌షాప్స్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్ మార్కెట్లో ఇప్పటికే 150కి పైగా కార్లకు బుకింగ్స్ వచ్చాయని, ఈ నెల 22 నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు నానేష్ ఆటో డైరెక్టర్ అక్షయ్ జైన్ తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా
దామోదర్ రెడ్డి, బిక్షం గౌడ్


దామోదర్ రెడ్డి; బిక్షం గౌడ్

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్టీయూ) నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పీఆర్టీయూ ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో పీఆర్టీయూ అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పుల్గం దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుంకరి బిక్షం గౌడ్ ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ ఛైర్మన్‌గా సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని ఎన్నుకున్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బి. మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థల నుంచి ఏఐ మెంటార్

- విద్యార్థులకు 5 సెకన్లలో సందేహ నివృత్తి
- ఇంగ్లీష్‌తో పాటు 9 భాషల్లో అందుబాటు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య విద్యాసంస్థల ఇన్ఫినిటీ లెర్న్ ఏఐ ఆధారిత మెంటార్ ఏఐఎన్ఏ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నర్చరింగ్ అసిస్టెంట్)ను విడుదల చేసింది. ఇది దేశంలోనే మొట్టమొదటి వాయిస్ ఫస్ట్, ఏఐ ఆధారిత మెంటార్ అని సంస్థ తెలిపింది. ఇది సాధారణ చాట్ బాట్ కాదని, విద్యార్థులకు తక్షణ సందేహ నివృత్తి చేస్తుందని శ్రీచైతన్య ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సీఈవో, డైరెక్టర్ సుష్మ బొప్పన తెలిపారు. ఆత్మవిశ్వాసం, ప్రేరణతో పాటు విద్యార్థుల్లోని అసలైన సామర్థ్యాన్ని వెలికితీయడమే తమ లక్ష్యమన్నారు. ఇన్ఫినిటీ లెర్న్ వ్యవస్థాపక సీఈవో ఉజ్వల్ సింగ్ మాట్లాడుతూ గూగుల్ క్లౌడ్, ఐఐటీ-హైదరాబాద్ సహకారంతో రూపొందిన ఈ టెక్నాలజీ ఇప్పటికే 96.7 శాతం ఖచ్చితత్వంతో సమాధానాలు ఇస్తోందన్నారు. ఇంగ్లీష్‌తో పాటు 9 భారతీయ భాషల్లో సహాయం అందిస్తోందని తెలిపారు. ఇన్ఫినిటీ లెర్న్‌కు దేశవ్యాప్తంగా 10వేల పాఠశాలల్లో 10లక్షల ప్రీమియం లెర్నర్స్ ఉన్నారని సంస్థ నిర్వాహకులు తెలిపారు.


సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో రాఘవులు, జాన్ వెస్లీ తదితరులు

సాంస్కృతిక వారసత్వమే భారతీయతకు పునాది

- సంఘ్ పరివార్‌ది అసత్య ప్రచారం: బీవీ రాఘవులు
- సీపీఎం ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి వర్ధంతి సభ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిందూ మత భావన ప్రాచీన కాలం నుంచి ఉందని, ప్రజల రాజకీయ, సామాజిక జీవనాన్ని నడిపించిందని.. సంఘ్ పరివార్ శక్తులు చేస్తున్న ప్రచారం అసత్యమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. తరతరాల సాంస్కృతిక వారసత్వమే భారతీయ భావనకు పునాది అని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 'సీతారాం ఏచూరి- ఓ సోషలిస్టు ఆచరణ పథం' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. 'భారతీయ భావన - వాస్తవం- వక్రీకరణ' అంశంపై రాఘవులు కీలకోపన్యాసం చేశారు. భారతీయ భావనకు పునాది మన సమ్మిశ్రమ సాంస్కృతిక వారసత్వంలోనే ఉందని సీతారాం ఏచూరి విశ్వసించారని పేర్కొన్నారు. బీజేపీ, ఆరెస్సెస్‌లకు ప్రజాస్వామ్యం నచ్చదని, భూస్వామ్య, రాచరిక వ్యవస్థలను తిరిగి తేవాలన్నదే మతతత్వ సమూహాల లక్ష్యమని ఆయన ఆరోపించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ బీజేపీకి కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, మతోన్మాదాన్ని సైద్ధాంతికంగా ఓడించగలిగేది వామపక్ష పార్టీలేనని పేర్కొన్నారు. సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి మాట్లాడుతూ జాతుల ఏర్పాటులో మతానికి ప్రాధాన్యం లేదని అభిప్రాయపడ్డారు.

మధ్యాహ్నభోజన కార్మికులకు
వేతనాలు, బిల్లులు చెల్లించాలి: హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. మధ్యాహ్నభోజన పథకం కార్మికులపట్ల రేవంత్‌రెడ్డి సర్కార్ కఠినంగా వ్యవహరిస్తున్న తీరు అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వరంగల్‌కు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. కార్మికులు ఆందోళన చెందొద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా, యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న జర్నలిస్టులపై కేసులు పెడతారా? అని ఎక్స్ వేదికగా హరీశ్‌రావు ప్రశ్నించారు.

ఎవరి పరిధిలో వారుండాలి

- నా నియోజకవర్గంలో నాకు తెలియకుండా ధర్మకర్తలను నియమిస్తారా?: ఎమ్మెల్యే నాయిని

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పరోక్షంగా మంత్రి కొండా సురేఖను ఉద్దేశించి.. "పెద్దలు ఎవరి పరిధిలో వారుండాలి.. నా నియోజకవర్గంలో ఉన్న గుడికి నాకు తెలియకుండా ధర్మకర్తలను వేయడం.. ఇతర విషయాల్లో నియోజకవర్గంలో జోక్యం చేసుకోవడం మంచి పద్ధతి కాదు.." అని విమర్శించారు. భద్రకాళి అమ్మవారి దర్శనానికి శుక్రవారం వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఆలయానికి తాజాగా మరో ఇద్దరు ధర్మకర్తలను నియమిస్తూ జీవో జారీ కావడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని ఆయన చెప్పారు.

1.40 లక్షల టన్నుల దొడ్డు బియ్యం వేలం!

- టెండర్లకు ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ చౌక డిపోలు, ఎంఎల్ఎస్ పాయింట్లు, బఫర్ గోదాముల్లో నిల్వ ఉన్న 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీచేశారు. కిలోకు రూ.24 (క్వింటాలుకు రూ.2,400) కనీస ధరగా నిర్ణయించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

- ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు వివిధ రాయితీలు అందిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, నిధులను ఉద్యాన శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా శుక్రవారం ప్రకటించారు. కొత్త తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగు కోసం 9,902 ఎకరాలకు రూ.18.48 కోట్లు కేటాయించారు.

నేపాల్ తాత్కాలిక ప్రధానిగా
సుశీల కర్కి ప్రమాణం

(మొదటిపేజీ తరువాయి)

జెన్ జెడ్ గ్రూపుల ప్రతినిధులు శుక్రవారం జరిపిన చర్చల్లో ఈ మేరకు అంగీకారానికి వచ్చారు. అనంతరం శుక్రవారం రాత్రి 9.30గంటలకు నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితో అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ప్రమాణ స్వీకారం చేయించారు. నేపాల్ ఉపాధ్యక్షుడు రామ్ సహాయ్ యాదవ్, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ప్రకాశ్‌సింగ్ రావత్, ఆర్మీ చీఫ్, ఇతర కీలక నేతలు, అధికారుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుత పార్లమెంటును రద్దు చేస్తున్న నేపథ్యంలో పాలన సజావుగా కొనసాగానికి వీలుగా పది మంది మంత్రులను నియమించుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. మరోవైపు తాము ప్రభుత్వంలో చేరబోమని, ప్రభుత్వ పనితీరును తమ సలహా కమిటీ పర్యవేక్షించి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తుందని 'జెన్ జెడ్' గ్రూపుల ప్రతినిధులు స్పష్టం చేసినట్టు తెలిసింది.

సుదీర్ఘ చర్చల తర్వాత ఖరారు..

యువత ఆందోళనల నేపథ్యంలో నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కితోపాటు కాఠ్మండూ మేయర్ బాలేంద్ర షా, నేపాల్ ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ సీఈవో కుల్మన్ ఘీసింగ్, మేయర్ హర్కా సంపంగ్‌ల పేర్లు తెరపైకి వచ్చాయి. గురువారం ఆర్మీ ప్రధాన కార్యాలయంలో జరిగిన చర్చల్లో ఏమీ తేలలేదు. శుక్రవారం రాత్రి వరకు దేశాధ్యక్ష కార్యాలయంలో చర్చలు జరిగాయి. చివరికి సుశీల కర్కిని తాత్కాలిక ప్రధానిగా ఎంపిక చేశారు. 73ఏళ్ల సుశీల కర్కి నేపాల్ సుప్రీంకోర్టు తొలి ప్రధాన న్యాయమూర్తికాగా, ఇప్పుడు తొలి మహిళా ప్రధాని కూడా ఆమెనే కావడం విశేషం.

అధ్యక్షుడి విశేషాధికారాల మేరకు..

నేపాల్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 76 ప్రకారం.. పార్లమెంటు సభ్యులై ఉండి, మెజారిటీ సభ్యుల మద్దతు ఉన్నవారే ప్రధానమంత్రి అవుతారు. ప్రస్తుతం నేపాల్ పార్లమెంటును రద్దు చేసిన నేపథ్యంలో ఆ దేశ రాజ్యాంగంలోని ఆర్టికల్ 61 ప్రకారం అధ్యక్షుడికి దఖలు పడిన విశేషాధికారాల మేరకు తాత్కాలిక ప్రధానిగా సుశీలను నియమిస్తూ అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఉత్తర్వులు జారీ చేశారు.


నేపాల్ ప్రధానిగా ప్రమాణం చేస్తున్న సుశీల కర్కి

దేశంలో ఎమర్జెన్సీ..

తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే సుశీల కర్కి.. ఉన్నతాధికారులతో తొలి కేబినెట్ భేటీ నిర్వహించారు. నేపాల్‌లో ఆరు నెలల్లోగా సాధారణ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి 4వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని ప్రతిపాదించారు. ఇక దేశంలో అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేలా, దేశంలో పరిస్థితులు చక్కబడేలా తగిన చర్యలు చేపట్టేందుకు వీలుగా.. నేపాల్‌లో అత్యవసర పరిస్థితి విధించాలని అధ్యక్షుడికి తాత్కాలిక ప్రధాని సుశీల కర్కి సిఫారసు చేసినట్టు తెలిసింది.

రాజకీయ పక్షాల నిరసనలు

నేపాల్ ప్రస్తుత పార్లమెంటును రద్దుచేయాలన్న ప్రతిపాదనను నిరసిస్తూ.. రాజకీయ పక్షాలు శుక్రవారం ఆ దేశ అధ్యక్ష కార్యాలయం బయట ఆందోళనకు దిగాయి. ఆందోళనలతో ప్రధాని పదవికి రాజీనామా చేసిన కేపీ శర్మ ఓలికి చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (సీపీఎన్-యూఎంఎల్) ప్రధాన కార్యదర్శి శంకర్ పొఖారెల్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. దీనిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఇక తాత్కాలిక ప్రధానిగా సుశీల కర్కి ఎంపిక రాజ్యాంగ విరుద్ధమని నేపాల్ మావోయిస్టు పార్టీ నేత దేవేంద్ర పౌడెల్ మండిపడ్డారు. మరోవైపు.. ఆ దేశ పార్లమెంటు దిగువ సభ స్పీకర్ దేవ్ రాజ్ ఘిమిరే (సీపీఎన్-యూఎన్ఎల్), ఎగువ సభ ఛైర్‌పర్సన్ నారాయణ్ దహాల్ (మావోయిస్టు పార్టీ) ఇద్దరూ కూడా సుశీల కర్కి ప్రమాణ స్వీకారానికి హాజరుకాలేదు. నేపాల్‌లో రాజకీయపరంగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంటోందని, దానికి ఇది సూచన అని విశ్లేషకులు చెబుతున్నారు.

51కి చేరిన మృతుల సంఖ్య..

జనరేషన్ జెడ్ యువత ఆందోళనలు, పోలీసుల కాల్పుల ఘటనల్లో మృతుల సంఖ్య 51కి చేరింది. ఇందులో కాఠ్మండూలో ఆందోళనలు జరిగిన ప్రధాన ప్రాంతాల్లో 34 మంది మరణించగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో మరో 17 మంది మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మొత్తంగా 1,700 మందికి పైగా గాయపడ్డారని, ప్రస్తుతం 700 మందికిపైగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని ప్రకటించారు. దేశవ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లు, ఇతర భద్రతా ఏర్పాట్లను పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు.

భారతీయుల బస్సుపై దాడి

కాఠ్మండూలోని పశుపతినాథ్ ఆలయానికి వెళ్లి వస్తున్న తెలుగువారి బస్సుపై ఆందోళనకారులు దాడి చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. కర్ఫ్యూతో నేపాల్‌లో చిక్కుకుపోయిన ఈ బస్సు.. గురువారం రాత్రి భారత్, నేపాల్ సరిహద్దుల్లోని సనౌలి వద్దకు చేరుకున్నాక బస్సులోని సిబ్బంది శ్యామూ నిషాద్ ఈ వివరాలు వెల్లడించారు. "9న పశుపతినాథ్ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్నాం. బస్సులో వృద్ధులు, మహిళలు, పిల్లలు సహా 49 మంది ఉన్నారు. మధ్యలో కొందరు ఆందోళనకారులు మా బస్సుపై రాళ్లు రువ్వారు. కిటికీల అద్దాలు పగిలి ఎనిమిది మందికి గాయాలయ్యాయి. నేపాల్ ఆర్మీ వచ్చి మాకు సాయం చేసింది" అని తెలిపారు.

హోటల్ నాలుగో అంతస్తు నుంచి దూకి..

నేపాల్ ఆందోళనల్లో భారత మహిళ ఒకరు చనిపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన రాజేశ్ గోలా, ఆమె భర్త రామ్‌వీర్ సింగ్ గోలా కలిసి ఈ నెల 7న నేపాల్ పర్యటనకు వెళ్లారు. కాఠ్మండూలోని హయత్ రెసిడెన్సీ హోటల్‌లో బస చేశారు. ఈ నెల 9న ఆందోళనకారులు ఆ హోటల్‌కు నిప్పుపెట్టారు. సహాయక బృందాలు అక్కడికి చేరుకుని హోటల్‌లో చిక్కుకున్నవారిని కాపాడే ప్రయత్నం చేశాయి. ఈ క్రమంలో హోటల్ నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకిన రాజేశ్ గోలాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆమె భర్త కూడా గాయపడినా ప్రాణాలతో బయటపడ్డారు.

హోటల్ రంగానికి రూ.2,500 కోట్ల నష్టం

జనరేషన్ జెడ్ ఆందోళనలు, అనంతర పరిస్థితులతో నేపాల్‌లోని హోటల్ రంగానికి రూ.2,500 కోట్ల నష్టం వాటిల్లినట్టు హోటల్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ (హన్) అంచనా వేసింది. చాలా హోటళ్లు తీవ్రంగా ధ్వంసమయ్యాయని.. కాఠ్మండూలోని ప్రముఖ హిల్టన్ హోటల్‌ను ఆందోళనకారులు తగలబెట్టడంతోనే రూ.800 కోట్ల నష్టం కలిగిందని పేర్కొంది.


కాల్పుల్లో మృతిచెందిన యువకుడికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

'డిస్కార్డ్' యాప్‌తో తాత్కాలిక ప్రధాని ఎంపిక!

నేపాల్‌లో ప్రభుత్వాన్ని పడగొట్టిన 'జనరేషన్ జెడ్' యువత.. తమ తరానికి తగినట్టే తాత్కాలిక ప్రధానిని ఆన్‌లైన్‌లో ఎంచుకున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడే వారికి సంబంధించి 'డిస్కార్డ్' చాటింగ్ యాప్‌ను వేదికగా చేసుకున్నారు. తాత్కాలిక ప్రధాని ఎవరైతే బాగుంటుందనే దానిపై లక్ష మందికిపైగా యువత ఈ యాప్‌లో వాడివేడి చర్చలు జరిపి, పోల్స్ నిర్వహించి.. చివరికి మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి పేరును ఖరారు చేశారు. దీనిపై సిద్ ఘిమిరి అనే కంటెంట్ క్రియేటర్ మాట్లాడుతూ.. "నేపాల్ పార్లమెంటు ప్రస్తుతం డిస్కార్డ్‌లోనే ఉంది" అని వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ అంశాలతో న్యూయార్క్ టైమ్స్ కథనాన్ని ప్రచురించింది. నిజానికి డస్కార్డ్ చాట్ యాప్ 2015లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం దీనికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 2.5 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. ఇందులో ఏదైనా చానల్ సృష్టించి.. ఒకేసారి లక్షల మంది చాట్ చేయడానికి వీలుంటుంది.


కాఠ్మండూలో పూర్తిగా దహనమైన హిల్టన్ హోటల్


శ్రీకాంత్‌రెడ్డిని కత్తితో పొడుస్తున్న ధన్‌రాజ్

రియల్ ఎస్టేట్ వ్యాపారి
దారుణ హత్య

- తెలిసిన వ్యక్తే నడిరోడ్డుపై పొడిచి చంపిన వైనం
- హైదరాబాద్ కుషాయిగూడలో ఘోరం


శ్రీకాంత్(ఫైల్)

ఏఎస్‌రావునగర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇద్దరూ ఒకరికొకరు తెలిసినవారే! కానీ.. వ్యాపార, ఆర్థిక లావాదేవీల్లో విభేదాల కారణంగా వారిలో ఒకరు మరొకరిని నడిరోడ్డుపై పొడిచి పొడిచి చంపాడు! హైదరాబాద్‌లోని కుషాయిగూడ హెచ్‌బీ కాలనీలో శుక్రవారం జరిగిందీ దారుణం. ఆ కాలనీకి చెందిన పి.శ్రీకాంత్‌రెడ్డి (45)... రియల్ ఎస్టేట్‌తోపాటు ఫైనాన్స్ వ్యాపారం కూడా చేసేవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిత్యం తన వెన్నంటి ఉండే ధన్‌రాజ్ (40) అనే వ్యక్తితో శ్రీకాంత్‌రెడ్డికి కొంతకాలంగా విభేదాలున్నాయి. అవి ఒకరిపై ఒకరు కక్ష పెంచుకునే స్థాయికి చేరుకున్నాయి. ఆ విభేదాలను పరిష్కరించుకునేందుకు ఇద్దరూ మంగాపురంలోని శ్రీకాంత్‌రెడ్డి కార్యాలయంలో కలుసుకుని.. మద్యం తాగారు. మత్తులో మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య బాగా గొడవ జరిగినట్టు సమాచారం. వాగ్వాదం కాస్తా కొట్టుకునేదాకా వెళ్లి ఇద్దరూ పెనుగులాడుతూ కార్యాలయంలోంచి బయటకు వచ్చారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం తనతో తెచ్చుకున్న కత్తిని బయటకు తీసిన ధన్‌రాజ్.. దాంతో శ్రీకాంత్‌రెడ్డిని విచక్షణరహితంగా పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. అడ్డుకోబోయిన ఓ వ్యక్తిని సైతం బెదిరించాడు. అనంతరం శ్రీకాంత్‌రెడ్డి చనిపోయాడని భావించి అక్కడి నుంచి పారిపోయాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డిని సీపీఆర్ చేసి కాపాడే ప్రయత్నం చేసినా ఉపయోగం లేకుండా పోయింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న కుషాయిగూడ పోలీసులు జరిగిన ఘటనపై ఆరా తీశారు. శ్రీకాంత్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు ధన్‌రాజ్‌ను మౌలాలి జడ్‌టీఎస్ చౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలే ఈ హత్యకు కారణమని ప్రాథమికంగా గుర్తించినట్టు తెలిపారు. కాగా.. షాపింగ్ వెళ్దామని శ్రీకాంత్‌రెడ్డి తన భార్య అపర్ణకు ఫోన్ చేయగా.. పిల్లలకు పరీక్షలు ఉన్నాయని తర్వాత వెళ్దామని ఆమె చెప్పినట్టు సమాచారం. దీంతో ఆయన తన కార్యాలయంలోనే ఉండిపోయారని.. షాపింగ్‌కు వెళ్లి ఉంటే ఇలా హత్యకు గురయ్యేవారు కాదని స్థానికులు పేర్కొంటున్నారు.

15 నుంచి ఉన్నత విద్యాసంస్థల బంద్!

(మొదటిపేజీ తరువాయి)

కూడా ప్రభుత్వం విడుదల చేయలేదని వారు గుర్తు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో సర్కారుపై భారం పడకుండా తాము ట్రస్టు బ్యాంకు లాంటి ఇతర ప్రత్యామ్నాయాలను చూపించినా.. ప్రభుత్వం నుంచి స్పందన లేదని పేర్కొన్నారు. బకాయిలు భారీగా పేరుకుపోవడంతో కాలేజీల నిర్వహణ భారంగా మారిందని, సిబ్బంది జీతభత్యాలకు కూడా యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఈ నెల 15న నిర్వహిస్తున్న 'ఇంజనీర్స్ డే' రోజు నుంచి తమ సమ్మె ప్రారంభమవుతుందని ప్రకటించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నామని సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌బాబు, సెక్రటరీ జనరల్ కెఎస్ రవికుమార్, కె.సునీల్‌కుమార్, కె.కృష్ణారావు తెలిపారు.

సరైన సమయం కాదు.. సీఎంతో మాట్లాడతా

ఉన్నత విద్యాసంస్థల బంద్‌కు సంబంధించి యాజమాన్య సంఘాల ప్రతినిధులు శుక్రవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాను కూడా కలిసి నోటీసు అందజేశారు. ఇప్పటివరకు చాలా వేచి చూశామని, ఈ నెల 15 నుంచి పూర్తిస్థాయిలో బంద్ పాటిస్తామని చెప్పారు. దీంతో.. సమ్మెకు ఇది సరైన సమయం కాదని యోగితా రాణా అన్నారు. విడతల వారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. మరోవైపు ఈ విషయంపై చర్చలకు రావాల్సిందిగా ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కళాశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధులను ఆహ్వానించారు. శనివారం ఉదయం 10 గంటలకు వారితో నరేందర్‌రెడ్డి చర్చలు జరపనున్నారు.

బకాయిల కోసం మూడేళ్లుగా నిరీక్షణ

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం ఇంజనీరింగ్, ఫార్మా, పాలిటెక్నిక్ తదితర వృత్తి విద్యా కళాశాలలు మూడేళ్ల నుంచి ఎదురుచూస్తున్నాయి. గతంలో ఒకసారి ఈ బకాయిలలో కొంత తగ్గించి, ఒకేసారి సెటిల్‌మెంట్ చేస్తామనే ప్రస్తావన వచ్చింది. ఆ తరువాత కూడా దీనిపై కొన్నిసార్లు చర్చలు జరిగాయి. అయినా బకాయిలు మాత్రం విడుదల కాలేదు. మరోవైపు కొన్ని ఇంజనీరింగ్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇచ్చే సమయంలో ఫీజు బకాయిలు చెల్లించాల్సిందేనని షరతులు విధిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వచ్చిన తరువాత మీ డబ్బులు మీకు తిరిగి ఇచ్చేస్తామని విద్యార్థులతో అంటున్నాయి. ఇటీవలి కాలంలో ఇదే విషయంపై నల్లగొండలోని ఓ ఫార్మా కళాశాలకు చెందిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మానవ హక్కుల సంఘాన్ని కూడా ఆశ్రయించారు. దానికి స్పందించిన మానవ హక్కుల సంఘం ఈ చర్య విద్యార్థుల హక్కులను కాలరాయడమేనని హెచ్చరించింది. ఇదిలా ఉండగా.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకపోవడం వల్ల అధ్యాపకులకు జీతాలు కూడా ఇవ్వలేకపోతున్నామని, కళాశాల నిర్వహణ భారంగా మారిందని సదరు కళాశాలలు పేర్కొంటున్నాయి. కాగా, జీతాలు ఇవ్వకపోవడంతో కొందరు అధ్యాపకులు బోధనను అంతగా సీరియస్‌గా తీసుకోవడం లేదనే వాదన వినిపిస్తోంది. దాంతో బోధనలో నాణ్యత తగ్గుతోందని, తర్వాతి కాలంలో విద్యార్థులు ఉద్యోగాలు సంపాదించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బకాయిలన్నీ ఒకేసారి కాకపోయినా.. దశల వారీగా విడుదల చేసినా కళాశాల నిర్వహణకు కొంత వెసులుబాటుగా ఉంటుందని యాజమాన్యాలు అంటున్నాయి.

సినీఫక్కీలో దారిదోపిడీ.. 40 లక్షలు చోరీ

ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి కారుతో ఢీకొట్టిన దుండగులు

- లోపలున్నవారిపై కారం చల్లి.. డమ్మీ పిస్తోలు, కత్తులతో బెదిరించి దోపిడీ
- పారిపోయే క్రమంలో బోల్తాపడ్డ వారి కారు.. లోపలున్న నలుగురూ పరార్
- రంగారెడ్డి జిల్లా కొత్తపల్లిలో ఘటన

శంకర్‌పల్లి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు.. నలుగురు దుండగులు సినీఫక్కీలో దారిదోపిడీకి పాల్పడి రూ.40 లక్షలు దోచుకున్నారు! అనంతరం అక్కణ్నుంచీ పారిపోయే క్రమంలో వారి కారు బోల్తాపడింది. లోపలున్న నలుగురు దుండగులూ పరారయ్యారు. రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన రాకేశ్ అగర్వాల్ స్టీల్ వ్యాపారి. వికారాబాద్‌లో ఉన్న తన కస్టమర్ వద్ద నుంచి రూ.40 లక్షలు తీసుకురావాలం టూ.. ఆయన తన డ్రైవర్ మధును, నమ్మకస్తుడైన సాయిబాబా అనే మరో వ్యక్తిని శుక్రవారం ఉదయం కారులో పంపించాడు. వారిద్దరూ వికారాబాద్‌లో కస్టమర్ ఇచ్చిన సొమ్ముతో తిరుగు ప్రయాణమయ్యారు. అయితే.. నలుగురు దుండగులు మరో కారులో (టీఎస్ 11 ఈఎల్ 8817) వారిని వెంబడించారు. మధ్యాహ్నం 1:30గంటల సమయం లో శంకర్‌పల్లి మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ గ్రామ శివారులోకి రాగానే.. మధు, సాయిబాబా ఉన్న కారు ను వెనుక నుంచి ఢీకొట్టారు. వారి కారు ఆగగానే.. ముగ్గురు వ్యక్తులు ముఖాలకు మాస్క్ ధరించి వచ్చి డ్రైవర్ మధు కళ్లలో కారం చల్లి, వెనుక వైపు కారు అద్దం పగలగొట్టి.. లోపల కూర్చున్న సాయిబాబాపై దాడి చేశారు. డమ్మీ పిస్తోల్‌తో బెదిరించి అతడి వద్ద ఉన్న రూ.40 లక్షల నగదు సంచిని లాక్కుని తమ కారులో అక్కణ్నుంచి వెళ్లిపోయారు. కానీ.. నాలుగు కిలోమీటర్ల దూరం వెళ్లిన తర్వాత కొత్తపల్లి గ్రామంలోకి రాగానే దుండగుల కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి బోల్తాపడింది. వెంటనే దుండగులు కారులో నుంచి బయటకు వచ్చి.. కారును అక్కడే వదిలి రూ.40 లక్షల డబ్బు ఉన్న బ్యాగ్ తీసుకొని అక్కణ్నుంచీ వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. కారు బోల్తా పడిన శబ్దం విని అక్కడికి చేరుకున్న స్థానికులు ఏమైందని అడగ్గా.. తమపై ఎవరో దాడి చేసేందుకు వెంటపడుతున్నారని చెబుతూ అక్కడి నుంచి దుండగులు పారిపోయారు. వారి తీరుతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని కారును పరిశీలించగా.. అందులో రూ.8.71 లక్షల నగదు, డమ్మీ పిస్తోలు, కత్తి, కారంపొడి, మద్యం బాటిల్ లభ్యం అయ్యాయి. కాగా.. దారి దోపిడీ గురించి తెలుసుకున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, నార్సింగి, చేవెళ్ల ఏసీపీలు రమణగౌడ్, కిషన్ గౌడ్‌లు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దుండగులను పట్టుకునేందుకు సీసీఎస్, ఎస్‌వోటీ పోలీసులతో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు ముమ్మరం చేశారు.


రంగారెడ్డి జిల్లా కొత్తపల్లి గ్రామం వద్ద బోల్తా పడ్డ దొంగల కారు

గద్వాల్ చారిత్రక వారసత్వాన్ని నిలబెడతా!

- టీటీడీ బ్రహ్మోత్సవాలకు ఏరువాడ జోడు పంచెలు
- దేవీ నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక వేడుకలు
- పూర్వీకుల ఆదర్శాలను పునరుద్ధరిస్తాం
- గద్వాల్ సంస్థానం మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ముని మనుమడు కృష్ణ రామ భూపాల్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఘనమైన చరిత్రకు ఆలవాలం గద్వాల్ సంస్థానం.. 400 వసంతాల చారిత్రక వారసత్వ, సాంస్కృతిక సంపదను పరిరక్షిస్తానని జీవీకే కూతురు కొడుకు- గద్వాల్ సంస్థానం వారసుడు కృష్ణ రామ భూపాల్ తెలిపారు. కొన్ని వందల ఏళ్లుగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బ్రహ్మోత్సవాల్లో శ్రీవేంకటేశ్వర స్వామికి గద్వాల్ సంస్థానం ఏరువాడ జోడు పంచెలు సమర్పిస్తోంది. ఈ ఏడాది నుంచి ఈ సంప్రదాయాన్ని ఆచరిస్తున్నట్లు కృష్ణ రామ భూపాల్ చెప్పారు. సంస్థానం చివరి పాలకురాలు మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ముని మనుమడే రామకృష్ణ భూపాల్. గద్వాల్ వారసత్వ, సాంస్కృతిక సంపద పరిరక్షణలో భాగంగా తన పూర్వీకులు నిర్మించిన ఆలయాలన్నింటినీ సందర్శించి వాటి స్థితిగతులు తెలుసుకుంటానన్నారు. తరతరాల ఆచారం ప్రకారం దేవీ నవరాత్రుల వేళ జోగులాంబ అమ్మవారికి గద్వాల్ చీరను సమర్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర దేవాదాయశాఖ సహకారంతో పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో అలంపూర్-జోగులాంబ ఆలయ ప్రాంగణంలో గుడి సంబురాలు నిర్వహిస్తామన్న రామ భూపాల్.. ఈ వేడుకలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. తద్వారా తమ పాలకులు ఆచరించిన సంస్కృతి, సంప్రదాయాలతోపాటు ఆధ్యాత్మిక, సాహిత్య కళా రంగాలకు వారు అందించిన సేవల పునరుద్ధరణకు కృషి చేస్తానని కృష్ణ రామ భూపాల్ తెలిపారు. తన పూర్వీకుల ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తానని నొక్కి చెప్పారు.

'జీఎస్టీ హేతుబద్ధీకరణ'

నష్టంపై నివేదిక ఇవ్వండి

- వాణిజ్య పన్నులపై సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల హేతుబద్ధీకరణతో రాష్ట్రానికి వాటిల్లే ఆదాయ నష్టంపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖ పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ నూతన పన్నురేట్లు ఈ నెల 22 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయని, దీని ప్రభావం రాష్ట్రంపై ఎలా ఉంటుందనేది క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని చెప్పారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడే ప్రమాదం ఉందన్నారు. పన్ను ఎగవేతదారుల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

సమ్మక్క-సారలమ్మ ఆలయ మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

- గిరిజన సంస్కృతి ప్రకారమే ఆధునీకరణ పనులు: పొంగులేటి

సమ్మక్క-సారలమ్మ దేవాలయాన్ని గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఆధునీకరణను చేపడుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆధునీకరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు బలరామ్ నాయక్‌తో కలిసి మంత్రి పొంగులేటి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు.

నా మాటలు వక్రీకరించారు: మంత్రి జూపల్లి

హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ మేరకు వివరణ ఇచ్చారు. "పోటీ చేసిన సందర్భంలో ఎవరు గెలుస్తరో తెలియదు. గెలిచిన పార్టీ అధికారంలోకి వస్తుందో రాదో తెలియదు. అధికారంలోకి వచ్చినా హామీలను నెరవేరుస్తామో లేదో తెలియదు. కాబట్టి నేను ఎలాంటి హామీలు ఇవ్వను. నిజాయితీగా కష్టపడి పనిచేస్తాను. నేను ఎన్నికల ప్రచారంలో ఏనాడూ హామీలు ఇవ్వలేదు. గెలిచిన తర్వాత అన్ని పనులూ చేశాను. నేను చేసిన పనులు చూసే ప్రజలు నన్ను ఆరు సార్లు గెలిపించారు" అని మాత్రమే తాను చెప్పానన్నారు. సందర్భాన్ని వదిలేసి బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని జూపల్లి ఆరోపించారు. ఎవరెంత అసత్య ప్రచారం చేసినా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పదేళ్లు అధికారంలో ఉండడం ఖాయమని చెప్పారు. ప్రభుత్వం రేపో, మాపో కూలిపోతుందంటూ కేటీఆర్ ఏ ప్రాతిపదికన అన్నారని ఆయన ప్రశ్నించారు. ఎవరూ ఏ పార్టీలోనూ చేరలేదని, ఎవరైనా పార్టీ మారితే స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సున్నా వచ్చిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీ కనుమరుగవుతుందని జూపల్లి జోస్యం చెప్పారు.

పేట్లబురుజు ప్రభుత్వాసుపత్రిలో

సంతాన సాఫల్య సేవలు

- ఆస్పత్రి సూపరింటెండెంట్ టి. జయ

చార్మినార్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సంతానం లేని దంపతులకు పేట్లబురుజు ప్రభుత్వాసుపత్రి వరప్రదాయని అని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. జయ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. సంతానం లేని దంపతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంతాన సాఫల్య కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ఏప్రిల్ నుంచి పేట్లబురుజు ఆసుపత్రిలో ఈ సేవలు ప్రారంభించామని తెలిపారు. తమ ఐవీఎఫ్ సెంటర్‌కు 2,800 మంది పేర్లు నమోదు చేసుకోగా, వారిలో 98 మంది మహిళలకు చికిత్స విజయవంతమైందని చెప్పారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండకపోవచ్చని, అలాంటివారు పైసా ఖర్చు లేకుండానే ప్రభుత్వాసుపత్రుల్లో సంతాన సాఫల్య కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ టి. జయ అన్నారు.

లైంగిక వేధింపుల కేసు.. తహసీల్దారుకు రిమాండ్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి తహసీల్దార్ రవీందర్ నాయక్‌కు లైంగిక వేధింపుల కేసులో జిల్లా మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుక్రవారం రిమాండ్ విధించింది. జిల్లా కేంద్రంలోని అర్బన్ హౌజింగ్ కాలనీలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించింది. పట్టణంలోని అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గాను వార్డుకో తహసీల్దార్ స్థాయి అధికారితో పాటు పలువురు మున్సిపల్ అధికారులను ప్రభుత్వం నియమించింది. ఎంపిక ప్రక్రియలో భాగంగా కలిసి పనిచేసిన ఓ మహిళా ఉద్యోగిపై తహసీల్దార్ రవీందర్ నాయక్ అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి శుక్రవారం జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తహసీల్దార్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి జగిత్యాల మొదటి అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు.

తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

జ్యోతినగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ఎన్టీపీసీ నిర్మించ తలపెట్టిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్టీపీపీ)కు కేంద్రం నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించింది. 2,400 మెగావాట్ల సామర్థ్యం గల టీఎస్టీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇస్తూ గురువారం రాత్రి సర్క్యులర్ జారీ చేసింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రస్తుతం ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.

27,650 టన్నుల యూరియా

(మొదటిపేజీ తరువాయి)



నిజామాబాద్ రేక్ పాయింట్లకు చేరగానే... అవసరమున్న జిల్లాలకు సరఫరా చేస్తామని వెల్లడించారు. కాగా తుమ్మలతో ఇక్రిశాట్ ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో భేటీ అయ్యారు. చిక్కుళ్లు, తృణధాన్యాలు, మెరుగైన రకాలతోపాటు వివిధ రకాల పంటల్లో తాము అమలుచేస్తున్న వ్యవసాయ సాంకేతిక పద్ధతులను మంత్రికి వివరించారు. ఇక వ్యవసాయశాఖకు ప్రత్యేకంగా ఒక యాప్ తయారు చేసి, ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, పంటల యాజమాన్యం, రైతులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని అధికారులను తుమ్మల ఆదేశించారు. ఏఐ రంగంలో పనిచేస్తున్న సంస్థలతో కలిసి వృద్ధి చేయాలని సూచించారు. సచివాలయంలో నెదర్లాండ్స్‌కు చెందిన ఏఐ కంపెనీల ప్రతినిధులు తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ప్రత్యేక యాప్ అంశంపై వ్యవసాయశాఖ అధికారులను ఆదేశాలు జారీచేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం, విత్తనోత్పత్తిలో సాధించిన ప్రగతిని పరిశీలించటానికి వచ్చిన ఆఫ్రికన్ ప్రతినిధులు, ఆఫ్రికన్ సీడ్ ట్రేడ్ అసోసియేషన్ కార్యదర్శి, ఇతర ప్రతినిధులు... రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల భేటీ అయ్యారు. దేశంలో ఉత్పత్తి అయ్యే విత్తనాల్లో 60 శాతం తెలంగాణలోనే ఉత్పత్తి అవుతున్నట్లు తుమ్మల వారికి వివరించారు.



సీఎం రేవంత్‌రెడ్డితో బీఎన్ఐ ప్రతినిధులు

సీఎం రేవంత్‌ను కలిసిన బీఎన్ఐ ప్రతినిధులు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):సీఎం రేవంత్‌రెడ్డిని బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్(బీఎన్ఐ) సంస్థ హైదరాబాద్ ప్రతినిధులు అనిరుద్ కొణిజేటి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఎన్ఐ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో శంషాబాద్‌లో నిర్వహించే 'ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో' వివరాలను సీఎంకు వివరించారు.

బాసర నుంచి భద్రాచలం వరకూ..

శాశ్వత ఘాట్లు

రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలూ శాశ్వత ప్రాతిపదికనే..

- దక్షిణ భారత కుంభమేళాగా గోదావరి పుష్కరాలు నిర్వహిద్దాం
- ప్రధాన ఆలయాలు, అక్కడి ఘాట్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం
- గోదావరి పుష్కరాలపై సమీక్షలో అధికారులకు సీఎం రేవంత్ నిర్దేశం



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): "గోదావరి పుష్కరాలను దక్షిణ భారత కుంభమేళాగా నిర్వహించాలి. పరీవాహకంలోని 74 ఆలయాల్లోనూ పుష్కరాల నిర్వహణకు శాశ్వత ఏర్పాట్లు చేయాలి. పుష్కర ఘాట్లను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి. అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు తయారు చేయండి" అని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గోదావరి తీరం వెంట ఉన్న ప్రధాన ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని సూచించారు. రద్దీని అంచనా వేసుకొని పుష్కర స్నానాలు ఆచరించేందుకు వచ్చే లక్షలాదిమంది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని నిర్దేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శుక్రవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. "2027లో జూలై 23వ తేదీ నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి 22 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించాలి. అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం వెంట ఉన్న ధర్మపురి, కాళేశ్వరంతోపాటు అన్ని ప్రధాన ఆలయాలను మొదటగా అభివృద్ధి చేయాలి. ప్రధాన ఆలయాల వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అక్కడి పుష్కర ఘాట్ల అభివృద్ధిని తొలి ప్రాధాన్యంగా ఎంచుకోవాలి. ఆలయ అభివృద్ధితోపాటు శాశ్వత ఘాట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలి. రెండో ప్రాధాన్యంగా పుష్కర స్నానాలకు వీలుగా ఉండే తీర ప్రాంతాలను అభివృద్ధి చేయాలి. ఒకేరోజు రెండు లక్షల మంది భక్తులు స్నానాలకు వచ్చినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు ఉండాలి" అని సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు. రహదారుల నిర్మాణంతోపాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్, తాగునీరు, వసతి తదితర భక్తులకు అవసరమైన సదుపాయాలన్నీ ఉండేలా పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరీవాహకంలోని ఆలయాలన్నింటినీ క్షేత్రస్థాయిలో సందర్శించి, ఆలయ కమిటీలు, అధికారులతో చర్చించి.. అవసరమైన అభివృద్ధి పనుల జాబితాను తయారు చేయాలని చెప్పారు.

కేంద్రం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా జాబితా

బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం తదితర ఆలయాలన్నింటినీ సందర్శించి విడివిడిగా ప్రాజెక్టు రిపోర్టులు సిద్ధం చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రస్తుత పుష్కర ఘాట్లను విస్తరించడంతోపాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధికి డిజైన్లు రూపొందించాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, స్వచ్ఛ భారత్, జల్ జీవన్ మిషన్‌తోపాటు కేంద్ర పథకాలతో సమన్వయం ఉండే పనులను గుర్తించి, వాటికి అవసరమైన అనుమతులు తీసుకోవాలని నిర్దేశించారు. దక్షిణ భారత కుంభమేళాకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని కేంద్రం నుంచి స్పెషల్ ప్యాకేజీ కోరేందుకు వీలుగా ఈ పనుల జాబితాను సిద్ధం చేయాలని చెప్పారు. పుష్కరాల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా పర్యాటక, నీటి పారుదల, దేవాదాయ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమీక్షలో మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం మేడారం పర్యటన రద్దు

ములుగు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి ములుగు జిల్లా పర్యటన రద్దయింది. వాస్తవానికి సీఎం తాడ్వాయి మండలంలోని మేడారంలో జరుగుతున్న మహా జాతర పనులను శనివారం పర్యవేక్షించాల్సి ఉంది. కాగా, పర్యటన రద్దుకు గల కారణాలు అధికారికంగా వెల్లడికాలేదు. రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరుగుతున్న కాల్పులే కారణం కావచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనికితోడు సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల మార్పుపై జరుగుతున్న వివాదం కూడా పర్యటన రద్దుకు ఒక కారణంగా భావిస్తున్నారు.

15న కామారెడ్డిలో నిర్వహించాల్సిన

బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ వాయిదా

- భారీ వర్ష సూచన నేపథ్యంలో టీపీసీసీ నిర్ణయం
- సభ నిర్వహణ తేదీని మళ్లీ ప్రకటిస్తాం: మహేశ్‌గౌడ్



కామారెడ్డి/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించ తలపెట్టిన బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ వాయిదా పడింది. కామారెడ్డి సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయన్న వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో ఈ సభను వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సభను మళ్లీ ఎప్పుడు నిర్వహించేదీ త్వరలోనే ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు.. రెండు రోజులుగా కామారెడ్డిలోనే ఉంటూ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి సీతక్క సైతం ఇదే విషయాన్ని వెల్లడించారు. మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని కార్యకర్తలతో శుక్రవారం ఆమె సమావేశం కాగా, టీపీసీసీ నుంచి అందిన సమాచారం మేరకు సభ వాయిదా పడినట్లు తెలిపారు.

కేటీఆర్‌కు మాట్లాడే అర్హత లేదు: సీతక్క

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదని మంత్రి సీతక్క అన్నారు. ఎమ్మెల్యేల డీఎన్ఏపై కేటీఆర్ మాట్లాడడం సిగ్గు చేటన్నారు. గతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్న సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వచ్చారన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి బీసీలకు బీఆర్ఎస్ ఏం చేసిందని నిలదీశారు.

ఏం చెబుదాం!?

న్యాయ నిపుణులతో చర్చల్లో దానం, కడియం

- బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన నాగేందర్
- వరంగల్ లోక్‌సభలో కాంగ్రెస్ అభ్యర్థి తరపున శ్రీహరి ప్రచారం
- వివరణ ఇవ్వడంపై మల్లగుల్లాలు.. మరింత గడువు కోరిన ఎమ్మెల్యేలు

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నోటీసులు అందుకున్న పది మంది ఎమ్మెల్యేల్లో ఎనిమిది మంది స్పీకర్‌కు వివరణ ఇచ్చారు! పిలిచినప్పుడు హాజరై దానిపై వాదనలు వినిపించాలంటూ బీఆర్ఎస్‌కు స్పీకర్ కార్యాలయం నోటీసులూ ఇచ్చింది! కానీ, దానం నాగేందర్, కడియం శ్రీహరి ఇంకా న్యాయ నిపుణులతో చర్చల్లోనే ఉన్నారు. వివరణ ఇచ్చేందుకు స్పీకర్ నుంచి మరింత గడువు కూడా కోరారు. ఇందుకు కారణం లేకపోలేదు. మిగిలిన ఎనిమిది మందిదీ ఓ దారి అయితే.. వీరిద్దరిదీ 'రహదారి' కావడమే ఇక్కడ సమస్య. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ టికెట్‌పై గెలిచిన పదిమంది కాంగ్రెస్‌లో చేరారని, వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వారిని అనర్హులను చేయాలంటూ సుప్రీం కోర్టునూ ఆశ్రయించింది. బీఆర్ఎస్ ఫిర్యాదుపై మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని గత నెల 25న సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో చర్యలకు ఉపక్రమించిన స్పీకర్.. వివరణ ఇవ్వాల్సిందిగా పది మంది ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ చేశారు. వీరిలో దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మందీ స్పీకర్ కార్యాలయానికి వివరణ ఇచ్చారు. తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నామని వివరణ ఇచ్చిన వారు.. దానికి సంబంధించిన ఆధారాలూ సమర్పించారు. దాంతో, విచారణకు పిలిచినప్పుడు హాజరై.. ఆయా కేసుల్లో బీఆర్ఎస్ తరఫున వాదనలు చెప్పాలంటూ ఆ పార్టీకి స్పీకర్ కార్యాలయం నోటీసులు ఇచ్చింది కూడా. అయితే వివరణ ఇచ్చేందుకు స్పీకర్‌ను దానం, కడియం కొంత గడువు కోరారు. కాంగ్రెస్ పార్టీ కార్యాచరణలో వారు పాల్గొంచుకున్నట్లు స్పష్టమైన ఆధారాలున్న నేపథ్యంలో స్పీకర్‌కు ఇచ్చే వివరణపై న్యాయ నిపుణులతో వారు చర్చలు జరుపుతున్నారు. నిజానికి, బీఆర్ఎస్ టికెట్‌పై ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి మూడు రంగుల కండువా కప్పుకొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఇక, స్టేషన్ ఘన్‌పూర్ నుంచి బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన కడియం శ్రీహరి.. లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తన కుమార్తె కడియం కావ్య తరఫున బాహాటంగానే ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులకు 'ఏం చెప్పాలనే' అంశంపై వీరిద్దరూ న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నారు. ఇవి కొలిక్కి రావడానికి ఇంకాస్త సమయం పడితే.. స్పీకర్‌ను కలిసి మరికొంత గడువు కోరే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే, కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న శ్రీహరి ఇంటికే పరిమితమయ్యారని, కోలుకోగానే స్పీకర్‌కు ఇచ్చే వివరణపై దృష్టి పెడతారని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

సింగరేణిని బతికించుకోవడం తక్షణావసరం

సంస్థను కాపాడుకునే మార్గం కనుక్కోవాలి.. మీ సూచనల అమలుకు ప్రభుత్వం సిద్ధం

- కార్మిక సంఘాలతో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భావితరాల కోసం సింగరేణిని బతికించుకోవడం తక్షణ అవసరమని, ఈ సంస్థను పదికాలాల పాటు కాపాడుకునేందుకు ఏం చేయాలో ఆలోచించి మార్గం కనుక్కోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కార్మిక సంఘాలను కోరారు. సింగరేణి కార్మిక సంఘాలతో భట్టి సమావేశమయ్యారు. సింగరేణిలో పనిచేసే వారు సంస్థ గురించి విధానపరమైన నిర్ణయాలు తీసుకోకపోతే నష్టం జరుగుతుందన్నారు. మారిన ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో ఎక్కడ తక్కువ ధరకు బొగ్గు లభిస్తే అక్కడ కొనుక్కునే అవకాశం ఏర్పడిందని, ఈ నేపథ్యంలో సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు అమ్ముడుపోకపోతే అనర్థాలు జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అన్ని సంఘాలు సమావేశమై సింగరేణి భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కార్మిక సంఘాల సూచనల అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వాలు వస్తుంటాయ్.. పోతుంటాయ్.. సంస్థను బతికించుకునేందుకున్న అన్ని మార్గాలను అన్వేషించాలని సూచించారు. కార్మిక సంఘాలు అవగాహనలేకుండా మాట్లాడితే సంస్థకు నష్టం జరుగుతుందని సూచించారు. ఏం చేయాలనే దానిపై సింగరేణి అధికారులు.. కార్మికులకు వివరించాలన్నారు. దీనికోసం సగం రోజు సెలవు ఇచ్చి మరీ సమావేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, కార్మిక సంఘం నాయకులు ధర్మపురి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



భట్టికి వినతిపత్రమిస్తున్న జూలకంటి, గుమ్మడి నరసయ్య

'కాంట్రాక్ట్' వేతనాలు పెంచాలి : జేఏసీ

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచడంతోపాటు లాభాల వాటా కింద రూ.20 వేలు అందించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు భట్టి, ప్రణాళిక సంఘం ఉప చైర్మన్ చిన్నారెడ్డిలను జేఏసీ తరపున మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, గుమ్మడి నరసయ్య కలిసి వినతిపత్రమిచ్చారు. కాగా, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల సమస్యపై కార్మిక శాఖ మంత్రి జి.వివేక్‌ను ఎమ్మెల్సీ కోదండరామ్‌తో కలిసి జేఏసీ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో వేతనాల పెంపుపై త్వరలోనే జీవో జారీ చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

యాజమాన్యానిది మొండివైఖరి

సింగరేణి యాజమాన్యం మొండివైఖరి, సమస్యల పరిష్కారంలో కాలయాపన కారణంగా ప్రక్యూర్ సమావేశాన్ని బహిష్కరించినట్టు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(సింగరేణి గుర్తింపు సంఘం-ఏఐటీయూసీ) ప్రకటించింది. గతేడాది కాలంలో సింగరేణి సీఎండీతోపాటు డైరెక్టర్(పా)తో జరిగిన సమావేశంలో ఒప్పుకున్న అంశాలపైనా సర్క్యులర్ జారీ చేయకుండా కాలయాపన చేస్తున్నారని యూనియన్ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ పేర్కొన్నారు.

బొగ్గు గనుల వేలంలో పాల్గొంటాం

- దేశంలో ఇతర ఖనిజాల వేలం పాటలో కూడా..
- సింగరేణికి ప్రభుత్వం పచ్చజెండా
- 2 గనులు కోల్పోవడంతో రూ.60 వేల కోట్ల నష్టం: భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో బొగ్గు గనుల వేలం ఎక్కడ జరిగినా పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. బొగ్గు గనులే కాకుండా ఇతర మినరల్స్ వేలంలో కూడా పాల్గొంటామని చెప్పారు. సింగరేణిని ఆర్థికంగా ఆదుకునే ప్రయత్నం చేస్తామన్నారు. ప్రజల కోసం, ప్రజల అవసరాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో వేలం పాట ఆవశ్యకతపై భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కొద్ది మంది భావోద్వేగాలు సృష్టించి, వేలం పాటలో పాల్గొనకుండా సింగరేణిని, రాష్ట్రాన్ని నాశనం చేసే కుట్రలు చాలా కాలం పాటు చేశారని ఆక్షేపించారు. వేలంపాటలో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి రెండు పెద్దబ్లాకులతో పాటు వాటి ద్వారా వచ్చే రూ.60 వేల కోట్ల ఆదాయాన్ని కోల్పోయిందన్నారు. వేలంపాటలో పాల్గొనకపోతే ప్రైవేట్ సంస్థలకే మేలు జరుగుతోందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొత్తబ్లాకులు దక్కించుకోకపోతే 31 మిలియన్ టన్నులకు ఉత్పత్తి పడిపోతుందని, బొగ్గు బావులు మూతపడితే.. శాశ్వత ఉద్యోగులు 40వేల మంది, తాత్కాలిక ఉద్యోగులు 30వేల మంది రోడ్డున పడతారని చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పుతో దేశంలో ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలు బొగ్గు బ్లాకులు దక్కించుకోవాలంటే విధిగా వేలం ద్వారానే పాల్గొనాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సత్తుపల్లి, కోయగూడెం బ్లాకులు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయని, దీనివల్ల సింగరేణి 60 వేల కోట్లు, 15 వేల కోట్ల లాభాలను కోల్పోయిందన్నారు. దేశంలో ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు వేలంలో పాల్గొని.. గనులు దక్కించుకుంటున్నప్పుడు సింగరేణి పాల్గొంటే తప్పేమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం 38 గనుల్లో సింగరేణి బొగ్గు తవ్వకాలు చేపడుతోందని, రానున్న ఐదేళ్లలో 10 గనులు మూతపడనున్నాయన్నారు. ప్రస్తుతం ఏటా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తున్నామని, కొత్త బ్లాకులు రానట్లయితే ఉత్పత్తి సగానికి పడనుందన్నారు. కాగా ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 200 ఖనిజ బ్లాకులను వేలం వేయాలని ప్రణాళికను రూపొందించినట్లు గనులు, భూగర్భ వనరుల శాఖ తెలిపింది. సున్నపు రాయి, లేటరైట్, మాంగనీస్, క్వార్ట్జ్, గ్రానైట్, కలర్ గ్రానైట్, డోలమైట్, రోడ్డు మెటల్ తదితర 200 ఖనిజ బ్లాకులను వేలం వేయాలని నిర్ణయించినట్లు భట్టికి సమర్పించిన ఆదాయం, ప్రణాళికపై నివేదికలో పేర్కొంది. వాటిలో సున్నపురాయి,మాంగనీస్, బేస్ మెటల్‌కు సంబంధించిన 32 భారీ ఖనిజ బ్లాకులు ఉన్నాయి.

సింగరేణిలో ప్రతి కాంట్రాక్టుకూ

25% కమీషన్లు!

అందులో 10% వాటా కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోంది

ఈ అంశంపై సీఎం స్పందించాలి: కవిత

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో అవినీతి రాజ్యమేలుతోందని, ప్రతి కాంట్రాక్ట్‌కు 25శాతం కమీషన్లు ఇవ్వాల్సి వస్తోందని, అందులో 10 శాతం వాటా కాంగ్రెస్ పెద్దలకు వెళ్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. జాగృతి కార్యాలయంలో హెచ్ఎంఎస్, సింగరేణి జాగృతి (ఏబీ సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సింగరేణిలో అవినీతిపై సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తక్షణమే స్పందించాలన్నారు. లేదంటే ఈ విషయమై సీబీఐ, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. సింగరేణికి రూ.42వేల కోట్ల మేర బకాయిలు చెల్లించకుండా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తోందని ధ్వజమెత్తారు. లాభాల్లో ఉన్న సంస్థను నష్టాల్లోకి నెట్టే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. టీబీజీకేఎస్ నాయకులు అవినీతికి పాల్పడొద్దని గతంలోనే తాను హెచ్చరించినా.. పట్టించుకోలేదన్నారు. నిన్నటిదాకా ఆ సంఘం గౌరవాధ్యక్షురాలిగా తానే ఉన్నానని, కానీ.. అక్కడ జరిగిన అంశాలపై కచ్చితంగా మాట్లాడాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో హెచ్ఎంఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

వాహనాలన్నింటికీ రిఫ్లెక్టివ్ స్టిక్కర్ తప్పనిసరి

నిలిపి ఉన్న లారీని ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి!
ముందు వెళుతున్న వాహనం కిందకు
దూసుకెళ్లిన కారు.. నలుగురు దుర్మరణం!

ప్రమాదాల నివారణకు రవాణాశాఖ నిర్ణయం..రాత్రిపూట వాహనం కనిపించేలా స్టిక్కర్ ఉండాలి

అధీకృత సంస్థ నుంచే స్టిక్కర్లు కొనాలని ఉత్తర్వుల్లో ఆదేశం

..ఇటీవలి కాలంలో ఇటువంటి వార్తలు ఎక్కువయ్యాయి! రోడ్డు పక్కన నిలిపి ఉంచిన లేదా నెమ్మదిగా వెళుతున్న వాహనం దగ్గరకు వచ్చే వరకూ కనిపించకపోవడంతో జరిగే ప్రమాదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలోనే ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ద్విచక్ర వాహనాలు కావచ్చు.. సరుకు రవాణా చేసే భారీ వాహనాలు కావచ్చు.. అన్నిటికీ వెనక రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లను అతికించడం తప్పనిసరి చేసింది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికా్‌సరాజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాత్రి వేళల్లో ముందు వెళ్లే వాహనాలు స్పష్టంగా కనిపించడమే ధ్యేయంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రమాదాలనివారణ చర్యల్లో భాగంగా నిబంధనలను మరింత కఠినంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాలనూ పక్కాగా అమలు చేయనున్నామన్నారు. రిఫ్లెక్టింగ్ స్టిక్కర్ల వాడకాన్ని తప్పనిసరిగా అమలు చేసేందుకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని,రాత్రి వేళ వాహనం, దాని మూలలు స్పష్టంగా కనిపించేలా ఈ స్టిక్కర్ ఉండాలని వివరించారు. రిఫ్లెక్టర్ల పరిశీలనకు రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మార్కెట్‌లోకి కొత్తగా వస్తున్న వాహనాల వెనక స్టిక్కర్లను ఏర్పాటు చేస్తున్నారని, పాత వాహనాలు తప్పనిసరిగా స్టిక్కర్‌ను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, సరుకు రవాణా వాహనాలు, మోటారు క్యాబ్‌లు, ఆటోలు, ఓమ్నీ బస్సులు, హైడ్రాలిక్ ట్రాలర్లు తదితర అన్ని వాహనాలకు వెనక భాగంలో ఇకపై రిఫ్లెక్టింగ్ స్టిక్కర్లు తప్పనిసరి చేశారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు, నంబరు ప్లేట్లు ఏఐఎస్ 057, 090, 089 నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని, వీటిని తనిఖీ చేయడానికి క్యూఆర్ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, రవాణా శాఖ అధీకృత సంస్థలు మాత్రమే వీటిని సరఫరా చేయాలని ఉత్తర్వుల్లో నిర్దేశించారు. వాహన యజమానులందరూ ఈ నిబంధనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. - ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

నేడు, రేపు భారీ వర్షాలు


(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించింది. కాగా, గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో అత్యధికంగా 22 సెంటీమీటర్లు, ములుగు జిల్లా మల్లంపల్లిలో 21.7, కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలిపింది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం గ్రామంలోని మోడల్ స్కూల్ ముంపునకు గురైంది. దీంతో పాఠశాల వసతి గృహంలో ఉన్న విద్యార్థులు, సిబ్బంది శుక్రవారం ఉదయం అక్కడి నుంచి బయటికి వచ్చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పెద్దంపేట శివారులోని గోదావరి ప్రాంతంలో గురువారం రాత్రి పిడుగులు పడగా.. ఆరు మందలకు చెందిన 94 గొర్రెలు మరణించాయి. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన వంగూరు వెంకన్న ఇంటిపై గురువారం రాత్రి క్షణాల వ్యవధిలో రెండు పిడుగులు పడ్డాయి. దీంతో వెంకన్న భార్య వెంకటమ్మ సొమ్మసిల్లి పడిపోయారు. ఆ ఇంటి పైకప్పుపై రెండు చోట్ల బీటలు పడ్డాయి. ఇక, హైదరాబాద్‌లో రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో పరవళ్లు తొక్కుతోంది. దీంతో మూసీ పరివాహక ప్రాంతాల్లోని లోలెవల్ బ్రిడ్జిలపై రాకపోకలను ఆపేశారు. కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కురిసిన వర్షాలకు మానేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు వంతెన వద్ద మానేరు ప్రవాహం ఒక్కసారి పెరిగిపోగా.. ఇసుక తరలింపునకు వచ్చిన 4ట్రాక్టర్లు చిక్కుకుపోయాయి. వాటితోపాటు నలుగురు డ్రైవర్లు చిక్కుకుపోగా వెంటనే స్పందించిన పోలీసులు తాళ్ల సాయంతో వారిని రక్షించారు. కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యామ్‌లోకి వరద పెరగడంతో 36వేల క్యూసెక్కులను వదిలి పెడుతున్నారు.



పెద్దపల్లి జిల్లాలోని ఓడేడు వంతెన వద్ద మానేరు ప్రవాహంలో ఇసుక ట్రాక్టర్లు

కాగా, నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుంచి 1,00,979 క్యూసెక్కుల వరద వస్తుండగా ఆరు గేట్లు తెరిచి ఆ నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 589.90 అడుగులుగా (311.7462టీఎంసీలు)గా నమోదైంది. ఎగువ నుంచి వరద రాక తగ్గటంతో ఈ నెల 10వ తేదీన గేట్లు మూసివేశారు. గురువారం అర్ధరాత్రి తర్వాత వరద పెరగడంతో మళ్లీ గేట్లు తెరిచారు. ఈ నీటి సంవత్సరంలో సాగర్ గేట్లు తెరవడం ఇది నాలుగో సారి. కాగా, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 88.478 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా 12 గేట్ల ద్వారా 64,884 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతున్నారు.



నాగార్జునసాగర్ 6 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

పోలీసు సాయం.. నిలిచిన ప్రాణం

సాయం కోసం పిలుపు అందిన వెంటనే పోలీసులు స్పందించడంతో వరద నీటి ప్రవాహంలో చిక్కుకున్న ఓ వ్యక్తి ప్రాణం నిలిచింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్ గ్రామ శివారులోని తాళ్లవాగు ప్రవాహంలో చిక్కుకొని వాగు కల్వర్టుపై ఇరుక్కుపోయిన ఓ ద్విచక్రవాహనాదారుడిని పోలీసులు రక్షించారు. ఇందుకు సంబంధించిన వివరాలి ఉన్నాయి. గోపాల్‌పూర్‌కు చెందిన గాజుల రాకేష్. హుజురాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో పని చేస్తుంటాడు. హుజురాబాద్ నుంచి గురువారం అర్ధరాత్రి తన మోపెడ్‌పై గోపాల్‌పూర్‌కు బయలుదేరిన రాకేష్. మార్గమధ్యలో తాళ్లవాగు కల్వర్టుపై ఇరుక్కుపోయాడు. తాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ ఇంటికి వెళ్లిపోవాలనే ఆత్రుతతో కల్వర్టు దాటేందుకు యత్నించాడు. కానీ, ప్రవాహ తీవ్రతకు అదుపు తప్పి వాహనంపై నుంచి కిందపడ్డ రాకేష్.. కల్వర్టు స్తంభాలను గట్టిగా పట్టుకున్నాడు. ఆపై, సాయం కోసం ఆపకుండా కేకలు వేశాడు. కల్వర్టు సమీపంలో నివసించే ఓ వ్యక్తి ఆ కేకలు విని 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రాకేష్‌ను తాళ్ల సాయంతో సురక్షితంగా ఒడ్డుకి చేర్చారు. మొత్తంగా అరగంటకు పైగా రాకేష్ నరకయాతన పడ్డాడు.

తెలంగాణ సాధనలో కేసీఆర్‌ది ఒక పాత్ర మాత్రమే

» **బీఆర్ఎస్ హయాంలో భయంతో ఉద్యమకారుల మౌనం: కోదండరాం**

కవాడిగూడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధనలో కేసీఆర్‌ది ఒక పాత్ర మాత్రమేనని, ఆయన వల్లే రాష్ట్రం వచ్చిందనేది అంగీకరించే విషయం కాదని ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ ఉద్యమకారులు భయంతో నోరు ఎత్తలేకపోయారని ఆయన విమర్శించారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, అందుకోసం ఉమ్మడి కార్యచరణ రూపొందించాలని కోదండరాం పేర్కొన్నారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో కోదండరాం, హరగోపాల్, గాలి వినోద్‌కుమార్, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్‌యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. ఉద్యమకారుల డిమాండ్ల సాధన కోసం అందరూ ఒకే వేదికపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. 15న జన సమితి రాష్ట్ర కార్యాలయంలో ఉద్యమకారుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి కార్యచరణ రూపొందించి ముందుకు సాగుదామన్నారు. హరగోపాల్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. ఒక వ్యక్తి తెలంగాణ తీసుకువచ్చారని ప్రచారం చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. అందరి పోరాటాల వల్లనే తెలంగాణ ఆవిర్భవించిందని ఆయన స్పష్టం చేశారు. సౌత్‌ఇండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్ గాలి వినోద్‌కమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ భూకబ్జాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ మరో 500మంది కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వడానికి కార్యచరణ ప్రణాళిక సిద్ధంగా ఉన్నదని చెప్పారు.



బ్యాంకులో క్యాషియర్ గదిలోకి వెళుతున్న బాలుడు

బ్యాంకులో 5 లక్షలు కాజేసిన బాలుడు!

బోధన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్బీఐ)లో చోరీ జరిగింది. ఈ నెల 8న బ్యాంకులో రూ.5 లక్షలు చోరీకి గురైనట్లు క్యాషియర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో భాగంగా బ్యాంకులోని సీసీ కెమెరాల ఫుటేజీని చూసిన పోలీసులు విస్తుపోయారు. ఓ బాలుడు ఈ చోరీ చేసినట్లు గుర్తించారు. బ్యాంకులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరగ్గా.. బాలుడు నగదు కౌంటర్ వైపు వెళ్లాడు. ఆ బాలుడే రూ.5 లక్షలు చోరీ చేసినట్లు నిర్ధారించామని పోలీసులు చెబుతున్నారు. అతనికి సహకరించిన వారికోసం సీసీ ఫుటేజీల ద్వారా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. ఈ విషయంపై పట్టణ సీఐని వివరణ కోరగా.. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

9999 @ 25.50 లక్షలు!

» **ఆన్‌లైన్ వేలంలో దక్కించుకున్న హెటెరో డ్రగ్స్ లిమిటెడ్**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫ్యాన్సీ నెంబర్ల వేలంతో రవాణా శాఖకు భారీగా ఆదాయం సమకూరింది. ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి సంబంధించిన ఆన్‌లైన్ వేలంలో టీజీ09 జీ 9999 నెంబరు రికార్డు స్థాయిలో రూ.25,50,200 పలికింది. హెటెరో డ్రగ్స్ లిమిటెడ్ ఇటీవల కొనుగోలు చేసిన ఓ వాహనం కోసం ఈ నెంబరును తీసుకున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ చిదుర పేర్కొన్నారు. టీజీ09 హెచ్ 0009 నెంబరును రూ.6,50,009కు ఏఆర్ఎల్ టైర్స్ లిమిటెడ్, టీజీ09 హెచ్ 0001 నెంబరును రూ.6,25,999కి డాక్టర్ రాజేశ్వరీస్ స్కిన్ అండ్ హెయిర్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్, టీజీ09 హెచ్ 0006 నెంబరును ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ రూ.5,11,666కు దక్కించుకున్నాయి. టీజీ09 హెచ్ 0005 నెంబరును శృంగవరపు వెంకటేశ్వరరావు రూ.2.22 లక్షలకు, టీజీ09 హెచ్ 0007ను పోచ విజయ రూ.1,51,999కు వేలంలో కొనుగోలు చేశారు. టీజీ09 హెచ్ 0099 నెంబరు రూ.1,30,999, టీజీ09 జీ 9990 నెంబరు రూ.1.22 లక్షలు, టీజీ09 హెచ్ 0027 నెంబరు రూ.1,04,999, టీజీ09 హెచ్ 0234 రూ.1,01,234కు దక్కించుకున్నారు. టీజీ09 సిరీస్‌లోని ఫ్యాన్సీ నెంబర్ల వేలంతో సంస్థకు రూ.63,77,361 ఆదాయం వచ్చిందని రమేష్ తెలిపారు.

వైద్య విద్య ప్రవేశాల మెరిట్ జాబితా విడుదల

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కన్వీనర్ కోటాలో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థుల ప్రొవిజనల్ జాబితాను కాళోజీ నారాయణ రావు ఆరోగ్య విశ్వవిద్యాలయం శుక్రవారం విడుదల చేసింది. ఈ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 14లోగా తెలియజేయాలని తెలిపింది. మొత్తం 16,620 విద్యార్థులతో కూడిన మెరిట్ జాబితాను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచింది. దరఖాస్తు చేసుకున్న వారిలో 1,020మంది విద్యార్థులను స్థానికేతరులుగా పేర్కొంటూ మరో జాబితా విడుదల చేసింది.

అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ, పీజీ, డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో చేరడానికి ప్రవేశ గడువును సెప్టెంబరు 26 వరకు పొడిగించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం అధికారులు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పూర్తి సమాచారం కోసం విశ్వవిద్యాలయ హెల్ప్ డెస్క్ నంబర్లు 040-23680333/444/555, టోల్ ఫ్రీ నంబరు 18005990101లో సంప్రదించాలని సూచించారు.

జీఎస్టీ స్కామ్ గుట్టు రట్టు

» **హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఈడీ సోదాలు**

» **కోట్లాది రూపాయల ఐటీసీని క్లెయిమ్ చేసిన ఎంఎన్‌సీలు**

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను (జీఎస్టీ)కు సంబంధించి కోట్లాది రూపాయల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను పొందిన పలు బహుళ జాతి కంపెనీల(ఎంఎన్‌సీ) గుట్టును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రట్టు చేసింది. దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న ఈ కుంభకోణాన్ని అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఇటానగర్ కార్యాలయ అధికారులు బయటపెట్టారు. ఈశాన్య రాష్ట్రాల్లోని 10 ప్రదేశాలతో పాటు ఢిల్లీ, హరియాణ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ సోదాలు నిర్వహించగా.. కోట్లాది రూపాయల వరకు అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించారు. ఈమేరకు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం(పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేశారు. అసోంలోని గువాహటిలో గల అమిత్ ట్రేడర్స్ సంస్థ పాల్పడిన అక్రమాలపై శోధించగా.. ఇలాంటి బాగోతాలు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉన్నట్లు గుర్తించారు. అసలు గువాహటిలో ఆ సంస్థ పేర్కొన్న అడ్రస్‌లో లేదని, తప్పుడు అడ్రస్ పేర అక్రమానికి పాల్పడినట్లు తేలిందని ఈడీ వివరించింది. ఈ కంపెనీ తప్పుడు కొనుగోళ్లను చూపించి, శ్రీరామ్ ఎంటర్‌ప్రైజెస్ అనే మరో సంస్థకు ఐటీసీని పాస్ చేసిందని తెలిపింది. శ్రీరామ్ ఎంటర్‌ప్రైజెస్ రూ.700 కోట్ల విలువైన బోగస్ ఇన్వాయిస్‌లను చూపి రూ.116 కోట్ల ఐటీసీని క్లెయిమ్ చేసిందని పేర్కొంది. ఈ కేసులో ఈడీ అధికారులు బ్యాంకు బ్యాలెన్స్‌లను ఫ్రీజ్ చేసి, స్థిరాసులకు సంబంధించిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని వినర్థ్ ఆటోమొబైల్ అనే కంపెనీ 2022-23, 2023-24లలో వాహనాలను తయారు చేసి, విక్రయించినట్లు రూ.110 కోట్ల టర్నోవర్‌ను చూపి మోసానికి పాల్పడింది. బోగస్ ఇన్వాయిస్‌లతో వాహనాలను సరఫరా చేసినట్లు చూపి, జీఎస్టీ రీఫండ్‌ను క్లెయిమ్ చేసింది.

డిసెంబరు నుంచి వందేభారత్ షెడ్యూలు మార్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల పరిధిలో ప్రయాణించే నాలుగు వందేభారత్ రైళ్ల షెడ్యూల్‌లో మార్పులు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. కాచిగూడ-యశ్వంత్‌పూర్-కాచిగూడ (20703-20704) మధ్య నడిచే రెండు వందేభారత్ రైళ్లకు ఇప్పటి వరకు బుధవారం మినహాయింపు ఉండగా, డిసెంబర్ 12నుంచి శుక్రవారానికి మారుతుందని రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ (20707-20708) మధ్య ప్రయాణించే మరో రెండు వందేభారత్ రైళ్లకు ప్రతి గురువారం మినహాయింపు ఉండగా.. డిసెంబర్ 5నుంచి సోమవారానికి మార్చినట్లు తెలియజేశారు.

ఫిజియోథెరపిస్టులు'డాక్టర్' అని పెట్టుకోవచ్చు

» **పీఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ**

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఫిజియోథెరపిస్టులు తమ పేరు ముందు 'డాక్టర్' అని రాసుకోవచ్చని.. అయితే, పేరు చివరన మాత్రం ఫిజియోథెరపిస్టు అని స్పష్టంగా సూచించాలని పీఎఫ్ఐ (ఫిజియోథెరపిస్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ బాపట్ల వెంకట హరికృష్ణ తెలిపారు. ఇటీవల డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) జారీచేసిన లేఖ ఆధారంగా సరైన నిర్దేశం లేకుండా.. ప్రసార మాధ్యమాల్లో ఫిజియోథెరపిస్టుల వృత్తి గురించి అపోహలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. ఫిజియోథెరపిస్టులు తమ పేరు ముందు డాక్టర్ అని రాసుకోకూడదని ఆదేశాలు జారీచేసిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ సునీత శర్మ.. దీనిపై ఫిజియోథెరపిస్టుల నుంచి దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తడంతో ఆ ఉత్తర్వులను 24 గంటల్లోనే ఉపసహరించుకున్నారని ఆయన తెలిపారు.



రూ.12 వేల కోట్లు కాదు.. రూ.12 కోట్లే!

» **హైదరాబాద్‌లో పట్టుకున్న డ్రగ్స్ ముడి పదార్థాల విషయంలో మహారాష్ట్ర పోలీసుల ప్రచారంపై రాష్ట్ర పోలీసుల అభ్యంతరం**

» **ఈ అంశంపై ఇంటెలిజెన్స్, ఎక్సైజ్‌శాఖ అధికారుల విచారణ**

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర పోలీసులు హైదరాబాద్‌లో జరిపిన ఆపరేషన్‌పై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చర్లపల్లిలో అక్రమంగా నడుస్తున్న రసాయన పరిశ్రమపై దాడి చేసి మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడం అభినందనీయం అయినప్పటికీ.. పట్టుకున్న రసాయనాల విలువపై చేస్తున్న ప్రచారంపై తెలంగాణ పోలీసు, ఎక్సైజ్ వర్గాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముంబయి పోలీసులు పట్టుకున్న 5.790 కిలోల డ్రగ్ విలువ రూ.11.58 కోట్లు మాత్రమేనని మిగిలిన కెమికల్స్, ఇతర సామగ్రి విలువ కలిపినా మొత్తం రూ.12 కోట్లకు మించదని రాష్ట్ర నిఘా వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఈ ముడి పదార్థాలతో రూ.12వేల కోట్ల విలువైన డ్రగ్స్ తయారు చేయవచ్చంటూ ముంబయి పోలీసులు చేసిన ప్రకటన వివాదాస్పదంగా మారింది. దీనిపై తెలంగాణ ఇంటెలిజెన్స్, ఎక్సైజ్‌శాఖ అధికారులు విచారణ చేపట్టారు. కాగా.. చర్లపల్లిలో నిర్వహిస్తున్న ఆ డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీకి ఎలాంటి అనుమతులూ లేవని తేలింది. నాచారంలో 2017లో ఒక ఫ్యాక్టరీ కోసం దువ్వూరి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి అనుమతి తీసుకున్నా.. అది ప్రారంభం కాకుండానే యాజమాన్యం ఓలేటి అజయ్, శ్రీనివాస్ అనే వ్యక్తుల పేరు మీదకు మారింది. వీరు నాచారం బదులు చర్లపల్లిలో అక్రమంగా ఈ ఫ్యాక్టరీని నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

మీరెందుకు గుర్తించలేకపోయారు?

ముంబై పోలీసులు డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు చేసిన వెంటనే మంత్రి జూపల్లి కృష్ణారావు ఎక్సైజ్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి.. . "వారు ఇక్కడికి వచ్చి దాడులు చేసేదాకా మీరెందుకు గుర్తించలేకపోయార"ని మంత్రి ప్రశ్నించినట్లు తెలిసింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించే అంశంపైనా మంత్రి వారితో చర్చించారు. అయితే.. అలా చేయడంవల్ల పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేసినట్లు అవుతుందనే అభిప్రాయాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

ఇదేం గోల గోవిందా!

కొండకు మద్యంబాబుల బెడద.. ఉచిత భోజనం,వసతి దొరకడంతో కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ట వేసిన వైనం

» పగలు ఏవేవో పనులతో కాలక్షేపం
» రాత్రయితే అరాచక, అపచార చేష్టలు
» తింటూ, తాగుతూ రోడ్లపై వీరంగం
» షెడ్లు, యాత్రికుల వసతి సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్ వీరి అడ్డాలు
» గోవిందనామ స్మరణ జరిగేచోట ఇవేం అగడాలంటూ నొచ్చుకుంటున్న భక్తులు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)



పవిత్రభావనతో స్వామివారిని దర్శించుకునే భక్తులకు పట్టెడన్నం పెట్టి సేదతీర్చే తిరుమల కొండపై ఆకయితాల ఆగడాలు అదుపు తప్పాయి. ఉచిత బోజనం, వసతి దొరుకుతుండటంతో చాలామంది కొండపైనే తిష్ట వేశారు. వారు పగలు నామాలు పెట్టడం, దేవుని పటాలు, బొమ్మలు విక్రయిస్తూ గడుపుతున్నారు. అందరూ కాదుగానీ, వీరిలో కొందరు రాత్రి అయితే మద్యం తాగి కొండపై హల్‌చల్ చేస్తున్నారు. నిత్యం గోవింద నామస్మరణ జరిగే ప్రాంతం తిరుమల కొండ. అలాంటిచోట అక్కడ తరచూ ఘర్షణలు జరుగుతూ, మద్యంమత్తులో కొందరు కేకలు వేస్తూ రోడ్లమీద తిరుగుతుండటం, భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. కొండ పవిత్రతకు అపచారం తెచ్చిపెట్టే ఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. గత గురువారం రాత్రి మద్యం మత్తులో హేమకుమార్ అనే హాకరు మరోహాకర్ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి చీపురు కర్రతో దెబ్బలు తిన్నాడు. అంతేకాదు, గత ఐదారేళ్లలో కొందరు వ్యక్తులు మద్యం, మాంసం, గంజాయి విక్రయిస్తూ, పట్టుబడిన సందర్భాలున్నాయి. ఇలా అనధికార వ్యక్తులు క్షేత్ర పవిత్రత, ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు. 'ఇదేం గోల గోవిందా' అంటూ భక్తులు వాపోయే పరిస్థితి వచ్చింది.

ఇబ్బందిపడుతున్న భక్తులు

తిరుమల కొండకు వస్తున్నవారిలో కొంతమంది అక్కడే ఏవో పనులు చూసుకుంటున్నారు. సొంతూర్లలో అప్పులైపోయినా, ఏదైనా గొడవలైనా భక్తుల్లో కలిసిపోయి జీవించడానికి తిరుమల అనువుగా మారిపోయింది. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచీ చాలా మంది తిరుమల కొండెక్కేస్తున్నారు. ఎక్కినవారు తిరిగి దిగడం లేదు. హాకర్లుగా కొంతమంది, భవన కార్మికులుగా మరికొంతమంది కొండను అడ్డాగా మార్చుకున్నారు. వీరిలో కొంతమంది తరచూ ఆలయ నిబంధనలను భంగపరుస్తున్నారు. మాంసం తీసుకుంటూ, మద్యం తాగుతూ కొందరు హడావుడి చేస్తే, గంజాయి మత్తులో మరికొందరు వీరంగం సృష్టిస్తున్నారు. తిరుమలలోని షెడ్లు, యాత్రికుల వసతి సముదాయాలు వీరి అడ్డాలు. రూపాయి ఖర్చు లేకుండా టీటీడీ ఉచితంగా అందజేసే అన్నప్రసాదాలను తింటూ వీరిలో చాలామంది కాలక్షేపం చేస్తుంటే, కొందరు మాత్రం ఆకతాయి చేష్టలతో భక్తులకు తలనొప్పిగా మారారు.

అపచారం..

- ఈ ఏడాది జనవరి 17వ తేదీన తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన 28 మందితో కూడిన అన్యమత బృందం తిరుమలలోని రాంభగీచ వద్ద కోడిగుడ్ల కూర, పులావ్ తినడం విమర్శలకు దారి తీసింది.
- మార్చి 13న కర్ణాటకకు చెందిన ఓ యువకుడు మద్యం తాగి మాడవీధుల్లోని అర్చక నిలయం సమీపంలో ఉన్న గ్యాలరీల్లో హల్‌చల్ చేశారు. ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పోలీసులకు కూడా మద్యం విక్రయిస్తానంటూ వీరంగం సృష్టించాడు.
- మార్చి 17వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు అన్నదమ్ములు మద్యం తాగి దారిన వెళ్లే ముగ్గురు కూలీలపై దాడి చేశారు. రోడ్డుపై బిగ్గరగా కేకలు వేస్తూ వచ్చివెళ్లే వాహనాలను అడ్డుకున్నారు. విజిలెన్స్ సిబ్బందికి కూడా వారిని అదుపుచేయడం సాధ్యం కాలేదు. మొబైల్ వాహనం అద్దాలను పగలగొట్టగా, ఓ విజిలెన్స్ అధికారి గాయపడ్డారు.
- 2024 నవంబరులో ఘాట్‌రోడ్లలో ఖాళీ మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు కనిపించడం కలకలం సృష్టించింది.
- 2024 ఆగస్టు 17వ తేదీన ఇద్దరు హాకర్లు గాజుబాటిళ్లతో ఒకరిపై ఒకరు పట్టపగలు నడిరోడ్డుపై దాడి చేసుకున్నారు. రక్తగాయాలతో పెద్దగా కేకలు వేసిన వారిని చూసి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు.

పాలస్తీనా సమస్యపై యూఎన్ జనరల్ అసెంబ్లీ తీర్మానం

» **అనుకూలంగా భారత్ ఓటు**

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబరు 12 : పాలస్తీనా సమస్యకు 'న్యూయార్క్ డిక్లరేషన్'ను ఆమోదించడం.. రెండు దేశాల ఏర్పాటు ద్వారానే శాంతియుత పరిష్కారం లభిస్తుందన్న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానానికి అనుకూలంగా భారత్ శుక్రవారం ఓటు వేసింది. ఫ్రాన్స్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి అనుకూలంగా 142 దేశాలు ఓటు వేశాయి. 10 దేశాలు వ్యతిరేకించగా.. 12 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, హంగేరీ, అర్జెంటీనా తదితర దేశాలు దీనికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. కాగా ఐక్యరాజ్య సమితి హెడ్‌క్వార్టర్స్‌లో ఫ్రాన్స్, సౌదీ అరేబియా ఆధ్వర్యంలో జూలైలో నిర్వహించిన ఉన్నత స్థాయి అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ఈ 'న్యూయార్క్ డిక్లరేషన్'ను ప్రవేశ పెట్టారు. గాజాలో యుద్ధాన్ని ముగించేందుకు కలిసికట్టుగా కృషి చేయాలని అందులో పేర్కొన్నారు. ఇజ్రాయెల్-పాలస్తీనాల మధ్య నెలకొన్న వివాదాలకు న్యాయమైన, శాంతియుత పరిష్కారం చూపేందుకు రెండు దేశాల ఏర్పాటు తప్పనిసరి అని స్పష్టం చేశారు.

బెయిల్ పిటిషన్లపై 2 నెలల్లో నిర్ణయం తీసుకోండి

» **హైకోర్టులకు సుప్రీంకోర్టు సూచన**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12: రెగ్యులర్, ముందస్తు బెయిల్ పిటిషన్లపై రెండు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు శుక్రవారం అన్ని హైకోర్టులకు సూచించింది. బెయిల్ పిటిషన్లను దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో పెట్టడం న్యాయాన్ని నిరాకరించడం కిందకే వస్తుందని వ్యాఖ్యానించింది. దీనిపై అన్ని జిల్లా కోర్టులకు సూచనలు ఇవ్వాలని హైకోర్టులను ఆదేశించింది. వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన పిటిషన్లను సంవత్సరాల తరబడి 'అనిశ్చితి మేఘాల్లో' ఉంచడం సరికాదని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం అభిప్రాయపడింది. కేసులోని మెరిట్ ఆధారంగా త్వరగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. అందువల్ల పిటిషన్ దాఖలయిన 2 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దర్యాప్తు సంస్థలు కూడా త్వరగా విచారణలను ముగించాల్సి ఉంటుందని తెలిపింది. బెయిల్ పిటిషన్లు పేరుకుపోకుండా హైకోర్టులు తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని సూచించింది. ఫోర్జరీ, మోసం కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించిన బాంబే హైకోర్టు ఆదేశాలను కొట్టివేస్తూ ఈ వ్యాఖ్య చేసింది. బెయిల్ పిటిషన్‌ను దీర్ఘకాలంగా పెండింగ్‌లో పెట్టడాన్ని గుర్తించి అలా చేయకూడదని సూచనలు ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.